# ప్రజాకళ

ప్రజాస్వామిక సాహిత్య పత్రిక

# దళిత సాహిత్యం



ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి
యినుపగజ్జెల తల్లి జీవనము సేయు
గసరి బుసకొట్టు నాతని గాలిసోక
నాల్గు పడగల హైందవ నాగరాజు

- గుర్రం జాషువా

జనవరి 2007 సంచిక

మీ రచనలు, అభిప్రాయాలు పంపించండి, నిర్మాణాత్మక చర్చలో పాల్గొనండి

Editor@Prajakala.org

## సూచిక

**కవిత్వం:**


గబ్బిలం - గుర్రం జాషువా ..................... 4
బి.పి. - మద్దూరి నగేష్‌బాబు..................... 6
చావు డప్పు - వరవరరావు..................... 10
నడుస్తున్న చరిత్ర - శివసాగర్ ..................... 14
నల్లతల్లి - ఎండ్లూరి సుధాకర్ ..................... 15
నల్లకలువ - కత్తి పద్మారావు..................... 18
కలవని కనుపాపలు - సతీష్ చందర్..................... 22
దళిత వ్యాకరణం - తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ ..................... 25


**వ్యాసాలు:**


దారుణ అనుభవాల సంపుటాలు: దళిత సాహిత్య సంకలనాలు - ఎన్. వేణుగోపాల్..................... 28
దూదేకుల కవిత్వం - ఖాజా ..................... 34
వేంపెంట దళిత - సాహిత్య సృజన - పెద్దరామస్వామి..................... 45
ద్వైవచింతన - డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్ ..................... 52


**పాటలు:**


ఏ కులమబ్బీ - చెరబండరాజు ..................... 55
నల్లాటి సూరీడు - శివసాగర్ ..................... 57
యాలరో ఈ మాదిగ బతుకు - గద్దర్ ..................... 60


**కథలు:**


తాటకి - గోగు శ్యామల ..................... 66
సూర్యుడు తలెత్తాడు - ఆచార్య కొలకలూరి ఇనాక్..................... 74


**ఇంటర్వ్యూ:**


ప్రముఖ దళిత కవి మద్దూరి నగేష్‌బాబు తో ఇంటర్వ్యూ - ఖాజా ..................... 78


**నవల:**


ప్రజల మనిషి – 3 - వట్టికోట ఆళ్వార్‌స్వామి ..................... 83

Disclaimer:

ప్రజాకళలో  ప్రచురించిన రచనల్లో ఆయా రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయలతో ప్రజాకళకు అంగీకారం కానీ తిరస్కారం కానీ లేవు. ఒక ప్రజాస్వామిక సాహిత్య వాతావరణం ఏర్పాటు చేసే ప్రయత్నంలో అన్ని రకాల ప్రజాస్వామిక అభిప్రాయాలకు జాగా ఇవ్వాలనేదే మా ప్రయత్నం. అందుకనే విభిన్న అభిప్రాయాలని ప్రకటించే రచనలని మేము ప్రచురిస్తున్నాం. ఈ రచనల పై పాఠకులనుండి నిర్మాణాత్మక చర్చను ఆహ్వానిస్తున్నాం. దయచేసి మీ అభిప్రాయాలని తెలుగులో రాయండి. ఉపయోగకరమైన చర్చ జరిగేందుకు తోడ్పడండి.

## గబ్బిలం

- గుర్రం జాషువా

ముప్పు ఘటించి వీని గలిమిన్ గబళించి దేహమున్
బిప్పి యొనర్చు నీ భరత వీరుని పాదము కందుకుండగా
జెప్పులు గుట్టి జీవనము సేయును గాని నిరాకరింప లే
దెప్పుడు నప్పు వడ్డది సుమీ భరతావని వీని సేవకున్

వాని ఱెక్కల కష్టంబు లేనినాఁడు
సస్యరమ పండి పులకింప సంశయించు
వాడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు
భోజనము బెట్టు వానికి భుక్తి లేదు

వాని తలఁ మీద బులిమిన పంకిలమును
గడిగి కరుణింపలేదయ్యె గగనగంగ
వాని నైవేద్యమున నంటు వడిన నాడు
మూఁడు మూర్తులకును గూడఁ గూడు లేదు

పామునకుఁ పాలు, చీమకుఁ బంచదార
మేపుకొనుచున్న కర్మభూమిఁ జనించు
ప్రాక్తనం బైన ధర్మదేవతకుఁ గూడ
నులికిపడు జబ్బు గలదు వీఁడున్న చోట

వాని నుద్ధరించు భగవంతుఁడే లేఁడు
మనుజుఁడెట్లు వాని గనికరించు
వాడు జేసికొన్న పాపకారణమేమొ
యింత వఱకు వాని కెఱుకలేదు

ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి
యినుపగజ్జెల తల్లి జీవనము సేయు
గసరి బుసకొట్టు నాతని గాలిసోక

నాల్గు పడగల హైందవ నాగరాజ

* * *

(గబ్బిలం లోంచి)

గమనిక: గబ్బిలం దీర్ఘకవితను పి.డి.ఎఫ్ ( PDF format ) లో చదవండి
http://prajakala.org/PDF/gabbilam.pdf

## బి.పి. -మద్దూరి నగేష్‌బాబు

రక్తమే సముద్రమైందో – లేక
సముద్రమే రక్తమై నరాల్లో వొదిగిందోగానీ
ఈ ఆటూ పోట్ల నెత్తుటి చెలగాటంలో
బతుకొక తీరంలేని పడవ....

సప్పిడి పప్పు కలిపిన కూటిలో కూడా
కాస్త చిన్నుల్లిపాయాకారానికి నోటుండదు

కమ్మటి సల్లబువ్వలో కూడా
సిటికెడు ఉప్పు కలపటానికి కూడా సేతులు రావు

సట్టిలో రొయ్యలకారం పళ్లికిలిస్తూ
ఆదివారపు మసాలావాసన ఎగదోసి వెనక్కిపోతూ
ఛీ.... ఇదొక 'నెత్తుటి కూడు'

పంట కాలవ లాగ
అప్పుడే కుతికె తెగిన దున్నకుర్ర గొంతులో నుండి ఎగిసిన నెత్తుటి ధారలాగ
నా రక్తానికి ప్రవహించమని ఎవరు ఆజ్ఞలు జారీ చేశారు?
ప్రవహిస్తే ప్రవహించింది...
సిన్నప్పుడు సెడుగుడు వయసులా
అప్పుడు పరిగెత్తితే పరిగెత్తనీ
ఇప్పుడీ ముప్పయ్యేడేళ్ల ముసిల్తనంలో పిల్ల చేష్టల్లా
ఉండమన్న చోటుండకుండా ఉరికే నెత్తురికి
ఎంత పిచ్చిది కాకపోతే మాత్రం
గుండె కాయ కడుపు చించుకున్న కన్నతల్లై కూకుంటదా
దొరగార్ని చూసి గబక్కన లేవలేకపోతే పట్టినట్టు
ఈ రోగం వచ్చీరాక ముందే సిరిసెవట్లు
కుప్ప నూర్పిళ్లయ్యిందాకా కూటికి లేసేదే లేనంటే తిరిగినట్టు
ఈ మాయదారి జబ్బు అంటుకుందంటే

తిర్నాల రంగుల రాట్నం తిరిగినట్లు కళ్లు ఒకటే తిరుగుడు
కలెక్టరయ్య గోర్ని చూసినప్పుడు ఎట్టోడికి పుట్ట కొచ్చినట్టు
గుండెల్నిండా అదుపు చేసుకోలేని దడ

నిన్నటి దాకా ఈ రోగం రాకముందు దాకే నయ్యం
ఊరోళ్లు గొడ్డళ్లలో నరకందే
నాకాళ్లు గిజగిజాలాడవు
నాకు వొకటికో రెంటికో వచ్చినట్టుండదు

దొంగ సెత్తురు
ఇన్నాళ్లు తక్కువోడని ఎవురన్నా ఎంత ఇది చేసినా
అప్పుడెందుకు పరిగెత్తలేదూ?

ఎంత ఉద్యోగమొచ్చినా
ఎంత ముడ్లో సొక్కా ఏసుకోని, బంగారపు గొలుసులు దిగేసుకొని
ఎంత పోజుగొట్టినా
ఎక్కడా తక్కువ సూపే తరాజులో బరువైతూగుతుంటే
అప్పుడీ సెత్తుటి ఉరుకు ఎక్కడ వచ్చింది?

ఇన్నాళ్లూ కోపాన్నంతా
కులం తక్కువ తనంతో తలొంచుకుంటా తగ్గిచ్చుకుంటావస్తే
ఇప్పుడీ రొస్టు
బిళ్లలేస్తే తప్ప తగ్గి సావటం లేదు
ఈ వైద్యుడొకడు....
మందు ముట్టమాకంటాడు
ముట్టుకుంటే మట్టైపోతావంటాడు

రేయంబగుళ్లూ సేలలో శాకిరై వొళ్లునెప్పులై అల్లాడతంటే
కాస్త సర్దుకోవటానికి మందుగాక మందుబిళ్ల లేసుకోవటానికి
నేనేవన్నా ఊళ్లల్లో ఊరేగుతున్న ఉండోడి కొడుకునా?
నా అనుమానం ఈ డాక్టర్లు కూడా పెద్ద కులపోళ్లే
లేకపోతే ఇన్నాళ్లూ నా మాంసాన్ని వాళ్ల మాగాళ్లకి ఎరువుగాసల్లినా సాలక

ఎగబడి నేనె ఎంటబడి నరికి నాసెత్తుర్ని ఎండ్రిన్లాచల్లుకున్న నోట
ఈ రోగం పుణ్యాన్నైనా కనీసం కవిత్వంలోనైనా
నా శత్రు మాంసాన్ని తింటాన్నంటే వొద్దంటారా!

మాతాత మా అయ్య మా సినబ్బ
అందరూ సచ్చినట్టే
నేనూ ఏ గుండెపోటొచ్చో గుటుక్కుమనొచ్చు
మా అయ్య సమాధికాడ
ఎటుపోవాలో తెలీక దిక్కులేనోణ్ణై నేను నిలబడ్డట్టు
నా ఇద్దరు పిల్లలూ నిలబడొచ్చుగాక
ఇన్ని వేల ఏళ్ల అడ్డగోలు తనానికి ఎదురు నిలబడి
ఇప్పుడైనా యుద్ధం చేయటానికి
నారోగం నాకు కోపాన్నిచ్చింది
నా బి.పి. నాకు బతుకు పోరుబాట నిచ్చింది
అమ్మా! రక్తపోటా! అందుకు నీకు వందనాలు తల్లీ
అందుకే నీకు కోటానుకోట్ల నమస్కారాలు
తండ్రీ….. ఏసయ్యా

రక్తం చిందించందే
పాపులకు విముక్తిలేదని నీరక్తాన్నే చిందించావే….
తిరిగి లేచాక కూడా
నీ గాయాలను తడమందే నమ్మని తోమాల్ని భరించావే

నీకున్న సహనాన్ని నాకివ్వనందుకు
నీకూ నమస్కారాలు తండ్రీ
నాకిసువంటి సెత్తుర్నిచ్చినందుకు
నీకీ స్తుతులూ స్తోత్రాలు నాయనా!
దేవుడివి కాబట్టి

ఈ దేశంలో ఉండీలేనట్టు రిజర్వేషన్లు పొడిగించినట్టు కాక
నువ్వింకా ఖచ్చితమైన కృపాకాలాన్ని పొడిగిస్తున్నావు కానీ

లూసీఫర్ లయలమారి మాటల్ని నమ్మి మోసపోయిన
ఆదాము అవుల ముని ముని ముని ముని ముని మనవాణ్ణి
నేను కృపాకాలాన్నివ్వ లేకపోతున్నా తండ్రీ
నన్ను మన్నించు
మాలెక్కల ప్రకారం నువ్వాగింది రెండువేల సంవత్సరాలే
లెక్కలకందని మా కృపాకాలం నాలుగువేల సంవత్సరాలు దాటింది
తండ్రీ
ప్రభువా....
నా జాతికంతటికీ చివరి ఆశీర్వాదంగా
రక్తపోటునిచ్చి చూడు తండ్రీ
మేమంతా.......
హిత్సవత్సరాలమై నీ సాక్ష్యంగా వుంటాం

20-4-2001

## చావు డప్పు - వరవరరావు

శ్రమ నిష్ఫలమై ఫలం భోజ్యమయిన పరాన్న భుక్కులు
సంస్కృత భాషలోనైనా మమ్ములను అస్పృశ్యులనే అన్నారు
అధికారం ముందు చేతులు కట్టుకొని
దొర అని సాబ్ అని సార్ అని పిలిచిన వాళ్ళను
తమలో తాము చాటుకు తిట్టుకోవడానికి
మమ్ములను మ్లేచ్ఛులను చేసి వాళ్ళను పోల్చారు

చండాలురమైనా చర్మకారులమైనా
మాల మాదుగులమైనా మనుషులుగా అంటరానివాళ్ళం
పెంపుడు కుక్కలమైనా
యజమానులకు మా మీద విశ్వాసం ఉండేది
అడవి పందులమైనా
మాకు జరిగే అవమానాలకు ఒంటిమీద ముండ్లొచ్చేవి

ఊరూవాడా ఊడుస్తాంగానీ
దొరల బాటల్లో మా నీడకూడా పారకూడదు
పీతిరిదొడ్లు కడగడానికైనా పెద్దమైసమ్మను చేయడానికైనా
పెంటకుప్పలెత్తడానికైనా పంటకుప్పలు నూర్చడానికైనా
మాకు అంటులేదు
నీరేటిగాళ్ళం మేమే కాని మేం ముట్టుకున్న నీళ్ళు తాగరు
కైకిలి నుంచి కళ్ళం నూర్చేదాకా
వెట్టికైనా పెద్ద మాదిగోళ్ళమయినా మేమే
మేం బండ్లకెత్తిన పంటలన్నీ మాచీమూనెత్తురే
అది వాళ్ళకు పంచభక్ష్య పరమాన్నమవుతుంది
తాలూ తప్పా మిగిలిన పొలాలవంటి
కొయ్యకాళ్ళు మిగిలిన చేన్లవంటి
మా జీవితాల్లో మేం

మా చెమటలో మట్టి పిసుక్కుని గాయాలనద్దుకొని తినాలి
గొడ్డులా పనిచేసి చచ్చిన గొడ్లని పీక్కు తినాలి
మమ్మల్ని మురికి కూపాల్లోకి తరిమేసి
మావి మురికి బతుకులని ఈసడిస్తారు
ఆరుగాలం మట్టిలో పనిచేసే వాళ్ళకు
మట్టిరంగు గాక అసూర్యంపశ్యల రంగు ఎలా వస్తుంది

అయినా అదేం న్యాయమో
చల్ల చుక్కేస్తే దాహానికి తప్పులేనట్లు
గడ్డివాముల్లో దొడ్లలో కాలువ గట్లలో పొదల్లో
బలవంతంగా మా ఆడవాళ్ళతో పొర్లడానికి మాత్రం
అంటులేదు
నిప్పుతో కడిగిపెట్టినా మేం చాయ్ తాగిన
గ్లాసులో తాగితే మాత్రం వాళ్ళకు గత్తరొస్తుందంట

కోళ్ళగూడు పసులకొట్టం ప్రహరీగోడ లోపలే వుంటాయిగానీ
మాదిగ వాడలయినా హరిజన కాలనీ అయినా
వాళ్ళ ఇళ్ళకే కాదు ఊరికీ దూరంగా వుండాల్సిందే

మా దేవతలూ క్షుద్ర దేవతలే
రామయ తండ్రికి మా మీద దయ కలిగితే
శబరిచేత సేవలుపొంది శంభూకుని చంపడానికి వస్తాడు
అడవికి పోయినట్లు ఆ రాజు
మాదిగపల్లెకోసం వేరుగా దేవాలయం కట్టుకొని
వాళ్ళ తెరువు పోకుండా
వాళ్ళ అంటూసొంటూ లేకుండా
మాకు మంచినీళ్ళ బావులూ వేరే బళ్ళలో సీట్లూ వేరే

పొరంబోకు భూములు బీళ్ళూ తుప్పలూ రాళ్ళూ రప్పలూ
పొతం చేసే దాకా మావే
తొండలుకూడ గుడ్లు పెట్టని భూములు

కాశ్మీర ఖండాలయ్యాక మాత్రం

కల్లు నీళ్ళకు కామందులకు అమ్ముకుంటాం

మాది తాగుబోతు కులంగదా

బీర్లూ విస్కీలు తాగే పెద్ద దొరలు

బీదవాళ్ళని దయతల్చి

గొంగడి ఇచ్చినా గొడ్లు ఇచ్చినా

అప్పు ఇచ్చినా సబ్సిడీ ఇచ్చినా

అన్నీ కరగతాగి అన్నమో రామచంద్రా అని

ఆకాశం కింద మిగులుతాం

తెల్లదొరలు మమ్ములను దేవుని బిడ్డలన్నారు

దేవునిబిడ్డ జీసస్ శిలువ మోసినట్లుగానే

మేం మా వీపుమీద నాగలి మోస్తున్నాం

నల్ల మహాత్ముడు మమ్ములను హరిజనులన్నాడు

వీపుమీద కొడితే కడుపుమీద కొట్టమని చూపుతున్నాం

మా బాబా సాహెబు మమ్మల్ని నవబౌద్ధులన్నాడు

అందుకే రాజ్యాన్ని వాళ్ళకు పరిత్యజించి

సంఘాన్ని శరణుజొచ్చాం (మత) ధర్మాన్ని శరణుజొచ్చాం

రాజ్యాంగం మమ్మల్ని వోటర్లను చేసింది

మాకు సీట్లూ రిజర్వు చేసింది

వాళ్ళకు వోటేసినపుడు వాళ్ళ నోట్లోకి

మేమే వేసుకున్నపుడు మా కంట్లోకి మా వేలు పోతున్నట్లున్నది

అమ్మా అంటూ చచ్చిన కంచికచెర్ల కోటేశులం మేమే

అన్నా అంటూ చచ్చిన నీరుకొండ శేషయ్యలం మేమే

కారంచేడయినా అగ్రకుల అహంకారం కంట్లో

గుప్పెడు కారం కొట్టిందే తప్ప

ఇంకా చూపుడువేలులో సురేకారం దట్టించాల్సే వున్నది

మేం అణగి వున్నంతకాలం వాళ్ళు మా ఒలికిన నెత్తురు

పాలు పొంగించుకొని అనుభవిస్తారు
అది కుదరదనగానే అచ్చం నెత్తురునే తాగేస్తున్నారు
వాళ్ళ కళ్ళ మంటలకు మా పల్లెలు భగ్గుమంటున్నాయి

మా నెత్తురూ ఎర్రగానే ఉంటుందని మాకు తెలియడం మంచిదే
పల్లెలో పనిలో బడిలో గుడిలో
కులం ఏలుబడిలో గీసిన సరిహద్దులు
యుద్ధంలో చెరిగిపోవడం మంచిదే

నాట్లేసిన చేతులు వోట్లేసిన చేతులు
ముట్టుకుంటే బుసకొట్టే వ్యవస్థ
నెత్తుటిస్నానం చేస్తున్నది
అగ్నిస్నానం చేస్తున్నది
శవాలంకారం పూర్తికానీ
పాడె లేవగానే
ఇదివరకూ చావు డప్పు మేమే కొట్టేవాళ్ళం
పీనుగుల్ని పూడ్చేవాళ్ళం
కాల్చే వాళ్ళం
కాటి కాపరులమూ మేమే

ప్రేతం ఇంక భూతం కాకుండా
అవతారం ఎత్తకుండా
ఆ అంటువ్యాధి క్రిములు మిగలకుండా
ఈ నేలనింక సమూలంగా దున్నేస్తాం
దళిత ద్రుమదళ వికసన్నవ పరిమళాన్ని ప్రకటిస్తాం

## నడుస్తున్న చరిత్ర - శివసాగర్

శంభూకుడు పెదాల మీద చిరునవ్వుతో
రాముణ్ణి వధిస్తున్నాడు
ఏకలవ్యుడు ద్రోణుని బొటనవేలున
గొడ్డలితో నరుకుతున్నాడు.
బలి తన చిరుపాదాలతో వామనున్ని
పాతాళానికి తొక్కేస్తున్నాడు.

మనువు కళ్ళల్లో సూదులు గుచ్చుకుని
నాలిక తెగ్గోసుకుని
చెవిలో సీసం పోసుకుని
శ్మశానంలో దొర్లుతున్నాడు

కాలం కసాయి కత్తి మీద నిలబడి
గర్జిస్తున్న ఛండాలుడు
ఆది శంకరుని పై నాలుగు వేట కుక్కల్ని
ఉసిగొల్పుతున్నాడు

ఓహో ... !
ఇప్పుడు నడుస్తున్న చరిత్ర
పరమ ఛండాల చరిత్ర.

## నల్లతల్లి

- ఎండ్లూరి సుధాకర్

నల్ల రంగే కదా
నిన్ను పేరంటాలకూ
పెళ్ళిళ్ళకూ రాకుండా చేసింది
నీ నల్లని పాదాలుచూసి
తెల్లకళ్ళు వాంతులు చేసుకునేవి
వాయినాలు నీలో దు:ఖ వాయులీనాలవుతుండేవి
నీకు గుర్తుందా అమ్మా!

మన ఎదురింటిమేడమీది అమ్మాయి సమర్తాడితే
నీ కూతురు పెద్దమనిషి అయినంతగా
పొంగిపొయ్యావు

గుండెను బంతిగా ఆకాశంలోకి ఎగరేశావు
వాడవాడలా నోటి దండోరా వేశావు
కనీసం ఎవరూ మన ఇంటి గడప తొక్కలేదు
అంతటా అసహ్యం మురిక కాల్వలా మొహాల్లో
ప్రవహించేది

బొట్టులేని నీ కాటుకరంగు నుదురు చూస్తే
కుంకుమ భరిణెలు నెత్తురు కక్కుకునేవి
నేను మరిచాననుకున్నావా
ఎవరైనా దయతలిచి పిలిస్తే
ఒక మూల బిక్కుబిక్కున నక్కినక్కి కూర్చుని
సిగ్గుతో అన్నం తిని
చెంబు చంకలో పెట్టుకొని
విస్తరాకు ఎత్తుకొని
భయం భయంగా అర్థాకలితో వెళ్ళిపోయేదానివి
ఏ కొళాయి దగ్గరో బావి ధ్గగరో
నువ్వు దాహమై నిల్చినపుడు

నీ నల్లకుండలో వెలిగాలులు వీస్తున్నప్పుడు
ఎన్ని తిట్లు సూదులై
నీ గుండెల్లో కుట్లు వెయ్యలేదు?
బలిసిన అహంకారాలన్నీ
జింకతనం లాంటి నీ అమాయకత్వం మీద
చీకటి పులులై ఎన్నిసార్లు ఎగబడి పంజాలు
విసరలేదు?

నీకు కులం పేరే తప్ప
నీ సొంతపేరు పెద్దనోళ్ళకు తెలియదు కదా
ఆటల్లో నేను దెబ్బలు తిని వచ్చినప్పుడు
నువ్వు కన్నీటి కత్తివై
లోలోన తరుక్కుపోయేదానివి
ఎప్పుడూ ఒక నల్ల గొడుగు నీ నెత్తిమీద
నీలిదెయ్యమై వెంటాడుతుండేది
మన పండక్కి కర్జకాయలు చేసి
ప్రేమ పళ్ళెంలో పెట్టి వాళ్ళిళ్ళకి పంపిస్తే
అర్ధరాత్రి దొంగచాటుగా విసరేసిన సెత్తుటికందుల్లా
తెల్లారి చెత్తకుండీల్లో ప్రత్యక్షమయ్యేవి
నువ్వెంత కలవాలనుకున్నా
నీ నల్లమాటలకు మీగడలద్ది
అప్యాయంగా వరుసలు కలుపుకున్నా
కొన్ని చూపులు నిప్పుకోళ్ళై తప్పుకునేవి
మనం ఎప్పుడైనా మాంసం కూర వండుకుంటే
అది ఏ మాంసమో తెలుసుకునేందుకు
రకరకాల మీమాంసలు గుసగుసలాడుకునేవి
నీ ముట్టుబట్టలకు రహస్యంగా నిప్పుబెట్టి
నువ్వు కడుపునొప్పితో మెలికలు తిరుగుతుంటే
చూడాలని

దిష్టికళ్ళు ఎంత ఆబగా చూసేవి

నిన్ను అకారణంగానూ అన్యాయంగానూ
కొప్పుపట్టి లాగి కొడుతున్నప్పుడు
నీమీద ఆకూవక్కా నమిలి ఉమ్ముతున్నప్పుడు
ఆడ దుశ్శాసినులనీ కోకలు చింపుతున్నప్పుడు
ఒక కొడవలి లాగో
ఒక కాళజుకలాగో మారకుండా
ఆడక్రీస్తులా
అలా బేలగా ఉండి పొయ్యేదానివి
నా బాల్యానికి భాషలేదు గానీ
నీ బాధ, నీలాంటి వాళ్ళ బాధ
మరో మహాభారతమై ఉండేది
పెండ పిసికి పిడకలు కొట్టి
రొట్టెలు కాల్చి రోకళ్ళు పట్టి
జీవితాంతం ఊడిగమైపోయి
జీడిగింజల్లా మారిన నీ నల్లపేళ్ళ సాక్షిగా
నేనిప్పుడు
కొత్త భారతానికి కొత్త తలనవుతున్నాను
నా తల మీద
నా మాతృదేశం మీద
నా తల్లి జెండా తలెత్తుకొని ఎగురుతుంది
ఇప్పుడే కాదు
ఎప్పటికీ
నా జెండా రంగూ
నా తల్లి రంగూ ఒక్కటే!

## నల్లకలువ - కత్తి పద్మారావు

నేను నల్లనిదానను
నా చెమట చినుకులతో
భూమిప్రియుడు పులకిస్తున్నాడు
నాగేటిచాళ్లలో నేను చల్లిన విత్తులు
నా పాదాల ఎరుపుతో మొలకెత్తుతున్నాయి

చిగురాకుల వంటి నా వ్రేళ్ళు
భాగ్యనగర్ నిర్మాణంలో రాళ్ళయ్యాయి
నాస్తన్యం గ్రోలిన బిడ్డడే
నన్ను చెంగుపట్టుకున్నపుడు
ఈ దేశం గుండెల్లో దాగున్న రాచపుండు
నా కర్థమయింది

బ్రహ్మజెముడు చెట్టుకూడా
తన్నుతాను రక్షించుకోవటానికి
ముళ్ళకిరీటం ధరించింది
నా రక్షణ వలయం నన్నే భక్షిస్తుంది

కాకి సామ్రాజ్యాధినేత అయిననాడు
కోకిల కూడా కాకినే అంటుంది
మనకి వర్ణభేదం లేదు స్వరభేదమేనంటుంది
పంచమస్వరం కూడా రసతరంగిణి అయినపుడు

చతుఃస్వరాలన్నీ పంచమంలోనే పలుకుతున్నాయి
కానీ నాస్వరాన్ని నేను గుర్తించగలను

ఈ భూమి సాక్షిగా నేను నల్లని దానను
భూమి కూడా నా నెత్తురు సాక్షిగా నల్లనిది
నేను నల్లనిదానను
నా స్వరం ఆదిమం

అన్ని వర్ణాలూ నలుపులోకి ప్రవహిస్తున్న ఈనాడు
మాతృత్వం నాదని గర్విస్తున్నాను

నేను ప్రాకృతికం
నన్నీసడించుకున్న కృతకాలన్నీ
నాలో సంలీన మౌతున్నాయి
సెప్రూకోటు ఎర్రగులాబీ రాలిపోతుంది
మా ఊరిమాదిగకుంటలోని
నల్లకలువకే పట్టాభిషేకం

గోదావరి ఒడ్డున
చింతచెట్టు కొమ్మకు
మాఅమ్మ నన్ను ఏలాడగట్టి
మట్టి మోస్తున్నపుడు
నా ఏడుపు విని వచ్చిన
కాకుల కేకలే
నా సంగీత పాఠాలు

నాగార్జున సాగర్
డామ్ నిర్మాణంలో
గోడకూలి
మా అయ్య చచ్చినపుడు
నాకు ధైర్యమిచ్చిన
కొండలే
నా నిబ్బరానికి గురువులు

పుల్లల కోసం
అడవి కెళ్ళిన మాయమ్మ
ముళ్ళపొదల్లో
ఇరుక్కున్నపుడు
కారిన నెత్తురే

నా కనుల్లో వున్న
వర్ణం

తూర్పు గోదావరి
కోతల కెళ్ళిన
మామ్మ
నేను స్టేషన్ లో పెట్టిదించి
తమ్ముణ్ణి వదిలి
తిరిగి వచ్చేసరికి
రైలు పట్టాల మీద
తెగిపడటం
చూసిన
కళ్ళలో స్రవించిన
దుఃఖాగ్రహమే
నా రసశాస్త్రం

ట్రంకు రోడ్డుమీద
తారుపోసినపుడు
కాలిన తారులో
కాలు పెట్టిన నన్ను
చెప్పులు లేకుండ
లేవ నెత్తిన
నాతల్లి కేకే
నాగుండె నాదం

సముద్రంలో
వేట కెళ్ళిన
మా అన్న
తుఫాన్ లో
ఇరుక్కున్నాడని
విని
ఒడ్డున వెతుక్కుంటూ

పోయినపుడు

భీమిలి

ఒడ్డున కనబడిన

దృశ్యమే

నాకళ్ళలో

వున్న శిల్పం

నల్లకాకి

నల్ల కొండ

నల్ల తారు

నల్ల సముద్రం

నా సంకేతాలు

నల్లరాజ్యం వైపునా ప్రయాణం.

( నల్లకలువ పుస్తకం నుండి )

## కలవని కనుపాపలు - సతీష్ చందర్

రెప్పవాల్చని కన్నుల్లా రెండు బావులు
ఒకటి: మాకు
రెండు: మా వాళ్ళకు
మధ్యలో ముక్కుమీద వేలేసుకున్న రోడ్డు

ఎవడో జల్సారాయుడు
వాడక్కూడా

అంటరాని రోగం తగిలించాడు
పుట్టుమచ్చల్లేని కవలల్ని
పచ్చబొట్లతో వేరు చేశాడు

మాదీ మా వాళ్ళదీ-
ఒకరినొకరు చూసుకోలేని
కనుపాపల సహజీవనం

కన్నీళ్లలా తోడే కొద్దీ ఉబికే బావి నీళ్ళు
రెంటికీ ఒకటే జల
అదే హృదయం కాబోలు

మధ్యలో ఎగనామం పెట్టుకున్న రోడ్డు

ఎవడో నిష్టాగరిష్టుడు
వాడచేత కూడా
మడికట్టించాడు

అయిన వాళ్ళకి ఆకుల్లో
పిండాలు పెట్టించాడు

మాదీ మావాళ్ళదీ –

ఉరిపడ్డ ఖైదీలు పెట్టుకున్న
ఉచ్ఛనీచాల వివాదం

పగిలిన కొబ్బరి చెక్కల్లా రెండు బావులు
అంతరంగమంతా ఒకటే తెలుపు
మధ్యలో తలంటుకున్న రోడ్డు
ఎవడో భక్తాగ్రేసరుడు
వాడక్కూడా
తిరునాళ్ళు రప్పించాడు
మేము శిరోజాలకు బదులు
ఒకరి శిరస్సుల్ని మరొకరు మొక్కుకున్నాం

మాదీ మా వాళ్ళదీ-
నపుంసకుణ్ణి కట్టుకున్న
తోబుట్టువుల సవతి పోరు.

తెగిన లంకె బిందెల్లా రెండు బావులు
ఎక్కడ తడిమినా ఒకటే శూన్యం
మధ్యలో ముడివిప్పుకున్న రోడ్డు
ఎవడో సర్వసంగ పరిత్యాగి
వాడక్కూడా సన్యాసాన్నిచ్చాడు
మేం నిండు యవ్వనంలో
వానప్రస్థాన్ని స్వీకరించాం
మాదీ మావాళ్ళదీ-
కందిన మద్దెల బుగ్గల
నిసర్గ సౌందర్యం

ం
ఇద్దరి పంచముల కోసం రెండు బావులు
ఎందులో దూకినా ఒకటే చావు

మధ్యలో బుసలు కొడుతున్న రోడ్డు

ఎవడో మనువు తాత ముని మనవడు
వాడక్కూడా
వర్ణాశ్రమాన్ని బోధించాడు
తలకాయల్ని కోల్పోయిన మేం
తనువుల్తో స్వీకరించి
తలో బావిలో దూకాం

మాదీ మా వాళ్ళదీ-
గెలలు నరికిన
అరటి మొక్కల సహజ మరణం
ఎంత వెతికినా కనపడని రెండు బావులు
ఎటు చూసినా ఒక్కటే సరోవరం

మధ్యలో తోకముడిచిన రోడ్డు
ఎవరో ఇద్దరు అమర ప్రేమికులు
వాడకోసం
పడవను బహూకరించారు
నేనూ నా సహచరుడూ
నలుదిక్కులా ప్రయాణించి
ఒకే ఒక్క తామరపువ్వును కొసుకొచ్చాం
మేమిక –
ఎన్ని కిరణాలతో గుణించుకున్నా
మాచుట్టూ ఒకే ఒక్క సూర్యోదయం

(పశ్చిమగోదావరి జిల్లా కొమ్ముచిక్కాల గ్రామంలోని రెండు శాఖల దళితుల కోసం రెండు బావులు పక్క పక్కనే ఏర్పాటు చేశారు.)

(సతీష్ చందర్ 'పంచమవేదం' ప్రచురణకలం, జూన్ 1995, నవ్య ప్రచురణ, హైదరాబాద్)

## దళిత వ్యాకరణం

- తుల్లిమల్లి విల్సన్ సుధాకర్

ప్రగతికి చిహ్నంగా గుడిసెల మీద
టీవీ యాంటెన్నాలు మొలుచుకొచ్చినట్లు
భూమిని పగలగొట్టుకుని మొలక పైకొచ్చినట్లు
జాతికి వెలుగు చూపె నాయకుడు
ప్రజల గుండెల్లోంచి పుట్టుకొస్తాడు
ఊరికో ఇందిరా నగర్ వెలిసినట్లు
వాడకో విగ్రహమై మనసుల్లో నిలిచిపోతాడు

కడజాతి వాళ్ళ పోరాటపథానికి
దిశా నిర్దేశం చేశాడనే కదా
రాజ్యాంగం పైరు నుండి
కొన్ని కంకుల్ని కోసుకోమన్నాడనే కదా
'భిన్నత్వంలో ఏకత్వం
ఊతపదం లాంటి బూతుపదం' అన్నాడనే కదా
ఒక రాతి విగ్రహంపై ఈసడింపుల రాళ్ళు విసిరేది...!

బామియన్ బుద్ధ విగ్రహాన్ని పేల్చివేసినట్లు
వర్ణవేత్తలు కులాల పిరమిడ్లపై కూర్చుని
జక్రాన్‌పల్లిలో ఒక సిమెంట్ విగ్రహాన్ని
కూల్చివేసినంత మాత్రాన
మొలక వేసుకొనే ఒక జాతి గొంతును
నులిపివేయడం సాధ్యమా!
వర్ణ చక్రాలు దిగని రాఘువులూ!
ఒట్టొట్టి సైకిళ్ళు దిగవోయ్ ముందూ...
కులవివక్ష పోరాటం
నీ ఇంటి నుంచే మొదలు కావాలోయ్...
తుపాకీ యుద్ధానికి కత్తి పట్టుకొచ్చినట్లు
కాన్సర్ లాంటి కులం కణాల్ని తొలగించకుండా

కులవివక్ష ఎలా పోతుంది?
ప్రతి అప్పుకూ ఎస్‌బిఐ మాస్టర్ కార్డులాగా
ప్రతీ పోరాటానికీ
క్రోమోజోముల గుంపులతో పాదయాత్రలేనా!
దళిత వ్యాకరణం తెలుసుకోవాలంటే
లాల్ సలామ్‌కూ జై భీమ్‌కూ
తేడా తెలుసుకోవాలి కదా!

కోస్తాలో ఒక వెంకయ్య
దళితుల భూముల్ని
దొరబాబులాగా సాగు చేసుకున్నప్పుడు...
రుమేనియా బిచ్చగాళ్ళను
లండన్ వీధుల్లోంచి తరిమేసినట్లు
ఎస్సీవోళ్ళను చండీయాగానికి రానివ్వనప్పుడు
శాసనసభను కుదిపి కుదిపి అడగ్గలిగావా?
దేవాలయంపై బూతుబొమ్మల్ని
జాతి సంపదగా భావించే ఆంధ్రా తాలిబన్‌లు
అంబేద్కర్ విగ్రహాలపై చెప్పులెందుకు వేశారో అర్థం చేసుకున్నావా?
జాన్‌వెస్లీ!
ఇంటికో బర్రె... మనిషికో రిక్షా...
కోట్ల కాంట్రాక్టులో దళితుల వాటా ఎంతని
గల్లా పట్టుకు అడగాలోయ్...
కుడ్య చిత్రాల్లో ఒదిగిపోయిన విష సంస్కృతిని
దుంపను తవ్వినట్టు తవ్వి పడెయ్యాలోయ్...

నీవు తెరుస్తున్న దేవాలయాలు
నీ వెనకే మూసుకుంటున్నాయి మరి...
నీవు తాగించిన గ్లాసు రెండవుతోంది
నీవు ఊరి పొలిమేరల్లో ఉండగానే...
కొన్ని గ్రామాలప్పుడే కళ్ళెర్రజేస్తున్నాయట...
ప్రజలకు క్షవరం చేయడం మాని

కులాన్ని ఎలా గొరిగి పారెయ్యాలో చెప్పాలి నువ్వు!

తెల్లవాడి కోసం
సిటీ బస్సులో సీటు ఖాళీ చేయనన్న
కళ్ళ కాటుక కన్నా నలుపున్న యువతికి
ఇంకా నివాళులర్పిస్తూనే ఉంది అమెరికా జాతి
పౌరహక్కులకు సలాం చేస్తూ...

కడ దాకా పోరాడిన
ఒక ప్రవక్త విగ్రహానికి
చెప్పుల దండ వేస్తోంది ఈ జాతి
మానవహక్కుల్ని అవహేళన చేస్తూ...

చెప్పి చూడు...
దళిత నేతల విగ్రహాలు కూల్చినంత మాత్రాన
అంతర్ కులాల విందు భోజనంలా
ఒరిగేదేమీ లేదుగానీ
కొంతమంది హిట్లర్లు
యుద్ధాన్ని ఓడిపోయినట్లవుతుంది...

## దారుణ అనుభవాల సంపుటాలు: దళిత సాహిత్య సంకలనాలు- ఎన్. వేణుగోపాల్

నాలుగువేల కోట్ల రూపాయలు సునాయాసంగా స్వాహా చేసేవాళ్ళూ, నాలుగణాల కోసం తమ ఆత్మాభిమానాన్ని పణంగా పెట్టక తప్పనివాళ్ళూ సహజీవనం చేస్తున్న సమాజం మనది. అత్యాధునిక కంప్యూటర్లు జీవిత కోణాలన్నిటినీ స్పృశిస్తున్న చోటనే, రక్త పారిశుధ్యం గురించి వేల ఏళ్ళ కిందటి ఆదిమ భావజాలం కొనసాగుతున్న వ్యవస్థ మనది. వీసమెత్తు శ్రమ కూడా చేయని పిడికెడు మంది ఈ సంపన్న దేశాన్ని సొంత ఆస్తిగా భావిస్తున్న సమయంలోనే, ఈ సమాజ చక్రాల్ని తిప్పుతున్న కోట్లాదిమంది ఈ దేశానికి తమను తాము పరాయిగా భావించుకోవలసి వస్తున్న దుస్థితి మనది.

ఈ వైవిధ్యం, భిన్నత్వం, భయంకరమైన అంతరం అన్నిటికన్న ఎక్కువగా సాహిత్యంలో ప్రతిఫలించడం సహజమే. అందులోనూ ఈ అగాధం వల్ల దారిద్ర్యానికీ, ఆత్మాభిమానం కోల్పోవడానికీ, అణచివేతకూ, వెలికీ గురయిన వాళ్ళు తమ స్థితిని ఏదో ఒక రూపంలో వ్యక్తీకరించడం సహజమే. ఇటువంటి సహజమైన విస్ఫోటనమే దళిత సాహిత్యం. 1950 చివరి రోజుల నుంచీ దళిత సాహిత్యం అనే మాట ప్రాచుర్యంలోకి వచ్చింది. అస్పృశ్యులుగా, సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక అసమానతకు బలి అయినవాళ్ళుగా దళితులు తమ విముక్తి కోసం ప్రకటించే తిరుగుబాటు, ఖండన దళిత సాహిత్యంగా గుర్తించబడుతోంది. దళిత సాహిత్యానికి మూలం బుద్ధుని రచనల్లోనో, చొఖమేల రచనల్లోనో, జ్యోతిబాపులె రచనల్లోనో, ప్రొఫెసర్ ఎస్ ఎం మాటె రచనల్లోనో వెతికే ప్రయత్నం జరిగింది గాని, దళిత ప్రారంభకుడు డాక్టర్ అంబేద్కర్ అని అర్జున్‌దాంగ్లె అంటాడు.

అర్జున్ దాంగ్లె సంపాదకత్వంలో వెలువడిన మూడు మరాఠీ దళిత సాహిత్య సంకలనాలు (నో ఎంట్రీ ఫర్ ద న్యూ సన్ - కవిత్వం, హోమ్‌లెస్ ఇన్ మై లాండ్ - కథ, ఎ కార్ప్స్ ఇన్ ద వెల్ - ఆత్మకథ) దళిత సాహిత్యపు విస్తృతినీ, భారత సామాజిక దౌష్ట్యాన్నీ, కులవ్యవస్థ కింద దళితులు అనుభవించవలసి వస్తున్న దుర్భరత్వాన్నీ స్పష్టంగా చూపుతాయి.

"డాక్టర్ అంబేద్కర్ విప్లవ భావాలు మహారాష్ట్ర దళితులను మేల్కొలిపాయి. వారిలో ఒక నూతన ఆత్మగౌరవాన్ని రేకెత్తించాయి. దళిత సాహిత్యమనేది ఈ చైతన్యానికి సాహిత్య వ్యక్తీకరణే" అని అర్జున్ దాంగ్లె ఈ సంకలనాల ముందు మాటలో రాశాడు. 1972లో దళిత పాంథర్లు తమ రాజకీయ కార్యాచరణ ప్రారంభించడంతో దళిత సాహిత్యపు విస్తృతి వెలుగులోకి వచ్చింది. దళిత పాంథర్ ఉద్యమ నాయకులందరూ సృజనాత్మక రచయితలే.

1970లలో మరాఠీ సాహిత్యంలో దళిత రచయితలు తమ అనుభవాలను బలమైన భాషలో వ్యక్తీకరించడం ఒక వెల్లువలా సాగింది. దళిత సాహిత్యం గురించీ, దాని పాత్ర గురించీ నిర్వచనాలు వెలువడ్డాయి. ఇరవై సంవత్సరాలకు పైగా గడిచిపోయిం తర్వాత ఆ సంచలనాన్నీ, దాని పరిణామాల్నీ సింహావలోకనం చేస్తూ, "దళిత సాహిత్యం కేవలం సాహిత్యం కాదు. ఇవాళ చాలామంది దళిత రచయితలు దళిత సాహిత్య మూలాల్ని మరచిపోయి వుండవచ్చుగాని, దళిత సాహిత్యం మార్పుకోసం సాగే ఉద్యమంతో కలగలిసి వుండింది. ఈ ఆవిర్భావ అవగాహనతోనే ఈ సంకలనంలో కవిత్వాన్ని ఎంపికచేశాను" అని అర్జున్ దాంగ్లె అంటాడు. అట్లాగే కథల ఎంపికలో దళిత సాహిత్యపు 'భిన్నత్వాన్ని' బలంగా చూపే కథల్ని ఎంచుకున్నాననీ, మరాఠీ సాహిత్యపు ప్రధాన స్రవంతికీ దళిత సాహిత్యానికీ మధ్య అగాధమైన అంతరం వున్నదనీ, దళిత కథల భాష, అనుభవాలు, నాయకులు పూర్తిగా భిన్నమైన వాళ్ళనీ ఆయన అంటాడు. ఇక వేరు వేరు కాలాలకూ, వేరు వేరు సామాజిక స్థాయిలకూ చెందిన దళిత ఆత్మకథలు దళిత ఉద్యమంలోని వేరు వేరు కోణాల్ని చూపుతాయి. మనుగడ కోసం పెనుగులాట, దళితుల జీవన ఉద్వేగాల ప్రపంచం, స్త్రీ పురుష సంబంధాలు, గ్రామీణ జీవిత రథచక్రాల కింద నలిగిపోయిన అస్తిత్వం, అవమానాలనూ, అత్యాచారాలనూ అనుభవించే జీవితం, కొన్నిసార్లు పూర్తి లొంగుబాటునూ, కొన్ని సార్లు తిరుగుబాటునూ వ్యక్తం చేసే జీవితం - ఇదీ దళిత ఆత్మకథలు చూపే దృశ్యాలు.

మూడు సంకలనాలనూ ఏకబిగిన చదివినప్పుడు వేరు వేరు ప్రక్రియలలో ఒకే చేదుపాట వింటున్నట్టనిపిస్తుంది. జీవఫలం చేదు విషంగా తరతరాలుగా మనుగడ సాగిస్తున్న అసంఖ్యాక భూమి పుత్రులు తమ విస్సహాయ ఆక్రోశాన్ని ప్రకటించడం వినిపిస్తుంది. ఆ ఆక్రోశం క్రమక్రమంగా ఆందోళనగా మరి, ' ఈ దేశం మాది కాదు' అని తిరుగుబాటు స్వరంగా ఎదగడం కనిపిస్తుంది. కవితా సంకలనం తన శక్తివంతమైన వ్యక్తీకరణలతో ఆశ్చర్యపరిస్తే, ఆ ఆశ్చర్యం కథా సంకలనంలో, చివరికి ఆత్మకథా సంకలనంలో ఇంకా ఇంకా పెరిగిపోతుంది. సామాజిక జీవనపు అగాథ తలాల నుంచి అపారశక్తితో ఎగసివస్తున్న నినాదాలు, సకల సంపదలకూ సృష్టికర్తలు అక్షర సృష్టిలోనూ ప్రవేశించి పండిస్తున్న అపురూప సంపదలు ఈ సంకలనాలు. దళితుల జీవితంలోని దుర్భరత్వం పట్ల స్వానుభవం లేనిదళితేతరు లెవరయినా ఈ సంకలనాలలోని ఏ ఒక్కటి చదివినా, ముఖ్యంగా ఆత్మకథా సంకలనం చదివితే, తమ అల్పత్వం పట్ల "తమ" సమాజంలో కొనసాగుతున్న దుర్మార్గం పట్ల కొత్త చూపు వస్తుంది.

"అమ్మా, నువు చెపుతుండేదానవి
నేను పుట్టినప్పుడు
నీకు నొప్పులు చాలసేపు వచ్చాయని

అమ్మా, నీ సుదీర్ఘ ప్రసవవేదనకు
కారణం చెప్పనా?
నీ గర్భం లోపల నేను సందేహిస్తూ ఉండినాను
నేను పుట్టదలిచానా?
అసలీ దేశంలో
నేను పుట్టదలిచానా?
ఇక్కడ అన్ని దారులూ దిగంతం వేపు పరుగులు తీస్తాయి
నాకెందులోనూ ప్రవేశం లేదు....

అమ్మా, ఇది మీ దేశం
నదులు ఒడ్డొరసి ప్రవహిస్తాయి
చెరువులు నిండిపోతాయి
కాని మానవ జాతికే చెందిన నువ్వు మాత్రం
దోసెడు నీళ్ళ కోసం
రక్తం చిందించాలి
పోట్లాడాలి కలబడాలి
ఈ మహాసంస్కృతి మీద నేను ఉమ్మేస్తున్నాను
ఇక్కడ పుట్టినంత మాత్రాన
ఈ నేల నీదవుతుందా అమ్మా?
నీ కడుపున పుట్టినంత మాత్రాన
ఈ నేల నాదవుతుందా?
ఈ మహాభూమి నాదని చెప్పకోనా?
ప్రేమించనా
ఘనత కీర్తించనా?
అమ్మా, క్షమించు
నిజం చెప్పాలంటే
పుట్టాలా అని
ఈ దేశంలో పుట్టాలా అని
సంకోచించను నేను''
అంటాడు ఎల్. ఎస్. రొకాడె.

పాట అనే కవితలో భీమ్‌సేన్ దెతె ఒక హృదయ విదారక దృశ్యం కళ్ళకు కడతాడు. తన తండ్రి రాళ్ళు, మోస్తున్నాడట. మీసాలు మెలిపెట్టుకుంటూ మేస్త్రీ ఆ తండ్రిని పాటలు పాడమని అడిగాడట. పాటగాడి పేరు కిస్న్య. ప్రేమగీతాలు పాడడంలో అనితర సాధ్యమైన ప్రతిభ గలవాడే. అతని పాటల్లో చంద్రోదయాలుండేవి, సూర్యకాంతి వుండేది. పూలు వికసిస్తుండేవి. సముద్ర కెరటాలు హెూరెత్తేవి, ప్రేమ మధువులో మత్తెక్కిన ఉద్వేగభరిత ప్రేయసి వుండేది.. ఆ పాట విని చెమటతో తడిసిన చేతులు చప్పట్లు కొట్టేవి. అన్ని వేపుల నుంచీ ప్రశంసలు వచ్చేవి. తండ్రి కదిలిపోయేవాడు. అతని మనసంతా కృతజ్ఞత నిండిపోయేది. ఇంటికి తిరిగి వస్తూ అతను పట్టెడన్నపు పాట కోసం వెతుకుతుండేవాడు. అతడెన్నడూ పాడలేని పాట పట్టెడన్నపు పాట! కంచికచెర్ల నుంచి చుండూరు దాకా దళితుల మీద సాగిన ఎన్నో మారణకాండల ప్రతిధ్వని అశోక్ చక్రవర్తి 'పంట'లో వినబడుతుంది.

''నరబలుల పంట ఇక్కడ అనంతంగా సాగుతుంది
గాలిని బట్టి రుతువులు మారుతాయంటే
తూర్పు నుంచి పడమటికి, ఉత్తరం నుంచి దక్షిణానికి
పంట ఎప్పడూ ఆగదు, ఏడాది పొడుగునా

రాబందుల కోసం.''

'' ఈ దేశం వెయ్యి ముక్కలయిపోయింది
ఈ దేశపు పట్నాలు, మతం, కులాలు
జనాలు, చివరికి మనసులు
అన్నీ ముక్కలయిపోయాయి, విడిపోయాయి
ఈ దేశంలో, ప్రతి దినమూ మండిపోతుంది
మా జీవితాల ప్రతిక్షణాన్నీ తగులబెడుతుంది
మేం అంగీకరించని
ఈ మా జీవితంలో
మేం అవన్నీ సహిస్తాం, కొండలలా దృఢంగా నిలుస్తాం
మా ఆక్రోశాలన్నీ కేవలం
ఈ దేశపు
ఈ నగ్న దేశపు చరిత్ర రాసేందుకు చేసే ప్రయత్నాలే
ఈ దేశపు మతానికి హృదయం లేదు
ఇక్కడి జనం తమ వల్ల చట్టాలు చూసుకుని మురిసిపోతారు
మేం అసలు పుట్టనే లేదని ప్రకటిస్తారు
తమ్ముడూ, పద మరో దేశానికి వెళిపోదాం
ఎక్కడయితే బతికి వున్నప్పుడు
నీ తలమీద ఓ కప్పు వుంటుందో అక్కడికి
ఎక్కడయితే చనిపోయినప్పుడు
నీదంటూ ఒక శ్మశానం వుంటుందో అక్కడికి''

అంటాడు బాపూరావు జగ్‌తాప్.

ఇంతకూ దళిత కవిత్వం అడిగేదేమిటి? శరణ్‌కుమార్ లింబాలె మాటల్లో చెప్పాలంటే వాళ్ళు మీ ఆకాశంలోంచి సూర్యుణ్ణీ అడగడం లేదు, చంద్రుణ్ణీ అడగడం లేదు. మీ భూమి కాదు, మీ పొలం కాదు, మీ భవంతులు కాదు, మీ మేడలు కాదు, భగవంతుళ్ళూ వద్దు, పూజా పునస్కారాలూ వద్దు, కులాలూ వద్దు, తెగలూ వద్దు. మీ తల్లో, అక్కచెల్లెళ్ళో, కూతుళ్ళో కూడ వద్దు. దళితుడికి కావలసిందల్లా ఒక మనిషిగా అతని హక్కులు. ''నాకు నా హక్కులు కావాలి. నాకు నా హక్కులివ్వండి''. ఈ దందహ్యామాన స్థితిని నిరాకరిస్తారా? అతను పవిత్ర గ్రంథాన్ని రైలు పట్టాల్లాగ పీకేస్తాడు. మీ అన్యాయ న్యాయచట్టాల్ని సిటీ బస్సులాగ తగులబెడతాడు. అతని హక్కులు సూర్యబింబంలాగ ఉదయిస్తున్నాయి. సూర్యోదయాన్ని ఆపగలరా? అని ప్రశ్నిస్తాడు లింబాలె.

కనీస మానవహక్కుల కోసం సమాజంలోని ఒక ముఖ్యమైన భాగం ఇంతగా పోరాడ వలసి వస్తున్న స్థితిని ఈ కవిత్వం కన్న శక్తివంతంగా చూపుతాయి కథలు. కుక్కలతో, భూస్వాముల పశువులతో సమానంగా, వాటికన్న హీనంగా పంటల కాలంలో బిచ్చమెత్తి రొట్టెలు సంపాదించుకుంటే, అవి విషపు రొట్టెలు, మహార్‌ల శ్రమ భూస్వాములకు ధనరాశులు సమకూర్చి పెడుతోంది గాని వాళ్ళ నోటికి మాత్రం విషపు రొట్టెలందిస్తోంది. ''మన కులం ఏటేటా బిచ్చంగా సంపాదించుకునే ఈ రొట్టెలు ఇక వద్దు. వీలయినంత చదువుకో. మహార్‌ల

నోటి ముందునుంచి ఈ శాపపు తిండిని లాగేసెయ్యి. ఈ విషపు రొట్టె మనిషిలోని మానవత్వాన్నే చంపేస్తుంది'' అంటాడు బంధుమాధవ్ కథ 'ద పాయిజన్‌డ్ బ్రెడ్'లో యెటల్య.

ఆకలి బాధతో విలవిలలాడే దళితులకు ఎక్కడో ఒక ఆవు శవం పడి వుందని తెలిస్తే ఎంత సంచలనం రేగుతుందో, కాకులతో, గద్దలతో, రాబందులతో, కుక్కలతో, నక్కలతో పోట్లాడి ఒకటి రెండు పూటల తిండిని సమకూర్చుకోవడానికి వాళ్ళు పడే ఇక్కట్లెట్లాంటివో ఒక పసివాడి కళ్ళలోంచి చూపుతాడు అమితాబ్.

చదువు ఆత్మగౌరవం సాధించడానికి ఒక మార్గంగా కనబడే చోట, అనుక్షణం ఆత్మగౌరవం అవమానపడే చోట చదువుకు చాల విలువ వుండటం సహజమే. కాని కొనసాగుతున్న విలువల్లో ఆ చదువు దళితులకు ఎంత కష్టసాధ్యమవుతుందో, వాళ్ళ దారిలో ఎన్ని అడ్డంకులున్నాయో కేశవ్ మెశ్రామ్ కథ వివరిస్తుంది.

ఈ సంకలనంలో వస్తువు రీత్యానూ, శిల్పం రీత్యానూ కూడ పాఠకుల మనసులో తీవ్రమైన సంచలనం రేపే కథ అన్నాభావు సాఠె రాసిన 'గోల్డ్ ఫ్రమ్ ద గ్రేవ్'. శక్తి సామర్థ్యాలున్నప్పటికీ చెయ్యడానికి పని దొరకని దళితుడు ఏం చేస్తాడు? సవర్ణ హిందువుల శవాలు తగులబెట్టినప్పుడు, ఖననం చేసినప్పుడు, ఆ శవాల నోటిలో ఎంతోకొంత బంగారం వుంచుతారు. చితుల్లో నుంచి సమాధుల్లో నుంచి ఆ బంగారాన్ని వెతికి తీసుకుని, అమ్మకోవడం జీవికగా చేసుకున్నాడు భీమా. ఒక సమాధిలో నుంచి మృతదేహాన్ని తీసి, దవడలు విడదీసి, నోట్లో వేళ్ళు పెట్టింతర్వాత దవడలు మూసుకుపోయాయి. మరోవైపు నక్కలూ తోడేళ్ళూ మీద పడ్డాయి. ఇంకోవైపు నుంచి గ్రామస్తులు పరుగెత్తుకొచ్చారు. వేళ్ళు విరగ్గొట్టుకుని తప్పించుకుని వెళ్ళిపోయాడు. ఇంత దుర్భరమైన జీవితం గడపక తప్పనివాళ్ళు ' ఈ నేల మాది కాదు' అనుకున్నారంటే అందులో అసహజమేమీ లేదు.

కాని ఇవన్నీ కథలు గదా, నిజాలు ఇంత దుర్భరంగా లేవు అని ఎవరయినా వాదించదలచితే వాళ్ళకు దళితుల జీవితాల నమూనాలు చూపుతుంది మూడో సంకలనం. ఈ సంకలనం చదవడం నిజంగా ఒక భయంకరమైన అనుభవం. ఇరవయ్యో శతాబ్దంలో కొన్ని జీవితాలు ఇంత దారుణంగా గడిచాయని, గడిచే అవకాశం వుందని ఊహించడం కూడా సాధ్యం కాదు. కాని నిజానికి ఇవన్నీ ఆ అనుభవాలలో నుంచి పైకి, మధ్యతరగతిలోకి, ఎదిగి వచ్చిన వాళ్ళు రాసిన ఆత్మకథలలోని శకలాలు. అసలు పూర్తి ఆత్మకథలు ఇంకెన్ని భయానక దృశ్యాల్ని చూపుతాయో?! ఆ ఆత్మకథా రచయితల లాగ

రాయడానికీ చెప్పుకోడానికీ అవకాశాలు లేని ఇంకెన్ని కోట్లాది జీవితాలు ఇంతకన్న దుస్సహంగా గడిచాయో, గడుస్తున్నాయో! ఏడుగురు రచయితల ఆత్మకథల లోంచి తొమ్మిది భాగాల్ని ప్రకటించిన ఈ సంకలనం గురించి వివరించాలంటే దాదాపు ప్రతి అక్షరాన్నీ వివరించాల్సిందే. ఆధునిక భారత సమాజంలో కొనసాగుతున్న అమానుషత్వానికి ఎత్తిపట్టిన అద్దం ఈ సంకలనం. ఇటువంటి భూమి ఇంకెక్కడా లేదని ఘనకీర్తి చాటుకునే వాళ్ళు ఒక్కసారి ఈ అద్దంలో భారతదేశపు ముఖం చూసుకుంటే నిజంగానే ఇటువంటి భూమి ఇంకెక్కడా వుండే అవకాశం లేదనిపిస్తుంది!

ఈ మూడు సంకలనాలు చదివిన తర్వాత, వీటి అద్భుతత్వాన్ని గుర్తిస్తూనే ఒక మినహాయింపు కూడా చెప్పవలసి వుంది. కవిత్వం రూపంలోనయినా, కథ రూపంలోనయినా, ఆత్మకథ రూపంలోనయినా వెలువడిన ఈ అనుభవాలన్నీ చాలా విలువయినవి. భారత సామాజిక చరిత్రలో ఈ వ్యక్తీకరణలకు గణనీయమైన స్థానం వుంటుంది. కాని ఇవి విశ్లేషణగా ఎదగకపోతే, సామాజిక చరిత్రకు చోదక శక్తిగా మారగలిగిన ఒక దృక్పథంగా వికసించకపోతే కేవలం అనుభవాలవల్ల అంతగా ఉపయోగం లేదు. కొత్తగా చిగుళ్ళు వేస్తున్న సిద్ధాంత రాహిత్య సిద్ధాంతం ఈ మధ్య విస్తృతంగా అనుభవ ప్రాధాన్యతను ప్రచారం చేస్తోంది. అనుభవం లేని విశ్లేషణ పిడి, జడవాదానికి ఎట్లా దారి తీస్తుందో, విశ్లేషణ లేని అనుభవం కూడా అంతగానే ఏ గమ్యమూ లేని శుష్క లోకజ్ఞానానికి దారి తీస్తుంది. ఈ రెండు అతివాదాలకూ కొట్టుకుపోకుండా సమాజ గమనంలో విశ్లేషణకూ, అనుభవానికీ మధ్య వున్న గతి తార్కిక సంబంధాన్ని గుర్తించడానికి ఈ సంకలనాలు ఉపయోగపడతాయి. అటువంటి కొత్త ఆలోచన, కొత్త దృక్పథం ఈ సంకలనాల్లో వున్నాయంటాడు అర్జున్ దాంగ్లె.

( ఆంధ్రజ్యోతి, 23 నవంబర్, 1992 నుండి పునర్ముద్రణ)

## దూదేకుల కవిత్వం - ఖాజా

ఏ కులమని నను వివరమడిగితే
ఏమని చెప్పుదు లోకులకూ
లోకులకు పలుగాకులకూ
దుర్మార్గులకూ ఈ దుష్టులకూ-
..............................
ఇంటిలోపలను యిల్లు గట్టుకొని
మంటలోపల రాటం బెట్టుక
కంటిలోపల కదురు బెట్టుకొని
ముక్కులోపల యేకు బెట్టుకొని
చేతిలో బాక చేతికి తీసుక
నారాయణ యను నరము తీసుకొని
అష్టాక్షరియను తడిక వేసుకొని
పంచాక్షరి యను పంచదీసుకొని
తకధిమ తకధిమ గుబదెబ గుబదెబ
ఏకిన కులమే మా కులము
ఏకిన ఏరులు పీకిన పిందెలు
లోకమంతనొక పాపము జేసుక
ఏకిన కులమే నా కులము
(దూదేకుల సిద్దప్ప తత్వం)

ఏ అవమానానికి ప్రతిగా చెప్పాడో, ఏ ప్రశ్నకు సమాధానమిచ్చాడో కానీ - సిద్దప్ప కులం గురించి ప్రశ్నలనెదుర్కొన్నాడని అవమానింపబడ్డాడని - మాత్రం దీనివల్ల అర్థం అవుతుంది. పోతులూరి వీరబ్రహ్మం వద్ద శిష్యరికం చేసిన సిద్దప్ప - కులమత అంతరాలను, విద్వేషాలను సామాజిక అసమానతలను తీవ్రంగా వ్యతిరేకించాడు. తన తత్వాలలోను, వచనాలలోనూ ఇదే విషయాన్ని బోధించాడు. ప్రచారం చేశాడు.

దాదాపు మూడు శతాబ్దాల కిందట దూదేకుల సిద్దప్ప చెప్పిన తత్వం ఇది. ' ఏ కులమని నను వివరమడిగితే' అనడంలో 'మీదేకులం' అని ఎవరో అడిగిన ప్రశ్నకు సమాధానంగా సిద్ధప్ప చెప్పిన ఈ

వాక్యం రెండు శతాబ్దాలు గడిచాక 'మీదేకులమన్న ప్రశ్న' వెలయించి చివాలున లేచిపోవుచో - బాకున కుమ్మినట్లుగున్' అన్న జాషువా పద్యం కూడా ' ఇదే ప్రశ్నకు' సమాధానం. అంటే రెండువందల ఏళ్ల తర్వాత కూడా సమాజం పరిస్థితిలో, నిచ్చెనమెట్ల వ్యవస్థలో 'గౌరవాల' స్థాయిలో ఏ మార్పూలేదని మనం అర్థం చేసుకోవచ్చు.

దూదేకుల సిద్ధప్పకు జాషువాకు ఎదురైన ప్రశ్నే మళ్లీ ఇరవయ్యో శతాబ్దపు చివర్లో మళ్లీ మద్దూరి నగేష్‌బాబుకూ ఎదురైంది. అందుకే నగేష్‌బాబు 'మీరేవుట్లు' కవిత వొచ్చింది.

"మేం ఎవరిమైతే మీకెందుకంట?
మేము ఏవుట్లమైతే మీకెందుకంట?
మా కులమేందో తెలియకపోతే మీకు తిన్నది అరగదా?
మా పుటకేందో తెలుసుకోకపోతే మీ తూరుపు తెల్లారదా?"
(మద్దూరి నగేష్‌బాబు - మేరేవుట్లూ...?)

అంటే మారుతున్న కాలంతో పాటుగా 'మీదేకులం' అన్న ప్రశ్న పదునుదేరింది తప్ప పాతబడలేదు మాసిపోలేదు. ఆయాకులాలకు, ఆయా అవమానిత దళిత జాతులకు ప్రతినిధులుగా ఈ ముగ్గురు కవులు గొంతు విప్పారు. అంటే మొత్తం జాతి పొందుతున్న అవమానానికి, తలెత్తుకునే స్థితిలేని సామాజిక అణచివేతకు ఈ కవితలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి.

మనుషులంతా కులాలుగా, మతాలుగా, జాతులుగా విడిపోయి తప్ప కలిసి బతకలేని స్థితి భారతీయ సమాజంలో వుంది. ఇది ఈనాటిది కాదు. ఆర్యజాతి భారతగడ్డమీద అడుగుపెట్టినపుడు జరిగిన పేర్పాటు. ఈ కుట్రపూరిత పేర్పాటు వాదానిది ఊసరవెల్లి తత్వం. ఇది స్థానాన్ని బట్టి, కాలాన్ని బట్టి, పరిస్థితిని బట్టి తన ఉనికిని, స్వభావాన్ని మార్చుకుంటుంది. కాలంమారినా స్థితిమారినా స్థలం మారినా, మతం మారినా అంటరానితనపు ముద్ర దళితుల్ని వెంటాడుతూనే వుంది.

శతాబ్ధాల కింద హిందూ, దళిత, బహుజనులు ఇస్లాంలోకి మతం మార్చుకున్నారు. అలా మతం మారడానికి ముందు వీరు నవారునేత, బట్టలనేత, గుర్రాలు కాయడం, పరుపులు కుట్టడం, గుంటమగ్గం నేత వంటి వృత్తులమీద ఇతర తక్కువహోదా కలిగిన కులవృత్తులమీద ఆధారపడి బతికేవారు, హిందూ అణిచిపేత నుంచి వెలిపేతలనుంచి బయటపడాలని కలలు గన్న వీరికి ఇస్లాం మతం కొత్త వెలుగులా కనిపించింది. ఆకర్షించింది. మతం మార్చుకునేందుకు అవకాశం కల్పించింది. అయితే ఈమత

మార్పిడివల్ల తమకేదో అద్భుతం జరగబోతుందని అనుకున్నవారికి నిరాశే మిగిలింది. అణచివేత, అవమానం అలాగే మిగిలాయి. పెద్దమార్పులేదు.

కొత్తమతంలో వీరంతా దూదేకులయ్యారు. అనుకున్నంత హెూదా, గౌరవం దక్కక అయోమయస్థితిలో మిగిలిపోయారు.

మతం మారిన తర్వాత వీరి రోజువారి జీవనంలోనూ, వేషంలోనూ, భాషలోనూ, ఆహారపు అలవాట్లలోనూ పెద్దమార్పులు చోటుచేసుకోలేదు. పూర్తి ముస్లింలుగా వీరిలో మార్పులు (muslimisation) జరగలేదు. గ్రామీణ ప్రాంతాల్లో సూఫీ ప్రవక్తల ప్రభావంతో దర్గాలకు, జెండా చెట్లకు మొక్కులు చెల్లించుకునే దళిత బహుజనులు అనేకమంది వున్నారు. ఒక్క ముస్లిం కుటుంబం కూడా లేని కొన్ని ఊర్లలో ఉర్సులు, పీర్ల పండగలు జరిపే దళిత బహుజన కుటుంబాలున్నాయి. అంటే మతం మారకపోయినా వీరు ముస్లిం సంప్రదాయాలను, ఆచారాలను పాటించడం చూడవచ్చు. హలాల్ చేయనిదే మాంసం ముట్టని దళిత బహుజనులూ వున్నారు. అయితే వీరు హిందువులుగా తమ మతంలోని ఆచారాలను పాటిస్తూ ముస్లిం - ఆచారాలనూ అలవరచుకున్నారు. దసరా పండుగ చేసినట్టే పీర్ల పండగనూ చేసుకుంటున్నారు.

ఇదే స్థితి దూదేకుల్లోనూ ఉంది. అంటే సరళీకరించిన ముస్లిం ఆచార వ్యవహారాలను పాటించే దూదేకులు - హిందూ సంస్కృతి నించి కూడా పూర్తిగా బయటపడలేదు. అందుకే పీర్లపండుగనూ దసరాను దూదేకులు ఒకేరకంగా జరుపుకునే స్థితి ఉంది. నిజమైన ఏకత్వాన్ని, పరమత సహనాన్ని స్నేహభావాన్ని దూదేకుల జీవితం ప్రతిబింబిస్తుంది.

దూదేకులకు భూమి, విద్య, సొంత ఆస్తి, సాంఘిక హెూదా లాంటివేమీ లేవు. రెక్కల కష్టం మీద బతికే అట్టడుగు స్థాయి వర్గంగా, ముస్లిములలో రెండో తరగతి వారుగా దూదేకులు సామాజిక అణచివేతకు గురవుతున్నారు. దూదేకటం, పరుపులు కుట్టడం, నవారునేత, బ్యాండు సన్నాయి మేళం వాయించటం, సోడాలు అమ్మటం, టైలరింగ్, మెకానిక్ పనులు, వ్యవసాయ కూలీ వంటి సామాజిక గౌరవం దక్కని అల్పాదాయ వృత్తులపై ఆధారపడి బతుకుతున్నారు.

చదువులోనూ, ఉద్యోగ, రాజకీయ రంగాల్లోనూ దూదేకులు వెనుకబడి ఉన్నారు. 1960 ల తర్వాత మొదటి తరం చదువుకోవటం మొదలుపెట్టింది. అయితే ఈ చదువులు వీళ్లను గుమస్తాలు, టీచర్ల స్థాయిని మించి ముందుకు తీసుకెళ్లలేదు. ఇంజనీర్లు, డాక్టర్ల వంటి వారు దూదేకుల కులంలో వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. ఇక ఐ.ఏ.ఎస్., ఐ.పి.ఎస్. స్థాయిలో ఒక్కరు కూడా లేరు. పారిశ్రామిక వేత్తలు, క్యాపిటలిస్టులు భూతద్దంతో

వెదికినా దొరకరు. రాజకీయాల్లో జెండాలు మోసేవారుగా, ఉద్యమాలలో బ్యానర్లు కట్టేకవాళ్లుగా తప్ప పదవులకు, ప్రాతినిధ్యానికి వేల మైళ్ల దూరంలో వున్నారు.

ప్రభుత్వం ఇచ్చిన బి.సి.'బి' రిజర్వేషన్ కూడా దూదేకుల విద్యా, ఉద్యోగ, ఆర్థిక స్థాయిలో పెద్దగా మార్పు తేలేకపోయింది. ముఖ్యంగా మిగతా బి.సి.లతో పోటీలో దూదేకులు వెనుకబడిపోక తప్పలేదు.

బ్రాహ్మణీయ రచయితలు, సినిమా రంగం దూదేకులను పింజారీ వెధవలు చేసింది. ముస్లిం సమాజం వీళ్లను లథాఫ్‌లను చేసింది.

ఇక తెలుగు సాహిత్యంలో దూదేకుల కవులు, రచయితలు పద్యరచనా కాలం నుంచీ వున్నప్పటికీ వారు సాధారణ బ్రాహ్మణీయ సాహిత్య వొరవడిలోనే రాయక తప్పలేదు. ఆధునిక కవుల్లో దిలావర్, ఖమ్రుద్దీన్, యాకూబ్ వంటి వారు తెలుగు కవిత్వంలో తమదైన స్థానాన్ని నిలుపుకున్నారు. అసలు సాహిత్యంలోకి ప్రవేశించే కవులుగా, రచయితలుగా నిలబడ్డమే కష్టమైన స్థితిలో సమకాలీన కవిత్వం రాసి తమదైన ముద్రను సాహిత్యంపై వేయగలిగారు. కానీ - స్వంత అస్థిత్వాన్ని మాత్రం సాహిత్యంలో ప్రవేశపెట్టలేకపోయారు.

దళిత సాహిత్యంలో వివిధ కులాలు తమ ప్రత్యేక అస్థిత్వాల గురించి ప్రశ్నించడం మొదలైన తర్వాత - దూదేకులు కూడా తమ జీవన వాస్తవాలను సాహిత్యంలో ప్రతిబింబించే ప్రయత్నం మొదలుపెట్టారు. ఇన్నేళ్లుగా సాహిత్య గౌరవానికి నోచుకోని దూదేకుల జీవితంలోని అనేక కోణాలను సాహిత్యానికి పరిచయం చేశారు.

"ఏకుతున్న దూది పింజెలు పింజెలుగా విడిపోయి
అమ్మ ముఖం ముందు గాల్లో ఎగురుతుంటే
చంద్రుని ముందు మబ్బుతునకలు తారట్లాడినట్లుంటుంది
పత్తిచేళ్ల మధ్య దూదితీసిన పత్తిగింజైపోయిన
నా ముసలి తల్లి
కవాసేలాడదీసి దారాన్ని లాగుతూ దూదేకుతుంటే
నా నరాల్నెవరో వీణతీగలు చేసి మీటుకుంటున్నట్టుంటుంది"
(ఖాజా – మా...)

1995 ఫిబ్రవరిలో వెలువడిన ఈ కవిత దూదేకుల కష్టాన్ని సాహితీ పటం మీద ఆవిష్కరించింది. దూదేకుల జీవితానికి, శ్రమకు సాహిత్య గౌరవాన్ని కల్పించింది.

''పగిలిపోయిన సర్కారు దవాఖానా కళ్లద్దాల్లోంచి -
వణుకుతున్న ముడతలు పడ్డ చేతులతో మా అమ్మ
చినిగిన చొక్కాలకు మాసికలూ - బొంతలకు అతుకులూ కుడుతుంటే
నా గుండెకెవరో మిషను కుట్టేస్తున్నట్టుంటుంది
పరుపులు కుట్టీ కుట్టీ అలసిపోయిన అమ్మ
కటికనేలమీదలా నడుంవాల్చి కునుకుదీస్తే
కాబూలీవాడి అప్పు కల్లోకొచ్చి
లాగిపెట్టి తన్ని లేపుతుంది.
(ఖాజా – మా...)

దూదేకులు సామాజికంగా, ఆర్థికంగా దీనమైన స్థితిలో వున్నారు. శ్రమను నమ్ముకొని బతుకుతున్నారు. చాలీచాలని సంపాదనతో కనీసం మూడుపూటల తిండి దొరక్క దరిద్ర్యాన్ని అనుభవిస్తున్నారు. అప్పుల పాలైపోయి బికారులుగా దిగజారిపోతున్నారు.

ఈ పరిస్థితులను దూదేకుల కవిత్వం బలంగా వ్యక్తీకరించింది. ఆర్థికంగా, సామాజికంగా, మతపరంగా తమమీద కొనసాగుతున్న అణచివేతను ప్రశ్నించింది. ఇస్లాం మతంలో అసలు కులమే లేదని చెప్తూనే దూదేకులను తక్కువగా చూసే, ఎగతాళి చేసే 'మోలీసాబ్'ల మోసాన్ని నిలదీసింది. తమ సాంస్కృతిక వెనకబాటును చూసి ఈసడించుకునే 'ఛాందస'వాదులను - తమ పేదరికాన్ని చులకన చేసే నవాబులనూ దూదేకుల కవిత్వం కాలర్‌పట్టి నిలదీస్తుంది.

సామాజిక - సాంస్కృతిక దృష్టి

దూదేకుల కవిత్వం తమ సాంస్కృతిక - సామాజిక వెనకబాటును కవిత్వీకరించింది. ఒక సామాజిక సమూహంగా తమ అస్థిత్వ సమస్యను, ఒక కులంగా ఎదుర్కొంటున్న ప్రత్యేక సమస్యలను, మతంలోని వారిగా ఎదుర్కొంటున్న అవమానాలను దూదేకుల కవిత్వం ఎజెండా మీదకు తెచ్చింది

.

''చెబితే నమ్మరేమో కానీ చెప్పుకుంటే మీ ముందు
పలచనై పోతామని భయం

పెంటు సాబు, ఉద్దండు, దస్తగిరి, నాగులు, చిన ఆదాం
లాలు, పెదమౌలా, చినమౌలా, షేకు శ్రీనివాసు
బేతంచర్ల మొయిను, పాటికట్ట మల్సారు - ఇవే కదా మా పేర్లు''.
(యాకూబ్ - అవ్వల్ కలిమ)

ముస్లిమీయతను పూర్తిగా సంతరించుకోలేక పోయిన దూదేకుల అంతర్మధనాన్ని ఈ కవితలో యాకూబ్ వ్యక్తికరించిన తీరు అద్భుతమైంది. ముస్లింలమని ఎంతో 'గాంభీర్యం'గా చెప్పకునే దూదేకులు, ముస్లింల నుంచి ఎదుర్కొనే వివక్షను బయటికి చెప్పలేక లోలోపలే దు:ఖిస్తున్నారు. హిందూపేర్లతో, హైందవ సంస్కృతిని ఆచరిస్తూ ముస్లింలుగా వుంటూ రెండు సంస్కృతుల మధ్యా నలిగిపోతున్నారు.

''షేక్, సయ్యద్, పఠాన్ - మీ దర్పాల హెూదాల ఖాందాన్ల
పేర్లుచెప్పి మమ్మల్ని దగ్గరికైనా చేరనిచ్చారా!
లద్దాఫ్, దూదేకుల, కసాబ్, పింజారీ.........
వృత్తిని కులమై కరిచిన కాలపు గుర్తులమయ్యాం.''
(యాకూబ్ - అవ్వల్ కలిమ)

భారతీయ కులసమాజపు ప్రభావంతో ముస్లిములు కూడా ఇక్కడ హెచ్చుతగ్గులుగా విడిపోయి వున్నారు. షేక్, సయ్యద్, పఠాన్‌లు అష్రాఫ్ (ఉన్నత వర్గం)గా చెలామణి అవుతుండగా లద్దాఫ్, నఫ్రా, గొడారి, కాసి వంటి కులాలన్నీ అజ్లాఫ్ (కిందివర్గం)గా ఉన్నత ముస్లిం సమాజానికి దూరంగా - అంటరానివారుగా వుంటూ అవమానాలు ఎదుర్కొంటున్నారు.

'' ఈ లోకాకులన్నీ నన్ను ఏకాకిని చేసి
ఏకుల్లో తొక్కిస కథ యిది
మసీదుని నాలుగు గుమ్మటాలతో భాగించినట్లు
అందర్నీ పోగులుగా కలిపినేసిన మతం తానుని
ఎక్కువ తక్కువ ముక్కలుగా చింపిన
మను ముల్లాల సంగతి యిది.
అందరూ సమానమేనని చెప్పిన అల్లాకళ్లలో కారం కొట్టి
నా నిచ్చెనమెట్లను తెగనరికి
నన్నో మరుగుజ్జుగా మలిచిన
మోసపు మోలీసాబ్‌ల నమ్మక ద్రోహమిది''

(ఖాజా - ఏకేకులం - 1)

అల్లా ప్రతిపాదించిన 'ఇస్లాం' కులాలకు అతీతమైనది. అసమానత్వానికి, కులవ్యవస్థకు చోటులేని ఇస్లాంకు ఇక్కడి ముల్లాలు మనువాదులై కులజాడ్యాన్ని అంటించారు. అందరూ సమానంగా వుండాల్సిన చోటు కొందర్ని తక్కువ వాళ్లను చేసి అట్టడుగుకు నెట్టివేసిన ముల్లాలను, మనువులుగా పోలుస్తున్నాడు కవి.

దూదేకుల్లో దేశం గర్వించదగిన కళాకారులున్నారు. ముఖ్యంగా నాదస్వర సామ్రాజ్యాన్ని ఏలిన షేక్ చినమౌలానా వంటి విద్వాంసులు, బుర్రకథా పితామహుడు నాజర్ వంటి కళాకారులు దూదేకుల కులం నుంచి ఎదిగిన ప్రముఖులు. నిజానికి దూదేకుల కులంలో నాదస్వర విద్వాంసులు అనేకమంది వున్నారు. ముఖ్యంగా దేవాలయాల్లో, పండుగలు, దేవుళ్ల ఊరేగింపుల్లో, పవళింపు సేవల్లో, మేల్కొలుపు సేవల్లో దూదేకుల విద్వాంసుల నాదస్వరాలాపన ఎంతో ప్రాముఖ్యత కలిగి వుంది. అదే సందర్భంలో వీరిపై అవహేళన, అణచివేతకూడా ఉంది.

''నేను లేకుండా
నా మట్టికాళ్లీ గుళ్లలోకి నడవకుండా
నాజుమ్మా స్నానాల దూదేకుల కంపులేకుండా
నా ఎంగిలి పీకల సుప్రభాతాలు లేకుండా
ఇక్కడ ఏ దేవుడికీ కనీసం మెలకువైనా రాదు
వాడి పవళింపు సేవకోసం
పాటను పన్నీటి జల్లును చేసింది నేను
వాడి ఉత్సవ ఊరేగింపుల కోసం
గాలి తిత్తినై
రాగాల పరిమళంగా పరుచుకునేదీ నేనే''
(ఖాజా - ఎంగిలి పీక)

డాబు కోసం, దర్పంకోసం దూదేకులు - ఉర్రూతలూగటం లేదు. ఇవాళ ఎలా గడుస్తుందోనన్న దిగులుతోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఉర్దూ - అరబ్బీలు నేరవడానికి, ఐదుపూటల నమాజ్‌లకు అసలు అవకాశమే లేని స్థితిలో అస్లీ ముస్లింగా మారలేనందుకు దు:ఖపడాల్సిన అవసరమేలేదు.

''నా దూదేకులతనాన్ని షోహర్ ఆపాదించుకోనప్పుడు

అస్లీ ముస్లిం ముద్రని మాత్రం నేనెందుకు భరించాలి?
దారిద్ర్యం నా కలల్ని - ఆకలి కాలాన్ని మింగేస్తుంటే
దు:ఖ జంఖానాలో ఎక్కెక్కిపడ్డ నాబచ్‌పన్
పరుపులు కుట్టడమే నేర్చుకుంది
నేర్చుకోలేని ఉర్దూ అరబ్బీల గురించి
నేనెందుకు దు:ఖించాలి''
(షాజహానా - లద్దాఫ్ని)

ఆర్థిక పేదరికంతో పాటుగా దూదేకుల్లో సాంస్కృతిక వెనుకబాటు తనం వుంది. ఈ వెనకబాటు కారణంగా వీరిలో, సగం ముస్లిమీయ సంస్కృతి సగం హిందూ సంస్కృతి ఉంది. వేషం, భాష, ఆచార వ్యవహారాలన్నింటిలో ఈ సంయుక్త సంస్కృతి కనిపిస్తుంది.

ఈ దేశంలో నిజమైన లౌకికవాదులు ఎవరన్నా ఉన్నారంటే వాళ్లు దూదేకులే. ఎందుకంటే ముస్లిం - హిందూ సంస్కృతుల సమ్మేళనంగా వుంటూ ఈ రెండూ మతాల మధ్య దూరాన్ని చెరిపేసేరు. 'హిందూ - ముస్లిం భాయి భాయి' అన్న నినాదం అస్లీ ముస్లింలకు, బ్రాహ్మణ హిందువులకు నినాదం మాత్రమే కానీ - దళిత బహుజనులకు, దూదేకులకు ఇదే జీవనసూత్రం అయింది. ఈ సూత్రమే గ్రామీణ ప్రాంతాల్లో వీరిని ఐక్యంగా వుంచుతుంది.

ముస్లింలోనూ - హిందువుల్లోనూ ఉన్నత వర్గాలుగా, కులాలుగా అధికారాలను, హెూదాను, గౌరవాలనూ అనుభవిస్తున్న వారికి ఈ సంయుక్త జీవన సూత్రం శత్రువైంది. అంటరానిదైంది. అందుకే దూదేకులు ముస్లింలలో కింది తరగతివాళ్లుగా మిగిలిపోయారు. దీన్నే దూదేకుల కవులు ప్రశ్నిస్తున్నారు.

ఆర్థిక దృష్టి

ఆర్థిక దృష్టి కోణం నించి పరిశీలిస్తే దూదేకుల పరిస్థితి దళిత, బహుజనుల కన్న వందలరెట్లు దిగజారిపోయింది. తినటానికి, కనీసం కడుపునిండా తిండిలేక, ఉండటానికి ఒక గూడైనా లేక దుర్భర దారిద్ర్యం అనుభవిస్తున్నారు. చిన్న చిన్న వృత్తులమీద ఆధారపడి చాలీచాలని సంపాదనతో బతుకును తప్పనిసరై అలా నెట్టుకొస్తున్నారు.

ప్రపంచీకరణ నేపథ్యంలో చేతివృత్తులకు, చిన్న పరిశ్రమలకు కనీసం నిలువనీడలేక పోయింది. ముఖ్యంగా కాయర్ పరిశ్రమ దేశవ్యాప్తంగా వున్న పరుపుల మార్కెట్‌ను ఆక్రమించగా కులవృత్తిగా దూది ఏకి

పరుపులు కుట్టే దూదేకులు ఇవాళ పైసా సంపాదన లేక దిక్కులేని వారుగా నడిబజార్లో నిలబడ్డారు. దుర్భరమైన పేదరికంతో, ఆకలితో అలమటిస్తున్నారు.

''సెంచురీ నా కంచంలోంచి అన్నం ముద్దని తన్నుకుపోయింది
పాలిష్ట్ స్పాంజి పిల్లో
నా గొంతుమీద తన సుతిమెత్తని చేతులుంచి నులుముతుంది
నా ఊపిరిచుట్టూ ఒక ఉచ్చు
దేశ సరిహద్దుల్లో పాతిన ముళ్ల కంచెలా బిగుసుకుంటుంది.
నైపుణ్యం నిండిన నా చేతివేళ్లమీద
ఒక విదేశీ ఫోమ్ పాదం నాడా బూట్లతో నృత్యం చేస్తుంది
పగలని పత్తికాయలా
నా కవాను తీగల్లో ఒక అత్యాధునిక అపశృతి
పంటికింద పలుకురాయిలా తగులుతుంది'
(ఖాజా - నరం తెగిన కవాను)

ఎన్నో తరాలుగా నమ్ముకున్న వృత్తి ఇవాళ ఎందుకూ పనికిరాకుండా పోయింది. విదేశీ కాయర్ ఉత్పత్తులు మార్కెట్‌ను ఆక్రమించేశాయి. దూదికి, దూదిపరుపులకు విలువ లేదు. కొనేవారు లేరు. సామ్రాజ్యవాదం కొట్టిన ఈ చావుదెబ్బకు దూదేకులు కకావికలమయ్యారు. కనీసం రెండుపూటలా తిండి కూడా దొరకని స్థితిలో మరింత పేదరికంలోకి జారిపోయారు. అయినా ఇది ఎవరి దృష్టికీ రాలేదు.
దూది పరుపులకు మార్కెట్‌లో కాలం చెల్లిపోయినట్లే, గోళీసోడాలకూ కాలం చెల్లింది. సోడాలమ్ముకొని బతికే దూదేకుల సాయెబులను, కిన్‌లే, బిసిలరి, లెహర్‌పెప్సీ సోడాలు చావుదెబ్బకొట్టాయి. ఇక టైలరింగ్ పనిచేసేవారిని 'రెడీమేడ్' తొక్కేసింది. మొత్తం నమ్ముకున్న వృత్తులన్నీ ప్రపంచీకరణ దెబ్బకు నిల్వలేకపోగా- దూదేకులు పొట్ట చేతపట్టుకుని కొత్త వృత్తులను వెతుక్కుం టున్నారు. వ్యవసాయకూలీలుగా, తాపీపనివాళ్లుగా, రిక్షా, ఆటో రిక్షాతోలే వారిగా, డ్రైవర్లుగా కొత్త అవతారాలెత్తుతున్నారు.

''నిన్నటి దాకా
నాచీనీ పళ్లెంలో అన్నం ముద్దైన తెల్లదూది
ఇవాళ నాకళ్లలో ఘనీభవించిన తెల్లపొరైంది
నాబతుక్కొక ఆమీ అయిన ఊతకండె

పాతడబ్బాల్లా నన్ను సాచి తన్నింది
సుతిమెత్తని దూదేకిన చేతులతోనే
ఇప్పుడు సుతారి పనిలో గమేలా మోస్తూ -
అందమైన చమ్కీ పరుపులు కుట్టిన చేతులతోనే
ఇప్పుడు ఇటుకలు పేర్చి
మట్టిపోసి దిమ్మెస కొడుతూ -
(ఖాజా - నరం తెగిన కవాను)

ఇక చదువుకున్న వర్గం వాళ్లలో అధికభాగం టీచర్లుగా ఎదుగుతున్నారు. అక్కడక్కడా చిన్న ఉద్యోగాల్లో కొందరు స్థిరపడుతున్నా చదువుకున్న వారిలో కూడా ఎక్కువమంది ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. లేదా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొంటున్నారు.

మొత్తంగా దూదేకుల సంఖ్య రాష్ట్రంలో 50 లక్షల వరకూ ఉండగా ఆర్థికంగా అత్యంత దుర్భరమైన స్థానంలో వున్నవారు 90% పైమాటే. అందుకే దూదేకుల కవులు తమ ఆర్థిక దుస్థితిని, ప్రపంచీకరణ కారణంగా దిగజారి పోతున్న దూదేకుల దౌర్బల్యాన్ని ప్రశ్నిస్తున్నారు. కవిత్వీకరిస్తున్నారు.

దూదేకుల స్త్రీల దృష్టి

ముస్లిం స్త్రీలు మతపరంగా దుర్భర స్థితిలో వుంటే దూదేకుల స్త్రీలు మతంతో పాటు కులపరంగా కూడా దుర్భరస్థితిని ఎదుర్కొంటున్నారు. ముస్లిం స్త్రీలు ముస్లిం పురుష సమాజం నుంచి వివక్షనూ, అణచివేతనూ ఎదు ర్కొంటూ, హిందూమతం నుంచి ఛీత్కారాలను, దాడులను ఎదుర్కొం టున్నారు. కాగా దూదేకుల స్త్రీలు ముస్లిం సమాజంలో స్త్రీ పురుషుల నుంచి వివక్షనూ, అణచివేతనూ ఎదుర్కొంటూ హిందూ సమాజం నించి అవమానా లను ఎదుర్కొంటున్నారు.

''పరుపులు కుట్టీ కుట్టీ అలసిపోయిన అమ్మ
కటిక నేలమీదలా నడుం వాల్చి కునుకుదీస్తే
కాబూలీ వాడి అప్ప కల్లోకొచ్చి లాగిపెట్టి తన్ని లేపుతుంది''
(ఖాజా – మా...)

అంటరానితనం మినహా మూడురూపాయలు అప్పుకట్టలేక అవమానించబడ్డ మహదేవమ్మకు, దూదేకుల తల్లులకు పెద్ద తేడాలేదు. పేదరికం, అవమానం రెండిట్లో ఏదిముందో - ఏదివెనుకో తెలియదు గానీ దూదేకుల స్త్రీలను ఈ రెండూ కలిసి మరింత లోతుకి తొక్కేస్తున్నాయి.

దూదేకుల స్త్రీలు రీతి రివాజులు తెలియని వారుగా, ఉర్దూ రాని వారుగా, ఖురాన్ తెలియని వారుగా ముస్లిం సమాజం నుంచి అవమానించబడుతున్నారు.

"కానరాని అశక్తతతో కళ్లెమై
నా నోటిని బిగించి పట్టుకుంటుంది
రెప్పల కొమ్మల్లోంచి వీచిన వాళ్ల సుడిగాలుల చూపుల్లో
నేనో దూదిపింజనై హాలు హాలంతా
ఉన్నచోటి నుంచే గిరికీలు కొట్టబడతాను
వచ్చోరాదో - నా ఉర్దూ పరిజ్ఞానం మీద
వాళ్ల కుతూహలాల ప్రావీణ్య ప్రదర్శన జరిగి
ముఖాల్లో పరిహాస ఫలితాల తేల్చేసాక
తెగించి - బయటకు రాలేని మొహమాటపు నీటిచుక్కలు
కంటికోనల్లో ఇరుక్కుని అచ్చం నాలాగే అల్లాడతాయి"
(షాజహానా - లద్దాఫ్ని)

దూదేకుల స్త్రీల దుస్థితి ఇంతదాకా సాహిత్యం పట్టించుకోలేదు. సమాజానికి దూదేకుల్ని పట్టించుకునేంత పెద్ద మనసూలేదు. జ్ఞానమూలేదు. ఇటు ముస్లింల నుంచి అటు హిందువుల నుంచి, పురుషుల నుంచి దూదేకుల స్త్రీలు తక్కువగా, చులకనగా చూడబడుతున్నారు. చదువులేక, విజ్ఞానం లేక, మారుతున్న సమాజాన్ని అర్థం చేసుకోలేక వెనకబడిపోతున్నారు.

మొత్తంగా దూదేకుల సమాజం, ఇప్పుడు ఎదుర్కొంటున్న సమస్యల న్నిటి మీద ఐక్యంగా పోరాడాల్సి ఉంది. తమ మూలాలను సంస్కృతిని ప్రతిబింబించే సాహిత్య సృజన చేయాల్సి వుంది. దూదేకుల కవిత్వానికి ఇది కేవలం ఆరంభం మాత్రమే. ఖాజా, యాకూబ్, షాజహానా, యండి యాకూబ్‌పాషా, దిలావర్ వంటి కవులు ఈ కోణపు కవిత్వానికి, సాహితీసృజనకు వాకిలి తెరిచారు. ఈ దిశలో మరింత మంది దూదేకులు తమ ప్రత్యేక అస్థిత్వాన్ని చాటుకునేందుకు, చరిత్రను నిర్మించేందుకు కవిత్వం రాయాల్సి ఉంది. భవిష్యత్తు సాహిత్యం దూదేకుల జీవన మూలాలను, సంస్కృతిని ప్రతిబింబించాల్సి వుంది.

## వేంపెంట దళిత - సాహిత్య సృజన

-పెద్దరామస్వామి

ఘటన సామాజిక స్థితికి వ్యక్తరూపం. అంతమాత్రమే కాదు, దాన్ని యింకా చాలా రకాలుగా చూడవచ్చు.

తీవ్రమైన సామాజిక వ్యక్తతనూ - దానికి ముందు, తర్వాత సాగిన అంతర్గత పరిణామాలనూ కలిపి చదువుకునే పద్ధతి అందరికీ తెలిసిందే. ఘటన సంకేతంగా, ఉదాహరణగానే కాక ఒక గీటురాయి కావడానికి కూడా అవకాశం ఉంటుంది. ఘటన ద్వారా మన అనుభవంలో, అవగాహనలో భాగమైన చైతన్యం ఒక మలుపును సూచించే చారిత్రకప్రాధాన్యం కలిగిందిగానే గాక, ప్రతి సమకాలీనాంశాన్ని పరీక్షించుకోవడానికి దోహదపడుతుంది. అవ్యక్తంగా, చైతన్యరూపంగా ఉన్నవాటికి ఘటన ఒకానొక భౌతికవాస్తవిక రూపాన్ని అందిస్తుంది. అప్పుడు ఘటన నిర్దిష్ట స్థలకాలాల యదార్థానికే పరిమితం కాకుండా, వాటి ఆధారంగా అనేక సమకాలీనాంశాలకు గీటురాయిగా మారుతుంది. ఒక ఘటన గురించి పదేపదే చెప్పుకుంటున్నామంటే - దాని సమకాలీన విస్తరణరూపంగా స్వీకరిస్తున్నామని అర్థం చేసుకోవచ్చు.

యింత ఉపోద్ఘాతం దేనికంటే - వేంపెంటలో మాదిగలపై, బలహీనవర్గాలపై జరిగిన మారణకాండకు సంబంధించిన కేసును కోర్టు కొట్టివేసిన నేపథ్యంలో (11, డిసెంబర్ 2006) దళిత సాహిత్యం గురించి ఆలోచిస్తు - ఒక ఘటనకూ నడుస్తున్న కాలంలోని సామాజిక, సాహిత్య పరిణామాలకూ సంబంధం ఏమైనా ఉంటుందా? ఉంటే ఎట్లా ఉంటుంది? అనే సందేహాలు తలెత్తాయి. దాని చారిత్రక ప్రాధాన్యతను గుర్తించడంతోనే సందేహనివృత్తి జరగదుగదా.

వేంపెంటలో 1998 జులై 16న జరిగిన ఘటన మీద కోర్టు యిచ్చిన తీర్పు ప్రకారం అక్కడ ఏం నేరం జరిగింది? నేరస్తులు ఎవరు? అనేవి యితమిద్ధంగా తేలనట్టే. తాను నిర్దేశించుకున్న చట్రంలో సాక్ష్యాధారాలు దొరికితేగాని నిర్ధారణకు రాలేని న్యాయవ్యవస్థకూ - సాహిత్యానికీ ఏరకంగానూ పోలిక ఉండదు. సాహిత్యరచనకు సంఘటన ఎంత ప్రేరణగా పనిచేసినా; ఘటనలో కనిపించే నిజానిజాలను తేల్చుకునే విచక్షణ, వైఖరి దగ్గరే ఆగిపోకుండా అక్కడ తేలిన అంశం ఆధారంగా సాగే జీవిత అన్వేషణ ఫలితంగానే సాహిత్యం రూపొందుతుంది. అందుకే సామాజిక అంతర్గత స్థితిని, సంఘర్షణను ప్రకటించే ఘటనలను రచయితలు ఘటనలుగానే చూసి సంతృప్తి చెందరు. జీవిత అన్వేషణలో నిగ్గుదేల్చుకోవలసి వచ్చినప్పడల్లా ఘటనల గీటురాయి మీద అప్రమత్తమవుతూ ఉంటారు.

వేంపెంట కేసు కొట్టేయడం అనూహ్యమేమీ కాదు. మానవ జీవితంలో నేరం లేదా అవాంఛనీయ ఘటనలు జరిగిన, జరగడానికి

అవకాశం ఉన్న ఆవరణకు - న్యాయవ్యవస్థ నేరాన్ని పరిగణలోకి తీసుకొని సాక్ష్యాధారాలతో నిర్ధారణకు వచ్చే ఆవరణకూ మధ్య చాలా ఎడం ఉంటుంది. అందువల్లనే కోర్టులు తాము కోరుకునే పద్ధతిలో సాక్ష్యాధారాలు దొరికి నేరాన్ని గుర్తించినా, నేరస్వభావాన్ని గుర్తించలేవు. అందులోనూ నేరం జరిగిందనుకుంటున్న 'జీవిత' ఆవరణలోకి తొంగి చూడటం తమ కర్తవ్యం కాదని కూడా కోర్టులు అనుకుంటాయి.

ఈ తరహా చర్చలోకి వెళ్ళనవసరం లేదుగాని, వేంపెంటకు సంబంధించిన రెండు కేసులను కోర్టు కొట్టేసింది. మాదిగ బలహీనవర్గాలపై దాడి కేసు, దానికి నేపధ్యంలో ఆరోజు రాత్రి విప్లవకారులు ఒక వ్యక్తిని హత్యచేసిన కేసు రెండింటిని కొట్టేస్తూ ఒకేసారి తీర్పు వచ్చింది. తెర వెనక్కి వెళ్ళితే రెండు కేసుల్లోని ముద్దాయిలు ఎప్పుడో రాజీపడ్డారు. ఆ రకంగా వేంపెంట సమస్య పరిష్కారమైపోయింది. రాజీకుదరడం అనేదాన్ని చట్టపరిధిలో చూస్తే మనమూ కోర్టు తీర్పు దగ్గరికే వచ్చి ఆగిపోతాం. ఈ ఘటనలోని సంఘర్షణ, కేసుల్లోకి వచ్చిన వాస్తవాలు - వక్రీకరణలు, న్యాయవ్యవస్థకు ఉండే అగ్రవర్ణ స్వభావం మొదలైన విశ్లేషణల చట్టాన్ని దాటితే యింకా ఈ 'న్యాయక్రమం' వెల్లడి చేస్తున్న అనేక సమస్యలు కనిపిస్తాయి.

* * *

ఇప్పుడు సాహిత్యానికే పరిమితమై - వేంపెంట వైపు నుండి దళిత సాహిత్య ధోరణిని చూడ్డం వల్ల ఏమైన ప్రయోజనం ఉంటుందా? అనే ప్రశ్న వేసుకోవడం అవసరం. ఎందుకంటే సామాజిక స్థితికి వ్యక్తరూపమైన ఘటన వెనుక, దాని పూర్వాపరాల వెనుక ఉన్న వాటిని చర్చించడానికి సాహిత్యరంగమే బలమైన వాహిక కాబట్టి.

దళిత సాహిత్య విశ్లేషణలో కారంచేడు కేంద్రంగా ఉండటం దాని చారిత్రకతను తెలియజేస్తుంది. కారంచేడు పూర్వాపరాలు దళిత సాహిత్యక్రమం లోని అనేక చలనాలకు, చైతన్యాలకు, వ్యక్తీకరణ రూపాలకు సామాజిక ఉపపత్తిని సమకూర్చాయి. దాని ప్రాధాన్యత అటువంటిది. అట్లా వేంపెంట వైపు నుండి దళిత సాహిత్యాన్ని చూడ్డానికి కనీసం కేసు కొట్టివేత అయినా ఒక సందర్భంగా నిలబడుతుందని నమ్మకం. కారంచేడు, చుండూరు ఘటనల్లోని వ్యక్తాంశాలు దళిత సామాజిక, సాంస్కృతిక జీవనంలోని అవ్యక్తాంశాల దగ్గరికి తీసుకపోయి, ఆ జీవన పునాదిని ప్రతిబింబించడంలో సాహిత్యరంగాన్ని నిర్దేశించింది. అట్లా 1998 తర్వాత దళిత సాహిత్య ప్రయాణం మీద వేంపెంట ఏమైనా ప్రభావం చూపిందా? సూటిగా ఈ ప్రశ్న వేసుకొంటే కొత్త పరిశీలనలకు ఆస్కారం ఉండొచ్చు.

అయితే వేంపెంట ఘటన జరిగేనాటికి దళితవాదంలో సామాజికంగా, సాహిత్యపరంగా జరిగిన ముఖ్యమైన పరిణామాన్ని స్థూలంగానైనా గుర్తు చేసుకోవాలి. కారంచేడు ఉద్యమంతో రూపొందిన దళిత నాయకత్వం

రాజకీయాల్లో, సాహిత్యంలో వేంపెంట నాటికల్లా ఫేడ్ ఔట్ అయిపోయింది. కొత్త శక్తులు ముందుకు వచ్చాయి. 1985-95 దశాబ్దంలోని దళిత విశ్లేషణలు వెనక్కి పోయి, కొత్త ఆకాంక్షల మీద కొత్త సమీకరణాలను మోసుకొని కొత్త తరం ముందుకు వచ్చింది. దళిత క్షేత్రం అంతా కొత్త నిర్వచనాల, వ్యాఖ్యానాల పునర్నిర్మాణానికి గురి కావలసి వచ్చింది. మాదిగ దండోరా ఆవిర్భావం దళిత ఉద్యమంలో, సాహిత్యంలో అలాంటి ఒక కీలకమైన మలుపు. అది దళిత సాహిత్యం అప్రమత్తం కావలసిన సందర్భం. అక్కడ నిలబడి గతాన్ని, వర్తమానాన్ని వివరించవలసి ఉండింది. కానీ ఆ పని జరగలేదు. జరగకపోవడం కూడా కొత్త ఆకాంక్షల, సమీకరణాల ప్రాబల్యాన్ని సూచిస్తుంది. అందులోని భావోద్వేగాల తీవ్రతను వేంపెంట ఘటన దిగ్భ్రాంతికరం చేసింది. దళిత సాహిత్యధోరణి సహజంగానే సృజనాత్మక సాహిత్యంలో వ్యక్తమయినంతగా సామాజిక వ్యాఖ్యానంలో మేధోశక్తిని విడుదల చేయలేకపోయింది. ఈ మాట కొంచెం నొప్పి కలిగిస్తుందేమో కాని ఈవైపు నుండి సహనంగా చూడ్డం వల్ల భవిష్యత్తు మాట ఏమోగాని, గతాన్ని లోతుగా చూడ్డానికి వీలవుతుంది. ఇవి ఎట్లాగూ ఆవేశకావేశాలకు, ఉద్రిక్త సూత్రీకరణలకు కాలం చెల్లిన రోజులు కాబట్టి నిబ్బరంగా అన్వేషించవచ్చు.

ఈ మాట ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే - మాదిగదండోరా సృజించినభావోద్వేగాల సన్నివేశంలో వేంపెంట ఒకానొక ద్రిగ్భాంతికరమైన అనుభవంగా మిగిలిపోయిందేకాని, సృజనాత్మకరంగంలోని మేధో అవసరాన్ని రచయితలు పట్టించుకోలేకపోయారు. ఆ డిమాండ్‌ను దళిత రచయితలు స్వీకరించలేకపోయారు. ఈ వైఫల్యం వల్ల దళిత సాహిత్యకారులు వేంపెంట ప్రభావానికి లోనుకాలేకపోయారు, దాన్నుండి ఏమీ తీసుకోలేకపోయారు. నిజానికి యింకోరకంగా చూస్తే ఈ అవసరాన్ని మేధోస్థాయికి తీసుకుపోనవసరం లేకుండానే అప్పటికే దళిత సాహిత్యానికి నిండుగా ఉన్న జీవితనుభవ గాఢత నుండయినా ఈ ద్రిగ్భాంతికరమైన దాని వెనుక ఉన్న క్లిష్టతను అన్వేషించడానికి పూనుకొని ఉండాల్సింది. అదే జరిగి ఉండింటే దళిత సాహిత్యమేగాక, మొత్తంగా తెలుగు ప్రగతిశీల సాహిత్యశిబిరం శక్తివంతం అయి ఉండేది. సాహిత్యం సామాజిక తాత్వికతను గాఢంగా ప్రకటించుకొని ఉండేది.

కారంచేడు నుండిగాక యింకా వెనక్కి వెళ్ళి కంచికచర్ల, కాటూరు ఎలమర్రు కాలం నుండి దళితులపై జరిగిన దాడులను పరిశీలిస్తే, వాటికీ - వేంపెంట ఘటనకు అంతర్గత స్వభావరీత్యానే చాలా తేడా ఉన్నట్టు తెలుస్తుంది. తక్కిన వాటికంటే వేంపెంట మారణకాండకు దారితీసిన పరిస్థితులు చాలా సంక్లిష్టమైనవి. దళితుల

ఆత్మగౌరవ ప్రకటనను, ప్రతిఘటనను మన సామాజిక వ్యవస్థలోని అనేకానేక క్లిష్టతలనుండి వేంపెంట వినిపించింది.

దళితులు ఆత్మగౌరవాన్ని ప్రకటించుకుంటే, తమ క్రియాశీల భాగస్వామ్యాన్ని ప్రతిష్టించుకుంటే, అది నిర్ణాయాత్మక రూపంలో (అది సర్వామోదం పొందే రూపం కానవసరం లేదు) కూడా ఉంటే సమాజం ఎట్లా ప్రతిస్పందిస్తుంది? అనేది చాలా ముఖ్యమైన విషయం. దళితులపై జరిగిన దాడులన్నీ ఈ ప్రతిస్పందన ఫలితాలే. వేంపెంట అయితే - ఆ నిర్ణయాత్మకత మాదిగల్లో (ఏ కొంచెమో) ఉంటే మాలలు ఎట్లా ప్రతిస్పందిస్తారు? అని నిర్దిష్టంగానూ; ఏ కింది కులమైనా అలా వ్యవహరిస్తే మిగతా కులాలన్నీ ఎట్లా తీసుకుంటాయి? అనే సాధారణ స్థాయిలోనూ అనేక విషయాలను బైటికి లాగింది. అంటే వేంపెంటలో 'భిన్న సమాజాల' ప్రతిస్పందనను చూడవలసి వచ్చింది. యిది కులవ్యవస్థ సంక్లిష్టతకు అచ్చమైన ఉదాహరణ.

అప్పటికే న్యాయమైన అకాంక్షతో వచ్చిన మాదిగ దండోరా వల్ల మాదిగ, మాల నొంతదనం, ప్రత్యేకతలు, ప్రయోజనాల గురించిన సంఘర్షణ సామాజికంగా వైమనస్యానికి దారి తీసి ఉన్నప్పటికీ, ఈ ప్రభావం యించుమించుగా ఏమీ లేకుండానే వేంపెంటలో యింతకన్నా తీవ్రమైన కులవైరుధ్యాలు బైటికి వచ్చాయి. అక్కడి భూస్వామ్యానికి అదనపు లక్షణంగా ఉన్న ఫ్యాక్షనిజం తోడై సామాజిక వ్యవస్థ క్లిష్టతనంతా విషాదంగా మన అనుభవంలోకి వచ్చిన ఘటన అది. అయితే దీన్ని సామాజిక ఉద్యమాలు యిట్లా చూడగలిగాయా? అని సందేహం.

వాస్తవానికి వేంపెంట ఘటనలోని క్లిష్టతకు అక్కడి వర్గపోరాటం కారణం. అట్టడుగు శ్రేణులు వర్గపోరాటంలోకి రావడం వల్ల వాటి మధ్య ఉన్న వైరుధ్యాలను అది పట్టికుదిపింది. అప్పట్లో విప్లవకారుల అవగాహన, అచరణల గురించి చర్చ జరిగినంతగా (అదీ అవసరమే) ఈ అనుభవం నుండి దళిత ఉద్యమం స్వీకరించవలసింది ఏమైనా ఉన్నదా? అనే ఆలోచన సాగలేదు. ఘటన నేపథ్యం రీత్యా విప్లవకారులు అవగాహన గురించి విమర్శ చేయడం తప్పనిసరైనా, వేంపెంట నుండి వాళ్ళు ఏం నేర్చుకుంటారు? అనేదానితో పాటు ముఖ్యంగా దళిత రచయితలు - విడివిడి కులాల అస్తిత్వ చైతన్యంతో ఉన్నాసరే - వేంపెంట ఘటనను కనీసం జీవితానుభవపు లోతులనుండయిన అర్థం చేసుకునే ప్రయత్నం చేసి ఉంటే దళిత సాహిత్యధోరణి యివ్వాళ ఉన్న స్థితిలో అయితే ఉండేది కాదని చెప్పవచ్చు. విడి కులాల సాంస్కృతిక జీవిత చిత్రణతో పాటు కులచట్రంలోని వేర్వేరు పీడిత కులాల మధ్య ఉన్న వైరుధ్యాలను, ఐక్యతను దళిత సాహిత్యం చిత్రించి ఉండేది. ముఖ్యంగా ఆత్మగౌరవాన్ని ప్రకటించుకోవడం, కాపాడుకోవడం సంపద,

అధికారం కేంద్రంగానే సాధ్యం అవుతుందని చెప్పి ఉండేది. వేర్వేరు అస్తిత్వ నిర్మాణాలుగా ఉన్న కుల వ్యవస్థలో ఒక కులం ఆ ప్రయత్నం చేయగానే మిగితా కుల ప్రజలు ఒక సమూహంగా, ఒక నిర్మాణంలోని సభ్యులుగా ప్రతిస్పందించే తీరును - దాన్ని ఐడెంటిటీ నిర్దేశించే తీరును పట్టించుకొని ఉండేది. సంపద, అధికారం నిషిద్ధమైన కింది కులాల్లో - వాటి కేంద్రంగానే సహకారాన్ని పెంచడం అనే క్లిష్టమైన క్రమంలోకన్నా మానవ సంబంధాలను, ఉద్వేగాలను, స్వభావాలను గుర్తెరిగి, చిత్రించే సందర్భం సాహిత్యానికి ఏముంటుంది? కంటికి కనిపించే వాస్తవాలు, గుర్తించి పోల్చుకోదగిన అనుభవాలు సామాజిక విశ్లేషణ సాధనాలు కాగలవుకాని, అనుభవంలోకి వచ్చీ నిగ్గుదేలని వాటి సారం ఏమిటో చెప్పగలిగేది సాహిత్యం మాత్రమే. దళిత సాహిత్యానికి అనుభవాన్ని గాఢంగా, తీవ్రంగా చెప్పగల నేర్పు ఉన్నా, ఆ అనుభవాన్ని విశ్లేషణాత్మకంగా, సామాజిక తాత్విక కోణంలో చెప్పడంలో పరిమితి ఉన్నది. దీనివల్ల చాలా సంక్లిష్టమైన జీవిత ప్రతిఫలనంగా బద్ధలయిన వేంపెంట ప్రభావానికి అప్పటికే విడికులాల అస్తిత్వ చైతన్యంలోకి వెళ్ళిపోయిన దళిత సాహిత్య ధోరణి గురికాలేకపోయింది. పైగా స్వీయ అస్తిత్వ అనుభవంలో అర్థమైన, నిగ్గుదేలిన విషయాలను చిత్రించడంలో సౌకర్యం ఉంటుంది. అక్కడ వ్యక్తమయ్యే శక్తీ అపూర్వమైనదే. కానీ అనుభవంలో నిగ్గుదేలని వాటిని తరచి చూడాలంటే మేధోస్థాయిలోకి కూడా తీసుకెళ్ళవలసి ఉంటుంది. మళ్ళీ పదే పదే వేంపెంట ఘటనలాంటి గీటురాళ్ళ మీద తరచి చూసుకొనే క్రమంలోనే సాహిత్యం రూపొందుతుంది, సామాజిక జీవితానుభవానికి తాత్వికస్పర్శ సమకూరుతుంది.

కానీ అప్పటికి స్వీయశక్తుల అస్తిత్వం అనే నిర్దిష్టతను దళిత సాహిత్యం ఉక్కు చట్రంగా భావించి స్వయం సంకెళ్ళలో ఉన్నది. దీనికి సమర్థనగా సిద్ధాంత రూపకల్పన చేస్తూ ఉన్నది. వేంపెంట దీనికి భిన్నమైన అనుభవాన్ని తీసుకురావడం వల్ల దళిత రచయితలు సహజంగానే దాన్ని పట్టించుకోలేకపోయారు. పీడిత కులాల (పీడిత వర్గ) ఐక్యత అనే విప్లవకారుల వ్యూహం బెడిసికొట్టిందని అనుకున్నా; విడివిడి కులాల అస్థిత్వం వైపు నుండైనా సరే దళిత సాహిత్యం నేర్చుకోవలసింది వేంపెంటలో ఉన్నది.

మాదిగదండోరా దళిత సాహిత్యంలోకి తీసుకు వచ్చిన అపురూపమైన నిర్దిష్టతకు, వైవిధ్యానికి వేంపెంట అనేక సౌకర్యాలను సమకూర్చింది. పలు నిర్దిష్టతల మధ్య ఉండే వైరుధ్యాల స్వభావాన్ని చెప్పడమేగాక, పీడితకులాలన్నిటి మధ్య ఏర్పడాల్సిన పరస్పర సహకార సంబంధాన్ని, ఐక్యతను - సంపదలో, అధికారంలో సమాన భాగస్వామ్యం అనే ప్రాతిపదికలు మాత్రమే సాధ్యం చేయగలదని - ఆ ప్రాతిపదికనే ఐక్యత క్రమంలో అనేక

సంఘర్షణలకూ కారణం అవుతాయని కూడా వేంపెంట ఘటన నిరూపించింది.

సామాజిక రంగంలోని ఈ సవాల్‌ను దళిత, ప్రగతిశీల శక్తులు పరిష్కరించడం - కారంచేడు, చుండూరు లాంటి ఘటనల నుండి దళితుల ఆత్మగౌరవం, ప్రతిఘటనలను తీర్చిదిద్దినంత సులువైన పని కాదు. అంత మాత్రాన నిరాశపడనవసరం లేదు కాని, దాన్ని సాధ్యం చేయడంలో సాహిత్యం పాత్ర గుర్తించవలసి ఉన్నది. కారంచేడు నుండి దళిత సాహిత్యం సృజనాత్మక ప్రక్రియల్లో విస్తరించడంతోపాటు, దానికి అవసరమైన సిద్ధాంతరూపకల్పన కూడా చేస్తూ వచ్చింది. దీనికి దళితులపై హత్యాకాండలతో పాటు అనేక రూపాల్లో కొనసాగుతున్న వెలి, వివక్ష, అణచివేత రూపాల వల్ల పోగుబడ్డ దళిత అనుభవం వనరుగా ఉపయోగపడింది. సామాజిక వ్యవస్థా నిర్మాణాలను సిద్ధాంత స్థాయిలో అర్థం చేసుకొనే ప్రయత్నం దళితసాహిత్యానికి తనదైన గొంతును, చూపును అందించాయి. చారిత్రక ప్రాధాన్యంగానే కాక ఒక అనుభవంగా, గీటురాయిగా కారంచేడును వర్తమాన విస్తరణ రూపంగా స్వీకరించారు. వేంపెంటను దాని గుణాత్మకరూపంగా దళిత రచయితలు గుర్తించి ఉంటే పరిస్థితి మరోవిధంగా ఉండేది.

***

అయిదు మంది మాదిగలను నలుగురు బలహీన వర్గాల వారిని అగ్రవర్ణ భూస్వామ్య ముఠానాయకుల నాయకత్వంలో కొన్ని బి.సి. కులాల వాళ్ళు, మాల కులస్తులు హత్యచేసి, గృహదహనాలకు పాల్పడిన ఘటన అప్పటి దళిత బహుజన ఉద్యమ నిర్మాణాల్లో, పోరాటాల్లో, ఆకాంక్షల్లో ఒక ప్రధానాంశం కాలేకపోవడం ముఖ్యమైన సమస్య. అంటే కారంచేడు ఘటన దళిత ఉద్యమ నిర్మాణానికి, దళిత సాహిత్యధోరణికి కేంద్రంగా నిలబడితే వేంపెంట ఘటన జరిగేనాటికల్లా ఆ ఉద్యమాల్లో దానికి చోటు దొరకని స్థితి వచ్చింది. సానుభూతి, ప్రతిస్పందనలతో ఆగిపోకుండా దళిత ఉద్యమ అవగాహనను, పోరాటరూపాలను బలోపేతం చేసే అంశంగా వేంపెంట ఉండాల్సింది. దళిత ఉద్యమ దశలోని మౌలికమార్పును యిది సూచిస్తుంది. కారంచేడు నుండి బయల్దేరిన దళిత ఉద్యమం అనేక నిర్దిష్టతల్లోకి ప్రవహించడం ప్రజాస్వామిక పరిణామమే అయినా కుల వ్యవస్థలోని, భూస్వామ్యంలోని క్లిష్టతను సవాల్‌గా స్వీకరించలేని స్థితిలోకి వెళ్ళిపోవడం వాస్తవం. నిజానికి మాదిగదండోరా ఏ వాస్తవికతను చాటిచెప్పిందో అలాంటి వాస్తవికతనే భీభత్సంగా వెల్లడిచేసిన వేంపెంట దండోరా ఉద్యమానికి, సామాజిక విశ్లేషణకు కీలక సాధనం కావలసి ఉండింది.

సామాజిక ఉద్యమాలకు ప్రాధాన్యతలు, విస్మరణలు ఉండేవే అనుకున్నా దళిత సాహిత్యకారులు, విశ్లేషకులు జీవిత చిత్రణ పరిధిని విస్తరింపచేయడానికి వేంపెంట

ఘటనను ఒక అధ్యయన వనరుగా, గీటురాయిగా పరిగణించి ఉండాల్సింది. నిజానికి అప్పటికే దళిత సాహిత్య ఉధృతి తగ్గిందనీ, విస్తృతి కావడం లేదనీ అభిప్రాయాలు మొదలయ్యాయి. వాటి నిజానిజాల సంగతి ఎలా ఉన్నా, వేంపెంట కేంద్రంగా దళిత బహుజన సాహిత్య సృజనను పరీక్షకు పెట్టి ఉంటే కుల నిర్మాణాల మధ్య వైరుధ్యాలతో పాటు అంతిమంగా మానవ సంబంధాల్లో గెలిచే అంశానికే పట్టం కట్టడం ఎలా అన్న ప్రశ్న దళితవాద సాహిత్యంలో భాగమై ఉండేది. కులవ్యవస్థలోని వివక్ష, అంతరం, అణచివేత రూపాలన్నిటినీ చిత్రిస్తూ వాటికి వ్యతిరేకంగా ఎక్కడికక్కడ సాగే పోరాటం వైరి స్థానాలను తుడిచేసి సమస్త ఆధిపత్య నిర్మాణల్లోని అగ్రవర్ణతత్వాన్ని ఓడించడానికి సంఘటితపడే క్రమాన్ని చిత్రించగలిగేది. అలాంటి సన్నివేశం చరిత్రలో భాగమై దూరంగా వెళ్ళిపోయింది. 'వేంపెంట సంఘటన' అని వ్యవహార సౌకర్యం కోసం అనవచ్చుగాని వాస్తవానికి అదొక ఎరుక. యింకా బాగా చెప్పాలంటే ఎరుకక్రమం. ఇప్పుడు గడచిన చరిత్ర ఎలా ఉండేదో చెప్పడం వల్ల ప్రయోజనం ఉండకపోవచ్చు గాని, నిజంగానే అదొక ఎరుక క్రమంగా మనలో ప్రతిఫలించి ఉంటే దళిత సాహిత్యం ఎలా ఉండేది? అనే ఆసక్తినైతే తుడిచేసుకోనవసరం లేదుగదా.

## దైవచింతన - డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్

మనిషి తన జీవితంలో రకరకాల భావాలకు లోనవుతాడు. వీటిలో ప్రేమ, జాలి, కోపం, దుఃఖం ఇలా ఎన్నో ఉంటాయి. ఇవి కాక కొన్ని సందర్భాల్లో దైవభక్తి, దివ్యానుభూతులు, అనిర్వచనీయమైన ఆధ్యాత్మిక ఆనందం వంటి భావనలు కూడా కలుగుతాయి. వీటికి జాతి, మత, ప్రాంతీయ పరిమితులేవీ ఉన్నట్టు కనబడవు. వ్యవస్థీకృతమైన పెద్ద మతాలే కాదు, ఆదిమజాతి తెగలకు చెంది గ్రామదేవతలు వగైరాలను ఆరాధించేవారికి కూడా నిజంగా ఇలాంటి భావనలు కలుగుతాయనేది తెలిసిన విషయమే. భావాలన్నిటికీ కేంద్రం మెదడే అని భౌతికవాదుల నమ్మకం. ఇతర ఉద్రేకాలకు లోనయినప్పుడు మనిషి మెదడులో ఎటువంటి మార్పులు కలుగుతాయో పరిశోధనల ద్వారా తెలుసుకుంటున్న శాస్త్రవేత్తలు ఆధ్యాత్మిక భావనలు కలిగించే ప్రభావాన్ని కూడా పరిశీలించారు.

ప్రపంచంలో ఎక్కడైనా ఇలాటి భావనలకు కొన్ని లక్షణాలు సామాన్యం. వీటికి లోనయినవారికి కలిగే అనుభూతుల్లో ఒకరకమైన పరిపూర్ణత్వం సాధించినట్టనిపించడం, మైమరచిపోవడం, విశ్వంతో ఏకమైనట్టు అనిపించడం, అనిర్వచనీయమైన మనశ్శాంతి, అన్నిరకాల భయాలనుంచి విముక్తి పొందిన భావన, అలౌకికానందం, భగవత్స్వరూపాన్ని దర్శించడం వగైరాలుంటాయి. అలాంటి పరిస్థితుల్లో మెదడులో ఎటువంటి మార్పులు కలుగుతాయో కనిపెట్టడానికి ధ్యానంలో మునిగిన కొందరు బౌద్ధ భిక్షువులపై ప్రయోగాలు చేశారు. వారి మెదడులో నిద్రాణమైన భాగాలు మేలుకున్నట్టూ, పనిచేస్తున్న కేంద్రాలు సుషుప్తావస్థకు చేరుకున్నట్టూ తెలియవచ్చింది. ఈ ప్రయోగాల ఉద్దేశం దేవుడున్నాడా లేడా అన్నది నిరూపించడం కాదు. ఆధ్యాత్మిక స్థితిలో ఉన్న మెదడు పనిచేసే పద్ధతిలో కలిగే మార్పులను పసిగట్టడమే.

దీనికి కారణం ఉంది. మతపరమైన చర్యల్లో ఊహలు ఒక భాగం మాత్రమే. మతాల ఆచరణలో పూజలూ, పునస్కారాలూ, తంతులూ, నైతిక ఆచరణా, సత్కార్యాలు చెయ్యడమూ, ఇతరులపట్లా , సమాజం పట్లా ధార్మిక సద్వర్తనా ఇలా అనేకం ఉంటాయి. ఎటొచ్చీ మతవిశ్వాసాలకు బలమైన పునాది ఆలోచనల, భావాలవల్లనే కలుగుతుంది కనక వాటికి గల శారీరిక లక్షణాలను గురించి చర్చించడమే ప్రస్తుత ఉద్దేశం.

ఈ ప్రయోగాలకు గురి అయినవారి మెదడులోని రక్తప్రవాహంలో స్వల్ప మోతాదులో రేడియో ధార్మిక పదార్థాన్ని ప్రవేశపెట్టి దాని ఆచూకీని బైటినుంచి డిటెక్టర్ల ద్వారా కనిపెట్టడం జరిగింది.

దీనివల్ల మెదడును ''చిత్రీకరించడం'' సాధ్యమైంది. ధ్యానస్థితిలో ఉన్నప్పుడు మెదడు ముందు భాగంలోని ప్రక్రియలు వేగవంతం అయాయి. ఏదైనా పనిమీద మనసుపెట్టినప్పుడు జరిగేదిదే. అదే సమయంలో మెదడుకు పైభాగంలోనూ, వెనకా ఉండే పార్శ్విక, లేదా బహిస్థ (పెరైటల్) భాగంలోనూ చర్యలు తగ్గాయి. పరిసరాలను గమనించలేని స్థితిలో ఇదే జరుగుతుంది. ధ్యానంలో నిమగ్నులైనవారికి తమను తాము మరచిపోయినట్టూ, పరిసరాలకూ, స్థలకాలాలకూ అతీతులైనట్టూ అనిపించడానికి కారణం ఇదే. ఈ మార్పులు అనేక పరిశోధనల్లో బైటపడ్డాయి గనక ఆధ్యాత్మిక భావనలకు ముఖ్యకారణాలు ఇవేనని శాస్త్రజ్ఞులు నమ్ముతున్నారు.

మెదడులో కొన్ని భాగాలకు చైతన్యం కలిగి, చైతన్యవంతమైన కేంద్రాలు నిద్రాణస్థితికి చేరుకోవడంతో ఆధ్యాత్మిక స్థితిలో అనుభవించిన యదార్థభావన మెలకువగా ఉన్నప్పుడు అనుభవంలోకి వచ్చే యదార్థత కన్నాగాఢమైనదిగా అనిపిస్తుంది. ఇది చాలా బలమైన ప్రభావం కలిగిస్తుందనడంలో సందేహం లేదు. దైవ ప్రార్థనలవల్ల రోగాలకు ఉపశమనం కలగడమూ, హిప్నోసిస్ ద్వారా చికిత్స జరగడమూ వగైరాలన్నీ మెదడులో కలిగే మార్పులతోనూ, పై అంశాలతోనూ ముడిపడినవే. అందుచేత నాస్తికులు దేవుడు లేడని ఒక్కమాటలో కొట్టిపారేస్తున్నపుడు ఆస్తికులకు తమ ప్రగాఢ విశ్వాసానికి అవమానం జరిగిందని అనిపించడంలో ఆశ్చర్యం లేదు.

పరిశోధనలకు లోనయిన బౌద్ధ భిక్షువులు ధ్యానం చేస్తున్నప్పుడు వారి మెదడులో నిజంగానే ఆనందాన్నీ, ఆందోళనకు దూరం కావడాన్నీ, ప్రశాంతతనూ ప్రతిఫలించే మార్పులు కలిగాయని రుజువైంది. ఆధ్యాత్మిక భావాలు లేని మనుషులకు కృత్రిమంగా ఇటువంటి మనస్థితి కలిగిస్తే వారు సరిగ్గా ఇటువంటి భావనలకే లోనవుతారా అని తెలుసుకోవడానికి కొన్ని పరిశోధనలు జరుగుతున్నాయి. వారిని నిశ్శబ్దంగా, చీకటిగా ఉన్న గదిలో కూర్చోబెట్టి వారి తలలను అయస్కాంతక్షేత్ర ప్రభావానికి గురిచేశారు. ఆ స్థితిలో వారి మెదడులో కలిగే మార్పులు ఆధ్యాత్మిక భావాలను పోలినవా కాదా అని పరిశీలిస్తున్నారు.

సైన్స్‌పరంగా చూస్తే మెదడు విద్యుత్‌రసాయనాలతో (ఎలెక్ట్రో కెమికల్స్) పనిచేసే శరీరభాగం. అందుచేత ఆధ్యాత్మిక స్థితిలో ఉన్నప్పుడు అందులో ఎలాంటి మార్పులు కలుగుతున్నాయో తెలుసుకోవడం శాస్త్రవేత్తల కర్తవ్యం. ఎపిలెప్సీవంటి కొన్ని రకాల మూర్ఛరోగాలవల్లనూ, కొన్ని మాదకద్రవ్యాలవల్లనూ కూడా మతపరమైన భ్రమలు కలుగుతాయని డాక్టర్లకు తెలుసు. మన దేశంలో కొందరు సాధువులూ, బాబాలూ

భంగువంటి మత్తు పదార్థాలు సేవిస్తారనేది తెలిసినదే.

దేవుడి గురించిన భావనలకు సాంస్కృతిక, సమాజపరమైన కారణాలు ఎన్ని ఉన్నప్పటికీ ప్రతి యుగంలోనూ వివిధ జాతుల, ప్రాంతాలవారికి నిజంగానే ఒకే రకమైన ఆధ్యాత్మిక భావనలు కలుగుతూ వస్తున్నాయనడంలో సందేహం లేదు. ఇదంతా ఏదో కుట్ర అనీ, అబద్ధాలనీ అనుకోవడం కూడా సబబు కాదు. దీనికిగల భౌతిక కారణాలు మెదడు నిర్మాణంలోనే ఉన్నట్టు కనబడుతోంది. కొందరు శాస్త్రవేత్తలు ప్రస్తుత పరిణామదశలో మనిషి మెదడులో దేవుణ్ణి నమ్మే లక్షణాలు బలంగా ఉన్నాయనీ, ఇప్పట్లో అందులో మార్పు కలిగే పరిస్థితి లేదనీ అంటున్నారు. అంటే దీనర్థం జ్ఞానోదయం కలిగినప్పుడు గౌతమ బుద్ధుడి మెదడుయొక్క పై భాగం సద్దుమణిగిందనా? మోజెస్, మహమ్మద్ ప్రవక్త తదితరులకు వినిపించిన అశరీరవాణి చిత్త భ్రమేనా?
యేసుక్రీస్తు దేవుడితో సంభాషించడం మెదడులో కలిగిన గందరగోళమేనా? దేవుడు మనిషిని సృష్టించాడని నమ్మేవారు మాత్రం దేవుడి గురించిన భావన కేవలం మనిషి మెదడు సృష్టించినదే అంటే ఆగ్రహం చెందుతారు. ఈ చర్చకు స్పష్టమైన వివరణ ఏదీ ఇంకా లభించలేదు కనక మతవిశ్వాసాలు కొందరికి మనశ్శాంతినీ, కొన్ని పరిస్థితుల్లో రుగ్మతల నివారణకూ కూడా ఎలా పనికొస్తున్నాయో, అందుకు దారితీసే ప్రక్రియలు మెదడులో ఎలా జరుగుతున్నాయో తెలుసుకోవడానికి పరిశోధనలు కొనసాగుతున్నాయి.

## ఏ కులమబ్బీ - చెరబండరాజు

ఏ కులమబ్బీ
మాదే మతమబ్బీ ॥ ఏ కుల ॥

మట్టి పిసికి ఇటుక చేసి
ఇల్లు కట్టి పెట్టినపుడు ॥ ఇల్లు ॥
డొక్కలెండి కోండ్రలేసి
ధాన్యరాసు లెత్తినపుడు ॥ ఏ కుల ॥

పొగ గొట్టాలై పేగులు
కొలిమి సెగలు చిమ్మినపుడు ॥ కొ ॥
దగ్గులతో క్షీణిస్తూ
బొగ్గుట్టలు తవ్వినపుడు ॥ ఏ కుల ॥

మాడు చెక్కలే తింటూ
మాగాణం దున్నినపుడు ॥ మా ॥
ఎండలలో బండలపై
విగ్రహాలు చెక్కినపుడు ॥ ఏ కుల ॥

పూజకు అందిచ్చు పూల
బుట్టలల్లి ఇచ్చినపుడు ॥ బుట్ట ॥
రామకోటి రాసుకునే
కాగితాలు చేసినపుడు ॥ ఏ కుల ॥

పశువులను చంపి మీకు
చెప్పలు కుట్టిచ్చినపుడు ॥ చె ॥
కూటికింత కూడు లేక
కుండలు జేసిచ్చినపుడు ॥ ఏ కుల ॥

సన్యాసులై వస్తే

క్షవరాలు చేసినపుడు ॥ క్ష ॥

మురికి గుడ్డలుతికి

మల్లె పూలు చేసి ఇచ్చినపుడు ॥ ఏ కుల ॥

చెల్లవు మీ కల్లబొల్లి

కబుర్లన్ని చెదలు పట్టె ॥ క ॥

సాగదు మీ పాత రోత

రథం విరిగిపోయింది ॥ ఏ కుల ॥

కులాలనీ కులంలోని

శాఖలనీ వేరుజేస్తె ॥ శా ॥

చెమటోడ్చే మనుషులమూ

చేయి కలిపి నిలబడితే ॥ ఏ కుల ॥

## నల్లాటి సూరీడు — శివసాగర్

నల్ల నల్ల సూరీడు
నల్లాటి సూరీడు
నలుపు నలుపు సూరీడు
గెలుపు దారి సూరీడు

అందాల సూరీడు
అందమైన సూరీడు
అందమైన సూరీడు
ఆకు సెప్పుల సూరీడు || నల్ల నల్ల ||

ఏరువాక సూరీడు
కారు మబ్బుల సూరీడు
సినుకు సినుకు సూరీడు
సిన్నారి సూరీడు || నల్ల నల్ల ||
జొన్నవెన్ను కన్నుల్లో
జోలపాడే సూరీడు || నల్ల నల్ల ||

ఉట్టి మీద సూరీడు
మట్టి కుండల్లో సూరీడు
ఎద్దు కూర సూరీడు
సద్దిబువ్వ సూరీడు
తాటాకు పాకలో
సిందు తొక్కే సూరీడు || నల్ల నల్ల ||

కొమ్ముకండె సూరీడు
కల్లుగీత సూరీడు
మాతంగి సూరీడు
గోసంగి సూరీడు

ఆలిచిప్ప అద్దంలో నవ్వుకునే సూరీడు
నత్తగుల్ల గజ్జె కట్టి నాట్యమాడె సూరీడు

అందాల సూరీడు
అందమైన సూరీడు
అందమైన సూరీడు
అంటరాని సూరీడు ॥ నల్ల నల్ల ॥

సజీవ దహనంలో బూడిదైన సూరీడు
బూడిద నుండి లేచి భగ్గుమన్న సూరీడు
కారంచేడు పొలాలలో నెత్తురొడ్డిన సూరీడు
నెత్తుటి తోవలోన నడక నేర్చే సూరీడు
తుంగభద్ర అలలపైన గోనిసంచిలో సూరీడు ॥నల్ల నల్ల ॥

సెమట సుక్క స్వర్ణమ్మతో
చెలిమి చేసే సూరీడు
చంద్రవంక ఏసన్నకు
మనసిచ్చిన సూరీడు ॥ నల్ల నల్ల ॥

ఆలీసమ్మ బాసల్లో నిప్పుకణిక సూరీడు
అనిల్ బాబు చూపుల్లో
చురుకు చురుకు సూరీడు
సిక్కోలు కొండల్లో సీమల బారు సూరీడు
గోదారి వరదలకు ఎదురీదే సూరీడు
తెగిపడ్డ శంభూకుని శిరస్సులాంటి సూరీడు
చూపుడు వేలుతో చూడసక్కని సూరీడు ॥ నల్ల నల్ల ॥

సందెకాడ సూరీడు
చందమామ సూరీడు
నీలిజెండ సూరీడు
నీలాల సూరీడు ॥ నల్ల నల్ల ॥

శూరుడమ్మ సూరీడు

సురకత్తుల సూరీడు

కన్నీళ్ళ సూరీడు

కాలజ్ఞాని సూరీడు ॥ నల్ల నల్ల ॥

దమ్మమే సద్దమ్మగా

పురివిప్పిన సూరీడు

శూరుడమ్మ సూరీడు

గెలుపు దారి సూరీడు ॥ నల్ల నల్ల ॥

## యాలరో ఈ మాదిగ బతుకు - గద్దర్

యాలరో ఈ మాదిగ బతుకు
మొత్తుకుంటె దొరకదురా మెతుకు
నీకు మొత్తుకుంటె దొరకదురా మెతుకు ||యాలరో||

మాలన్న మాదిగన్న
నీరుడన్న బేగరన్న
మేదరన్న మాతరన్న
లంబడన్న చెంచన్న
కులం కులం కులమంటూ
కుమిలిపోయే కూలన్న
గొంతు విప్పి పాడుతున్న
మనసువిప్పి వినరన్నా ||యాలరో||

బొందలు దవ్వేటి
బాగరక్కు మనది
సచ్చిన పసులు మోసే
మాదిగక్కు మనది
నీళ్లని కాపాడె
నీరుడక్కు మనది
రోతను సాఫు జేసే
మాతరక్కు మనది
బాంచెబతుకె మన బతుకని
మన బతుకుల మన్ను బోసి
బలిసిన దోపిడిదొంగలు
బాగ బలిసి పోతుంరు ||యాలరో||

బంగారు పంటలిచ్చె

భరత గడ్డ మనది
గంగమ్మ ప్రవహించే
పుణ్యభూమిరా మనది
గంగ యమున బ్రహ్మపుత్ర
కృష్ణ పెన్న కావేరీ
ఎన్నెన్నో జీవనదులు
ప్రవహించే జీవగడ్డ
మాల మాదిగన్నలకే
మంచి నీళ్ళు కరువాయే ||యాలరో||

శాస్త్రిగారు ఆవులకు
గరకదెచ్చి గడ్డిదెచ్చి
తిండిబెట్టి కుడితిబోసి
బుదగరిచ్చి పాలుబిండి
పాలుమీగడలు శాస్త్రులు
పసందుగా మింగుతుంటే
సల్లబొట్టు శాస్త్రులంటే
అంటయితది అడుగకనె ||యాలరో||

ప్రాణాలు బోవంగా
పునాదులూ తవ్వి
రక్తాలు కారంగా
రాళ్ల గోడ బెట్టి
కంటికి ఇంపైన
కర్ణపోని బంగ్ల గట్టి
ఇంట లగ్నమయితుంటే
ఇనామిస్తడని పోతే
కులం తక్వ ముండకొడుక
గడప దాటి రాకుమనే ||యాలరో||

మతం మార్చుకుంటెనేమొ

మనసు సల్లబడుతదాని

కష్టాలు బోతయని

క్రైస్తవ మతముల జేరితె

కమ్మ క్రైస్తు రెడ్డి క్రైస్తు

మాల క్రైస్తు మాదిగ క్రైస్తు

అంటరాని పిశాచమూ

యెంటబడుతున్నాది ||యాలరో||

మాలమాదిగల నడుమ

మంచినీళ్ల బాయి గొట్టి

మాలోల్ల గిరక దిక్కు

గజం లోతు ఎక్కువ దొవ్వి

మాలోల్ల గిరక దిక్కు

మాదిగోల్లు రావొద్దని

మనలో మనమిద్దరమే

తన్నుకోని సస్తుంటే

తాకులాట పెట్టి దొరలు

తమాష సూస్తున్నారు ||యాలరో||

సర్పంచ్ గ్రామపంచ్

సంతకాలు దీసుకొని

కర్ణము కనకయ్యకు

కోడిపుంజు కాలబెట్టి

గిర్దావర్ గానికి

గురదక్షిణ చెల్లించి

తాహ్సిల్దార్ సంతకముకు

తలపానం తోకకొచ్చె

ఎర్రగ బుర్రగ ఉన్నావు

మాదిగంటె నమ్మనండు

సర్టిఫికెట్ లేకుంటే
సీటురాదు సారంటే
నొసటిమీద మాదిగోల్ల
ముద్దరేసుకోమన్నడు ||యాలరో||

దొరవారి కొడుకులను
అరే అన్నందుకు
తెల్లని మల్లెమొగ్గ
చీర గట్టినందుకు
కోటేసును గాల్చింరు
కొండమ్మను చెరిచింరు
తప్పడు కొడుకులను దన్న
ఉప్పెన వలె ఉరికిరార ||యాలరో||

బెల్చిలో భూస్వాముల
కథ తెలుసా నీకు
దున్నేవానిదే భూమి అన్నందుకు
భూస్వాముల కాళ్లకాడ పడి ఉండానందుకు
భూస్వాములు ఏకమయ్యి
మీసాలు దువ్వుకుంటు
పట్టపగలే నీ వాళ్లను
కాళ్లు చేతులు గట్టి
మంటలల్ల కిసిరేసి
మజా జేసుకున్నరంట ||యాలరో||

టర్క్‌మన్ గేటుకాడి
తతంగమూ తెలుసా
గేటు చుట్టు గరీబోల్ల
గుడిసెలున్నయన్నా
చాపచింపులు లేని

చీపురోల్ల వాడలు

కూడుగుడ్డ లేని

కార్మికుల పాకలు

ఇది చూసి సంజయ్‌కి

ఇషి ఇషి అనిపించిందట

ఢిల్లి లాంటి నగరంలో

అల్లి బిల్లి గుడిసెలేల

బుల్డోజరు తీసుకొచ్చి

భూమట్టం చేసింరు

గుడిసెలు పీకెయ్యొద్దని

తిరగబడ్డ వాళ్లను

పిట్టలను గాల్చినట్టు

పట్టపగలె కాల్చికూల్చి

టాంక్ కింద పడదోసి

తార్ రోడ్డులేసింరట ||యాలరో||

ఇందిర కాంగిరేసు

హితం చేస్తదంట

జనతా నాయకులు

జయం చేస్తరంట

నిన్న మొన్న నేడు రేపు

నీ రక్తం దాగినోల్లు

కవల పిల్లలీల్లంతా

కలల కూడ మరిసిపోకు ||యాలరో||

భూమంత భూస్వాముల

వలల ఉందిరన్నా

వాళ్లను కూల్చేదాక

కులం పోదురన్నా

గనిలో బొగ్గుదవ్వే

గని మనిషివి నీవు

సమ్మెట బట్టినోడ

సమ్మె జేయరారా

కమ్మని బతుకుకొరకు

కత్తి నూరుకోరా

నీ చెమటినకని చేనుందా

నువు జెయ్యని చీజుందా

శ్రమజీవుల విముక్తికై

పిడికిలెత్తి బాస జెయ్ ॥యాలరో॥

# తాటకి - గోగు శ్యామల

సలికెపారను బుజం మీద పెట్టుకొని యిలాతికాయ మడుల ఒరాల పోంటి జవానులా తిరుగుతున్నది బాలమ్మ. రాళ్ళ కుచ్చెల మీది సేన్ల నానుకొని వంకర్లు తిరిగిన పిల్లకాలువ నిండ నీల్లు పారుకుంట బాలమ్మ సేన్లకు వస్తున్నయి. మీదున్న అన్నిసేన్ల మడులు అడ్డుకట్టలు కట్టడం వల్ల కాల్వనిండ నీల్లు పారుకుంట బాలమ్మ సేన్లకే ఒస్తున్నయి. పెద్ద పెద్ద ఇలాతికాయ మడులు జెల్ది జెల్ది పారుతున్నయి. పెద్దబందాలకు నీల్లు పెట్టే బాలమ్మకు నిండా పన్నెండేండ్లు నిండలేవు.

కర్ణపోల్ల జీతగాడు ఎగిల్లసే బిరబిరా నడిసొస్తున్నడు. అప్పటికే సేను మొత్తం పారి రొండు బందాలు మాత్రమే మిగిలి వున్నయి బాలమ్మవి. 'నీ అమ్మకాన ఎప్పుడు లేచివొచ్చినవురా చీకటి దయ్యమోలె సేనంత పారిచ్చినవురా' అన్నడు జీతగాడు.

' అయితే నీ మిగిలిన రెండు బందాలు ఎంటకేంచి పెడుదువు నీ కాలువ కట్టి నీల్లన్ని సేను మలుపుకుంటున్న' అని సలికెతో నీల్లు కట్టనీకె ఒంగిండు జీతగాడు. అంతే రుయ్యిన గాలి పడిగోలె ఉరికి అతను నీల్లకు కట్టిన అడ్డు కట్ట మీద దుంకి పస్స పస్స 'జరుగే ముసలోడ' అని ఎడమ మో సెయ్యితో దొబ్బితే వొరం మీద కూలబడ్డడు.

కర్ణపోల్ల చేన్లకు మల్లిన నీల్లకు అడ్డుకట్ట కట్టింది. 'నాయి ఇంక రెండు బందాలున్నయి జెర్రసేపట్ల అయిపోతయి అప్పటిదాక నీల్లజోలికి రాకు జెల్దిన పారిచ్చి సేనువోత అన్ని నీల్లు నీవే మలుపుకుందువు' అని ఎంటకు మర్లింది బాలమ్మ.

ఒరంమీద కూలవడ్డ జీతగాడు అట్లనే చూసుకుంట కూసున్నడు తప్ప ఏంచేసేటట్లున్నడు ఒట్టి గునుగుడు తప్ప. ' ఈ పోరి మనిషిని అషల్లాడనీయది కాలాడనీయది చేతాడనీయది. చేసుకున్నోనికి ఎట్ల బాలెం చేసి బోర్లవడ్డదో మొగ్గజల్ది' అని తిట్టి పోయవట్టిండు.

ఇంక ఏం చేయ్యలేక బీడీ అంటించుకోని సిన్నవోయి కూసున్నడు. మిగిలిన రెండు బందాలు పారి బాలమ్మ సేను అయిపోయింది.

కాలువ పెద్ద మలుపుకాడికొచ్చి కాల్లకు సలికెపారకు అంటిన బురదని కడుక్కొని 'తాతో' అని లాజిగ కూతేసింది. 'మా కాల్వ గట్టి నీల్లు మలుపుకోవే' అన్నది. 'శాన అర్లుగల తల్లివి నన్ను ఒరం మీద నూకేసి తాతో అని నోరార పిలుస్తున్నావు' అనుకుంట లేసి కర్ణం సేన్లకు నీల్లు మలిపిండు. కొన బందం పారబట్టింది. ఒక్క బందమన్న పారలేదు. కాల్వ నిండ పారాల్సిన నీల్లు సగం కూడా రాకొచ్చినయి. 'వార్నీ ఇదేకర్మమని' కుచ్చమీదిసేన్లోంక తలెత్తి చూసిండు జీతగాడు. ఇంకేంది అటొంకలున్న ఇటొంకలున్న సేంన్లల్ల నీల్లు పారబెట్టుకోనికె మంది రానేవొచ్చిండ్రు. వారి వారి సేను మలుపుల కాడ నీల్లను మలుపుకునేటాల్లకు కాల్వల నీల్లు పురాగ

తగ్గిపోయినయి. ‘ ఈ పొద్దు నా కాలం తీరింది దేవుడో’ అనుకున్నాడు జీతగాడు. ‘ముందే నీళ్లు వారిచ్చుకుందామని చలిల వట్టుకోనొచ్చిన. ఈ పోరి నాకన్నముందొచ్చి ఇంతసేపు నన్ను కూసోబెట్టింది అంతట్ల అవుతలి సేనోల్లు రానేవొచ్చిరి. ఈ పాటి నీళ్లతో సేను ఎప్పుడు పార్తది కర్మగాలి పటేలొచ్చిండంటే’ అని బుగులుతో బిక్కుబిక్కుమనవట్టిండు.

కాల్లు కడుగుడు అయినంక బాలమ్మ లంగను ఎగదోసిన గోసినిడిసి లంగను జాడిచ్చింది. పెద్దొరం మీదున్న యాపచెట్టుకాడికి పొయ్యి యాప పుల్లనిర్సుకోని పండ్లు తోముకుంట సేనవతలికి జతగాల్లకోసం పరిశీలించి చూసింది. చెరువు పక్కన మడుగుల్ల పెరిగిన ఆపుల కుచ్చల్ల కొంతమంది దూల్లమేపనీకి ఒచ్చిండ్రు. ఇంకొంతమంది చెరువు కట్టపొంటి ఇంకా వొస్తున్నరు. వాల్లను జూసి ‘పనగిల్లి దాండు ఆటను ఎవరితో ఆడొచ్చును, అచ్చన్నగిల్లలు ఇంకెవరితో ఆడొచ్చునూ అని సోచాయించుకున్నది’ బాలమ్మ. అచ్చన్నగిల్లలు ఆడనీకె మర్నాగి ఇంక రాలేదు. పనగిల్లిని ఆడనీకె మాత్రం నర్సడు ఎల్డు ఒచ్చిండ్రు. ‘నిన్న కొట్టిన పనగిల్లను ఉరికి గుత్తిపట్టనీకె సచ్చిండ్రు కొడుకులు ఈ పొద్దు అట్లనే వురికిస్తరాండ్రి’ అని మనుసుల అనుకున్నది.

గబ గబ పండ్లుతోమి మొఖం కడిగి నాలుగైదు ఇలాతిదంట్లను పీక్కోని తిని నీల్లు తాగింది. జతగాల్లకు అడ్డంబోయి ‘దూపకు రొట్టెకట్టుకొచ్చిండ్రా ఇంటికొస్తరా’ అడిగింది బాలమ్మ.

‘కట్టుకొచ్చినం’

‘గిల్లిదాండు ఆడుదామా’ అడిగింది.

‘నిన్న ఆడిన ఆటకు ఉరికి కిందవడి మోకాలు చెక్కలైంది. ఈ పొద్దు నాకురుకరాదు మీరే ఆడుకోండి’ అన్నడు ఎల్లడు.

‘ ఏది సూతం’ అన్నది.

‘కాలు అట్టుగట్టిందిరా నీల్లతో కడిగి జేరిపోతు పాలుబెడ్దాము చెర్లపోయి కడుక్కరాపో’ అన్నది. అన్నట్లే ఎల్లడు పొయ్యి కాల్లుకడుక్కొచ్చిండు.

చెర్ల అంచు జాగల నీల్లు ఎండిపోయి జేరిపోతు చెట్లు వనంలాగ మొలిసినయి. అందుట్ల లేత సెట్టుదగ్గర కూసోని కొనగోలుక కొట్టింది బాలమ్మ. ఎంటనే చెట్టులకేంచి బలబలా పసుపురంగు పాలు కారవట్టినయి. వాటిని సూపుడు వేలుకు అద్దుకొని ఎల్లని కాలుకు పెట్టింది. అట్లనే పగిలిన వాని పెదవులకు అంటించుకోమన్నది. ఇద్దరు గల్సి నర్సని దగ్గరికి పొయ్యండ్రు.

‘ ఎట్లుందిరా ఎల్లా మోకాలు నొప్పి’ అడిగిండు నర్సడు.

‘జెర్ర సల్లిడిసిందిరా’ అన్నడు ఎల్లడు.

‘అయితే నువ్విటొంకలు నిలబడు. గిల్లి నీల్లల్లవడకుండ సేను అటొంకల నిలవడి

గుత్తివడుత' అని ఎల్లన్ని చెరువొంక నిలబెట్టిండు. గుబ్బురుగా పెరిగిన మోతుకు పొదల దాసిపెట్టిన దాండుగిల్లిని తీసుకొని బాలమ్మ లంగను మోకాల్ల మీదికి ఎగజెక్కింది. భూమ్మీద దొడ్డుగీతను గీసింది. గీత మీద గిల్లిని ఉంచి ఆటంజూసి కొట్టనీకె సిద్ధమైంది. గిల్లి కొనను ఆటం జూడనీకె దాండుతో భూమ్మీద రెండు మూడు దెబ్బలు కొట్టింది. అదనుజూసి గిల్లి కొనను కొట్టి కొంతపైకి ఎగరనిచ్చింది. సరిగ్గా గిల్లి నడుమ ఓ పక్కకు పోయెటట్లు గుంజి కొట్టింది. అంత దూరమేం పోలేదుకాని నర్సడు గుత్తివట్టలేదు. కింద పడ్డగిల్లిని తీసుకుపోయి బాలమ్మకిచ్చిండు. బాలమ్మ దాన్ని రెండవసారి ఆటం జూసి గట్టిగ కొట్టింది. ఇప్పటి గిల్లి గాలిల తేలుకుంట ఎట్లపోయిందో ఇగ జూడాలె. దూరం పోయి ఓ గుబురు తునికి పొదల వడ్డది. ఈ దెబ్బకు పొదలున్న కుందేలు ఉరుకుడు సవారి తీసింది.

దాన్ని ఎల్లడు ముందుజూసిండు. 'కుందేలుర… కుందేలుర…' అని అరిసిండు. ముగ్గురు ఆయిలు బరుగులు తీసుకొని దానెంబడివడ్డరు. దానికర్మగాలి అది సెరువొంకల ఉరుకవట్టింది. ' అరే…. దాన్ని సెరువులకె పోనియండిరా. మిగితా పక్కలకు పోనియకుండి నీల్లలకు దర్మండి' అని చెప్పుకుంటూనే తలా ఒకొంక జోపవట్టిండ్రు. ఓ…ఓ…ఓ… ఊ…హూ….హూ ఊ…లబ లబలబలబ….. మని మొత్తుకున్నరు. ఎల్లడింక పాటనే ఎత్తుకున్నడు.
'అనంత గిరి సామి ఆటకెల్లినాడు.
యాడ ఉన్నదోయ్ కుందెలూ…' పాడిండు.

గట్టిగ పాడేటాల్లకు కుచ్చెలొంక మల్గిన కుందేలు యిలాతికాయ బందాలల్లకు మల్ల వోయింది.

అక్కడ అడ్డం నిలిచిన బాలమ్మ కట్టెతో జోపుకుంట తిరిగి పాట పాడింది.
'అనంత గిరిసామి ఆట కెల్లినాడు
గీడ ఉన్నదోయ్ కుందేలో…' పాడింది.

కుందేలు ఎక్కడ ఉరికినా లొల్లి పెట్టి దారి మల్లిచిండ్రు. ఎక్కడా పొయ్యే తొవ్వ లేక సెర్లకే ఉరికింది. నీల్లల్ల ఈదుకుంట పోవుడు మెదలుపెట్టింది. 'సచ్చిందిరా కుందేలు' అన్నది బాలమ్మ. 'యాడ సచ్చింది అది ఈదుకుంట అవతలి కట్టకు జేరుకుంటది.' అన్నడు ఎల్లడు. 'అంత దూరం ఈతకొట్టుకుంట పోయేటాల్లకు అది బతుకుతదా?' అన్నది బాలమ్మ. 'అది సస్తేమనకేం గద్దు సెరువునడిమీతల సచ్చి పీనుగైతె చాపలు కొట్క తింటయి' అన్నడు నర్సడు. 'అరే తిర్రోడా…. అది ఈత కొట్టుకుంట అవలి గట్టుకు చేరిందాక, అది దమ్ముకొచ్చి నడుమ సచ్చిందాక చూసుకుంట ఉంటార్రా? మనలో ఎవరమన్న ఒకరం ఈతకొట్టుకుంట పోయి దాన్ని పట్టుకొచ్చుడు కావాలిప్పుడు' అన్నది బాలమ్మ.

'ఎల్లా నీవు పోతవారా'? అడిగిండు నర్సడు.

'ఒద్దురా….. నాకాలు ఇప్పుడు గుంజి ఈతకొట్టనీయదన్నడు' ఎల్లడు.

'అబ్బోనడుమ సెరువు శాన లోతున్నది. అంత దూరం ఈతకొడితే దమ్ముకొస్త' అన్నడు నర్సడు.

ఇక లాభం లేదు అనుకున్న బాలమ్మ లంగను మీదికి మడిసి గోసి ఒసింది. సెర్లకు దూకింది.

కుందేలు పొయ్యేటొంకల ఈత కొట్టుకుంట దాన్ని ఎంబడించింది.

నీల్లల్ల చాపలెక్కనే కొట్టుకుంట పోయి జెర్రసేపట్ల కుందేలును అందుకున్నది.

దాని మెడమీదున్న ఒదాలు తోలును ముదిరి పట్టుకొన్నది.

ఒక చేత దాన్ని పైకి ఎత్తిపట్టుకున్నది. ఇంకోచేత్తో పొట్టకిందికి నీల్లను జరుపుకుంట ఒడ్డుకు జేరింది బాలమ్మ.

తడిసిన కుందేలును బాలమ్మ చేతులకేంచి తీసుకుని సెల్లబట్టతో తడి తూడ్సిండ్రు. దాన్ని పట్టుకొని బాలమ్మ ఇంటికి జేరింది.

తండ్రికి బజార్లనే మేల్తమయింది బిడ్డ కుందేలును పట్టుకొచ్చిందని. ఎంటకు పోయి పలానోన్ని తెచ్చుకున్నీకె కల్లు దుఖ్నంలకు పోయిండు.

ఇంటికి ఒక సందులకేంచి కుందేలుతో బాలమ్మ చేరింది. ఇంకోసందుల కేంచి తండ్రి కల్లుసీసతో జేరిండు.

బాలమ్మ తల్లి అనంతమ్మ తండ్రి బిడ్డల జూసి 'బిడ్డ కుందేలును వట్టుకొస్తదని నీకు కల వడెనా ఎకాకిన కల్లు సీస వట్టుకొనే ఒచ్చినవు' అని పరేశాన్ అయింది.

' ఇంటికాడున్న నాకు తెలువది. నీకెట్ల తెలిసెనాంట' అన్నది. ' ఎంతకైనా తండ్రి బిడ్డది ఒక్కమాట, ఒక్క సూట'న్నది అనంతమ్మ. 'దినం పచ్చిపులుసు పప్పశారు తిని సప్పిడి సప్పిడి అయింది. ఈపొద్దు కుందేలు కూర కమ్మగ ఒండె ఇంట్లందరం కడుపునిండ తిందమ'న్నడు బసయ్య.

వచ్చిన తోడేం నీల్లతోనే పారినకాడికి సేనును పారవెట్టుకుంట సేన్లనే నిలవడ్డడు కర్ణపోల్ల జీతగాడు. ముందుగాల బుగులు వట్టినట్టే దొర సేనికి వచ్చిండు.

దొరను జూసిన జీతగానికి గుండెల డకా మన్నది. సేన్లకు వస్తవస్తనే 'ఏమిరా ఇంక గీడనే ఉన్నవు. సస్కులనే వచ్చినవాలేదా. ఇంకా సేను సగం కూడా వారలేదు' అన్నడు.

'ముందుగాలనే...... వచ్చిన దొరా.....' అని తడపడా యించిండు జీతగాడు.

'నీకన్న ముందుగల ఎవడొచ్చిండురా?......' అనుకుంట మడిమీద కొచ్చి తడిసిన పెద్ద కాలువను చూసిండు దొర.

.

' ఆ........ ఈ కాలువ ఎట్ల తడిసిందిరా? ఎవడొచ్చిండురా...... బసడైతే ఊర్లనే ఉన్నడు మరి వాని సేను ఎట్ల వారిందిరా....' అని పరిశీలించి చూసిండు.

‘ ఆ.... ఔనురా..... అదేగదరా నీల్లు పారవెట్టింది. అదే తాటకి. ఉండు దాని పని పక్కా అయితది’. అన్నడు దొర.

జీతగాడు కండ్లు తేలేసిండు.

మూడుజాములు పొద్దుకు సుక్కపొడవకముందే నిద్రలేసిన అనంతమ్మ ఎంపెలుపొరక కట్టతో సటా సటా వాకిలూడుస్తున్నది. ఆసప్పుడుకేనేమో బసప్ప నిద్రనుండి తలుముకొని లేసి ‘సంగడు గిట్ట వచ్చినాడె’ అని అడిగిండు.

నిద్రకండ్లతోనే ఇంటిముందున్న యాపసెట్టు నుండి పండ్ల పుల్ల నిరిసిండు. తలా ఒపుల్లను పిల్లల కోసం ఇరిసి గూట్ల వెట్టిండు.

శేరి కాడి మూలల కాడినుండే ‘బసన్నో...’ అని కూతేసుకుంట సంగప్ప రానే వచ్చిండు.

‘మంది బైలెల్లిండ్రు నీవింకా పండ్లు తోముడుమీదనే ఉన్నావ్.’.... అన్నడు.

‘ ఇంకేమున్నదిరా ఇట్లనే తోముకుంటా వచ్చి తొవ్వ నడుమ గాజిపురం వాగుల మొఖం నోరు కడుక్కుంట నడువ్’ అన్నడు బసప్ప. అనంతమ్మ కట్టితెచ్చిన సద్దిమూటను రుమాలి కొంగుల కట్టుకున్నడు బసప్ప. మందిగుంపుల వడి ఒకరిని వట్టక ఒకరు నడుస్తున్నరు. నడుసుకుంటనే ఎవరి ముచ్చట్లల్లవారు మునిగిపోయిండ్రు.

‘అన్నా పండుగ దినం దగ్గరకురావట్టె పిల్లలకు కొత్తబట్టలు తెస్తున్నావె.’ అడిగిండు సంగప్ప. ‘నీవు కొత్తబట్టల కాడిక పోయినావురా? మా ఇంట్లకయితే తిన గాసమేలేదు. ఇంట్లున్న గాసం తినుకుంట పది దినాల నుండి ఇంటి సేన్ల కలుపు తీస్తిమి. పసిపిల్లలు కోల్లలాగ తినేటోల్లున్నరు.

ఇప్పుడు నాలుగు మానుకల జొన్నలు ఇరపై కిలల బియ్యంను కొనిపెట్టుకోవాలే. పండుగ నాడు కొత్త బట్ట లేసుకోకున్నా.... పిల్లలు మంది ముఖం జూడకుండ పండుగపూట ఏమైనా ఇంక తీననీకె చేసుకోవాల్నని నా ఎతువానం అంత గందిగే ఈ నాలుగు దినాల కూలికి ఇంక ఐదినాలు పనిజేసి సరి పెట్టుకోవాలె. మీ వదిన కూలికిందికొచ్చేవి ఇన్ని తోడయితయి.

‘బాలమ్మ అంటే సేనికి నీల్లువెట్టి నాకాసరయ్యేది అంత ఇంత కాదు. ఆమె నీల్లు పారవెట్టకపోతే సేనీపొద్దు ఈ కూలికొచ్చుడు కాకపోయ్యేది.’ అనుకుంటూనే వాగొచ్చింది మొఖాలు కడుకుందం నిలడుండి అనుకొని ఆగిండ్రు కూలి మొగోల్లంత.

‘మాయప్ప పోయేటపుడే ఎందుకు లేపలేదమ్మ. మన సేండ్ల సుట్టోల్లంతపోయి నీల్లు పారిచ్చుకుంటరు. మన సేనికి సరిపోవు ఎందుకులేపలేదని జగడం పెట్టుకుంటున్నట్లే లేసివచ్చింది బాలమ్మ. ‘ఇంకెవ్వరు పోలేదు కొడుకా వాల్లింక నిద్ర కూడా లేవలేదు. జెర్ర చీకటిపోయి ఎలుగు అయినంక పోదువులే’ అన్నది తల్లి.

‘అమ్మో సేనుతడివారాలే’ అని సెప్పులేసుకొని బయలెల్లింది బాలమ్మ. సల్లగ అనిపిస్తే కుంచిని బిర్రుగ సుట్టుకొని సిట సిట నడుస్తున్నది.

దారెంబడి ఎవరూలేరు ఊరుకు తూరుపున ఉన్న సేండ్లకు పొయ్యే తొవ్వన నడుసుకుంట పోతున్నది. ఇండ్లముంద ఆడోల్లు కసువూడుస్తున్నారు.

ఇంకొందరు మంచినీల్ల బాయికి నీల్లకోసం కుండలు పట్టుకొని పోతున్నారు. కోళ్ళు ఒక్కొక్కటి కొక్కోర....కో.... అంటున్నాయి.

'లేవు కొడుక పటేలు కోపమయితడు జెల్దిన దూల్లను కొట్టుక పోవాలె' అని తల్లులు జీతమున్న కొడుకులను బతిమిలాడుతున్నరు. ఇవన్ని వినుకుంట దాటుకుంట మాలమాదిగ వాడను ఊరును చీల్చిన కంతను దాటి ఊరుబయటికి పొయ్యే పానాది బాటవట్టింది. ఆ బాటెంబడి ఆడికీడికి ఎవ్వరూ కానరాలే మసక చీకటి ఇంకా వీడిపోలేదు. 'హమ్మో..... సిమ్మచీకటి ఎట్లా....' అనుకున్నది బాలమ్మ. 'మాయమ్మ సెప్పినట్లు ఎలుగైనంకనన్న రాకపోతిని అనుకున్నది. అయినా నాకేంభయం నన్ను అందరూ ధైర్యస్తురాలంటరు. నన్నెవరూ ఏం అనలేరు కాని చీకట్ల దయ్యాలుంటవంటరు. అయ్యోసై ఎట్ల' అనుకున్నది. ఇంక జెర్రసేపట్ల ఈ పానాది దాటి అవతల పడొచ్చు. అంతట్ల ఎలుగు కూడా వస్తది అనుకొని నడక వేగం పెంచింది. ఉరికినట్లనే నడిసి సేనికి జేరింది. పెద్దకాలువకు బాలమ్మ సేండ్లకు వస్తున్నాయి. ఇలాతి కాయ బందాలు దామారా నీల్లు మింగుతున్నయి.

ఎనుకటికి బసని తాత కర్ణం దగ్గర ఊడిగం చేసేటోడు. ఆనితరువాత ఆని కొడుకు జేసేటోడు.

దొరలంతా భూదానోద్యమం చేస్తున్నారంటే తిరుమలరావుదొర తాత వెంకటరావ్ ఆళ్లిల్లకెందుకు తనదగ్గర ఊడిగం చేసే గాయిదోడు ఈరిగానికిస్తే, భూమి కాయముంటది. గాయిదోడు సాగుజేస్తడా? మన్ను జేస్తడా? వాడికి జెయ్యనీకి సందేడుంటది? దున్ననీకె ఎడ్లులేవు. ఎవుసం సామాన్లు లేవు. అయినా గాయిదోనికి అంత దమ్ముంటదా? దొర భూమిల కాస్తుండనీకె ఎన్ని గుండెలు కావలె అనుకున్నడు.

ఇచ్చినట్టే ఇచ్చి మల్ల తీసుకోవచ్చు. భూదానం చేసిన పేరుంటది. సెక్కుజదరకుండ భూమి ఉంటది అనుకొని ఇచ్చిందంట.

అదే ఏడు సీలింగు చట్టమొచ్చింది. కర్మకాలి దొర సీలింగుల పోయింది. వెంకటరావ్ భూమి గాయిదోడైన ఈరిగానికి మూడెకురాల భూమి సీలింగుల పోయింది. ఆని పేరుమీద సర్కారు పట్టాకూడా ఇచ్చింది.

ఈరిగాని తరువాత సెంద్రడు ఆ భూమిని చేసిండు. సెంద్రని కొడుకే ఈ బసయ్య భూమి కాస్తులున్నడు.

ఈ తరాల సీలింగు కథను వెంకటరావు తన కొడుకు నారాయణరావుకు చెప్పుకున్నాడు. నారాయణరావు తన కొడుకు తిరుమలరావుకు చెప్పుకున్నాడు. ఈముగ్గురు ఎవరి పద్ధతిలో వారు భూమిని సొంతం చేసుకోచూసిండ్రు.

గాయిదోల్లు మూడు తరాల ముగ్గురు తమ భూమి చేజారిపోకుండా కాపాడుకున్నారు. ఈక్రమంలో వారి నెత్తులు పగిలినయి. కాల్లిరిగినయి. దొరలు అనేకమార్లు దొంగ దెబ్బలు తీసిడ్రు. అడ్డికి పావుషేరుకు భూమిని కాజెయ్యాలని చూసింద్రు. అది వశపడలేదు. ఈ తరాల భూమి కథ గురించే కర్ణం తిరుమలరావు తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఆలోచిస్తూనే ఉన్నాడు. ' ఏమయిందండి అలా ఉన్నరీరోజు' అడిగింది భార్య అలవేలుమంగ. ఆమెను ఓ సూపు జూసిండు తిరుమలరావు. ఆ సూపుతో లోపలికి పెళ్ళి ఆలోచనంతా బసన్నీ సేనొంకల రానీయకూడదని. మొత్తానికే బసడు సేనికి రాకూడదు అనుకున్నాడు. అందుకు ఏం జెయ్యాలి. బసన్నీ జంపితే అల్కకగానే సంగతి బయటికొస్తది. సంపుడు కాకుండా ఆడు సేనొదిలి, ఊరొదిలి పోవాలే. అందుకు నేనేం చెయ్యాలా అనుకున్నడు. ఏదో ఆలోచన వచ్చినట్లు కుర్చిల కేంచి దిగ్గున లేసి బయటకొచ్చిండు తిరుమల రావు. 'అరే నీవు ఎడ్లను కొట్టుకొని పెద్దబాయికాడ జామతోట కావలికాయ పోరా. ఈ రోజు పేరుసెనక్కాయకు నీల్లు వద్దులే.' అన్నడు జీతగానితో. 'అయితాయ దొరా అని' ఎడ్లను ఇడిసి ముందలేసుకొని పోయిండు జీతగాడు.

పగటాల్లకు రొట్టె సద్దిని ఇప్పకొని తిన్నది బాలమ్మ. ఇలాతికాయ సేనుకు నిమ్మలంగా నీల్లు పారవెడుతున్నది. ఆడాడా భూమి ఎత్తుగా ఉండి నీరు ఎక్కకుంటె సలికెపారతో దాన్ని సాపు జేస్తున్నది. ఈ పొద్దు సేనుకు నీల్లు పారవెట్టుడు పొతం పట్టియ్యాలే అనుకున్నది. జతగాల్లతో కూడా అడుకోలే. ఇంత కూనోసైనా కూనోలె. పని.... పనీ.... పని..... పనెర్రి.

మా బాలమ్మ లచ్చినం. పని లచ్చినం

.

'మాయప్ప బాలమ్మ అయి నాకడుపుల వుట్టిండని' తండ్రి మురిసెటోడు. తండ్రి అట్లా పొగడడం అంటే బాలమ్మ ఎంత పానమో. పొద్దుమూకేటాల్లకు సేను అయిపోగొట్టి ఇంటికి జేరాలే. ఇగ జుసుకో నన్ను మాయప్ప సెబ్బాస్ అంటడు అని మల్లి మనుసుల తలుసుకుంట నీల్లు పారవెడుతున్నది. బాలమ్మ ఇలాతికాయ సేను పక్క పోంటి పచ్చజొన్నసేను ఏపుగా పెరిగింది. సూడనీకె అది పచ్చజొన్న సేనులాగ లేదు. సెరుకు తోటమాదిరిగా ఉన్నది. ఎంతెత్తు మనుషులు నిలవడ్డా కనపడరు. అగో అందులో నుండి దొర జప్పమంటె వచ్చి బాలమ్మ సెయి వట్టుకొని గుంజుకపోతున్నడు. బాలమ్మకు ఎవరు ఎందుకు గుంజుకపోతున్నడు మొదట అంతువట్టలే. దొర మొఖం జూసిన తరువాత పక్కసేను కర్ణం దొర అని నిద్దతెలిసింది. ఇంకొ పక్క పరేశాన్ అయింది. దొరది ఎక్కవకులం. వాల్లు మాదిగోల్లను అంటుకొనరు. ముట్టకొనరు. ఇట్ల గుంజుతున్నడేంది. ఏం అర్థంకాక బాలమ్మ బిక్కమొఖం పెట్టింది.

అంట్లనే ' ఏమే తాటకి లంజ నీవు సిన్నపిల్లవాయే, ఏం పానం పోయిందని మొగోని లెక్క సేనుకి నీల్లు పారవెడుతున్నవే. మా ఇండ్లల్ల అయితే నీయంత ఆడిపిల్లలు నీలాగ సేనికి రారు. ఆడపిల్లల్లను ఇంట్ల ఉంచాలనే తెలివే మీ మాల

మాదిగోల్లకు లేదు. ఇంతకూ నీవు సిన్నపిల్లవేనాయే' అని తిట్టుకుంట జాకిటి లోపటికి చేతి పెడుతున్నడు. పసిపిల్ల చేతులు కోవ్వారి బలిష్టమైన దొర చేతులను తీసి పారేయలేక పోతున్నవి. దొర శరీరం ఇనుప స్తంబం లాగా అనిపించింది. వీపుల నుండి వనుకు పుట్టుకొస్తున్నది. నోటితడి ఆరిపోయింది. బల్లపేల్కలాగ మడుసుక పోతున్నది బాలమ్మ. ఇంకోపక్క ' ఆ పటేలు గాడు ఆ ఆడదాన్ని పట్టుకున్నడు. ఈ ఆడదాన్ని పట్టుకున్నడు' అని మాల మాదిగ కేరీల ఆడోళ్ళు గుసగుస లాడుకునంగా ఇన్నమాటలు యాదికొచ్చినాయి. ' ఈబాడుకావు ఏదో కంగాలు పని జెయ్యవోతున్నడని' బాలమ్మకు మేల్తమయింది. దొర గుంజుతూనే ఉన్నడు. బాలమ్మకు బుగులు కోపం తన్నుకొస్తున్నయి. కాని దొర చేతుల నుండి ఇడిపించుకోలేకపోతున్నది. ఏం జెయాల్నో అర్థం కాక భూమిమీద ఈరిగల వడ్డది. దొర భూమిపోంటి గుంజుతూనే ఉన్నడు. 'అసేయ్..... నిన్ను ఎడు గుంజుతరే నార జాగినట్టు సాగుతున్నవు.... నడువు..... లేసి నడువు. ఈరిగల వడితె ఇడిసిపెడుత అనుకున్నావా. నిన్ను ఎట్టం గుంజకపోయినట్ల గుంజకపోత' అన్నడు. ' ఓ..... దొర నన్ను ఇడువు. నీకాల్లుమొక్కుత ఓ..... యమ్మో...... అవ్వో.... అప్పో....' అని గట్టిగా వొర్లింది బాలమ్మ. 'నీవు పిలువంగనే వస్తరనుకున్నావె. వస్తే అల్లు బతుకుతరనుకున్నావా. బాగా నోరుజేస్తున్నవు. నీకు బాగా బలిసిందే. లేకపోతే మొగోల్లకన్నా ముందుపొయ్యి సేనుకు నీల్లు పారపెడుతవా' అని సెంపమీద ఈడ్సి కోటిండు దొర. బాలమ్మ అంతదూరం పోయి సుట్టుకొని పట్టది. దగ్గరకుపోయి మల్ల సేతి పట్టిగుంజనీకె వంగిండు దొర. రొండు కాల్లు లేపి ఆటంగా దొర పిచ్చల మీద తన్నింది బాలమ్మ. సస్తినే అని రొండు సేతులు ముందల పెట్టుకొని ఎంటకు వడ్డడు దొర. అక్కడి నుండి తరుముకొని దిగ్గున లేసి ఎంటకుమర్లి జూడకుండా ఉరికింది బాలమ్మ. ' ఆ.... తాటకి ముండ. ఆ తాటకి లంజ పారిపోతున్నది పట్టుకోండిరా.....' అని అడ్డం పడ్డడు దొర.

'మన బాలమణిని దొర పట్టుకోపోయిండంట. ఆన్నీ..... పిచ్చల మీద తన్నిందంట' అని కొంగులు మూతులకు పెట్టుకొని నగిండ్రు మాల మాదిగ ఆడోల్లు.

## సూర్యుడు తలెత్తాడు - ఆచార్య కొలకలూరి ఇనాక్

నేటి తెలుగుదేశంలో అదొక మారుమూల పల్లె. కుగ్రామం. రావడంటే మనిషికాదు, మర సూర్యుళ్ళా పొలంలో పొడిచి, ఇంట్లో కుంకుతుంటాడు. చేనుకి చెమటతో స్నానం చేయించి, నెత్తురుతో బొట్టు పెడుతుంటాడు. పంట చేను పసి పాపల ముత్తయిదుతే పైరును ఆస్తారుబస్తుంగా చూసుకొంటాడు.

రావడి ముఖం ఊరు చూళ్ళేదుం. పల్లెచూళ్ళేదు. పిల్లలు చూళ్ళేదు. పెళ్ళాం చూళ్ళేదు. సూర్యుడు చూళ్ళేదు, పొలం చూసింది.
వంగి పని చేయడం, తలవంచుకు నడవటం, ముఖం దాచుకుని నిద్రపోవడం అతడి రివాజు. రావడి మాట పొలం కూడా విన్లేదు. నిశ్శబ్దం అతడి దినచర్య, జీవిత చర్య.
గుండెగుహలో రాక్షసుడు దాచి పెట్టిన పసివాడి కేక ఒకటి వుంది. బైటికి వినిపించదు. నలుగురంటే రావడి గుండె కూడా చప్పుడు చేయదు.

రావడి కళ్ళలో నీళ్ళు లేవు. ఎరుపు లేదు. ఏడుపు రాదు. కోపం రాదు. రాయి ఎండకూ, చలికి వేడిగా చల్లగా కాదు. రాయి కూడా కాదు, దూది.
రావడి శరీరాన్ని పంచభూతాలు బతికుండా పంచుకుంటునాయి. ఏం పొరపాటు జరిగిందో ఎముకలు మిగిలాయి. మరేమయిందో అని కదులుతున్నాయి.

ఇంటికి వచ్చే సరికి పల్లెంతా గుబగుబలాడుతూ వుంది. సీత కల చచ్చిపోయింది ఉరిపోసుకుని. ఎవడో చేయి పట్టుకున్నాడనీ, చెప్పినా వినలేదని, జనం చెవులు కొరుక్కుంటున్నారు. రావడు భూమి బిడ్డ. ఆ ఎకరం పొలం అతడి యావదాస్తి.

కాళ్ళు కడుక్కుని కూటిక్కూచుంటే వచ్చి వడ్డించే కూతురు కూతురి కాళ్ళూ చేతులు కనబడలేదు. కూడురాలేదు. లేదు అన్న మాటన్నా వినబళ్ళేదు. రావడదేం పట్టించుకోలేదు. నిద్రపోయాడు.
పొయిలో పిల్లి లేవడం లేదు. గింజలున్నట్టే వుంది. పిల్లే ఉన్నట్టు లేదు.

లేచిపోయిందని, లేపుకు పోయాడని రెండు మాటలు. పిల్ల దొంగ సొత్తు కాలేదన్న నమ్మకం రావడికేముంది?
ఆ మాటలే వస్తే రావడికి ఏం నమ్మకాలున్నాయసలు?
కొండల్లో ఇళ్ళు కట్టారని, పొలాలు ఇస్తున్నారని చాలామంది పల్లెవాళ్ళు వెళ్ళిపోయారు. రావడు పోలేదు.

పొలం పోవడానికి బయలుదేరి ఇంటిముందు నెత్తురు మడుగులో పడివున్న కొడుకును చూశాడు. దెబ్బలు! గుండె ఆడుతూ వుంది, చావడు. మొండి ఘటం. గట్టి ప్రాణం.
జనం పోగయ్యారు, ఊళ్ళో వాళ్ళతో పెట్టుకోవద్దురా అంటే వింటాడా? ప్రాణాలకు తెచ్చుకున్నాడు. ఓపిక ఉన్న వాళ్ళు ఏడుస్తున్నారు. చేతనయినవాళ్ళు ఏమన్నాచేస్తున్నారు.

రావడు మాత్రం అక్కళ్ళేడు. సూర్యుడితో పాటు పొలంలో తిరుగుతున్నాడు.
ఇంట్లో దీపం కొండెక్కించి, కంట్లో దీపం ముసుగులో దాచి, కుక్కి మంచం కబుర్లు వింటున్నప్పుడు గాజుల చప్పుడు, మట్టెల మోత!
ఈ చప్పుడు తనకు తెలుసు. తనదే తన నెత్తురుదే! తన గుండెదే!
రావడు నిద్ర లేచాడు. సూర్యుడు అర్థరాత్రి బయటికి వచ్చాడు.
ఎదురుగా కూతురు! నిండు చూలాలు! కాళ్ళు పట్టుకొంది. తల నిమిరాడు.
ఆ రోజు ఉదయం సూర్యుడు ఇంట్లో ఉదయించాడు. రాత్రి పొలంలో అస్తమించాడు.

పల్లెకు పోయే సరికి ఇల్లు రవందాడిగా ఉంది. పసిగొంతు ఏడుపు. ఆడగోల, మగ పిల్లాడు తల్లి పోయింది.
రావడు మనవణ్ణి చూశాడు. కూతుర్ని చూశాడు. మనవణ్ణీ కూతుర్నీ చూశాడు. ఉదయం అస్తమయం చూశాడు.

మనవణ్ణి పెంచటమన్న మహా యజ్ఞంలో పసివాణ్ణి బలిపశువును చేస్తున్నాడు రావడు.
'ఈడు జచ్చిందాకా నువ్వొచ్చేట్టు లేవంటూ' పక్కింటి గొడ్రాలు మనవణ్ణి మారెమ్మ ఎత్తుకు పోయినట్లు ఎత్తుకుపోయింది.
అవు, కొట్లు, పొడుపు, చంపు అనే అరుపులు దూరంనించి వినిపించాయి. కర్రలు, కట్టెలు, బొంగులు పుచ్చుకున్న మనుషులు పొలాలకడ్డంపడి వస్తున్నారు.

పందిని చంపుతున్నారు కాబోలుననుకొన్నాడు రావడు. రొప్పుతూ రోస్తూ నురుగులు కక్కుతూ కొడుకు పరిగెత్తుకొస్తున్నాడు. ఏటుకందలేదు పొలం వచ్చాడు తండ్రిని చూశాడు. కాళ్ళమీద పడ్డాడు.
పడ్డవాడు లేవలేదు. కర్రలు లేవనివ్వలేదు.
ఏటుమీద ఏటు రావడానికీ నాలుగు తగిలాయి.
అది మనిషి ఆకారం కాదని మట్టి ముద్దనీ రుజువు అయిందాకా కర్రలు ఆగలేదు.
ఆపైన మనుషులు ఆగలేదు. కాళ్ళు కదిలాయి కొడుకు వళ్ళంతా నెత్తురు. రావడి బట్టలమీద నెత్తురు. సూర్యుడి చేతుల్నిండా నెత్తురు.
రావడి కళ్ళలో పాచీన గంగ, పాతాళ గంగ బుడబుడలాడినట్లు అయింది. చెమ్మ! తడిసొన, వాన! కుండపోత! కన్నీరు! నెత్తురు! నెత్తుటి కన్నీరు! కన్నీటి నెత్తురు! చిత్రం! రావడి కళ్ళల్లో నీళ్ళు.

తీరుబడిగా గోయి తవ్వాడు. తీరికగా కొడుకును పడుకోబెట్టాడు. ముఖం తుడిచాడు మట్టిపేశాడు పూడ్చాడు.
ఈ శవం మంచి ఎరువు. పొలం బాగా పండుతుంది, ఊరు తింటుంది పీనిగకూడు.
చాలా రోజులు సూర్యుడు పొలంలోనే పుట్టాడు. అక్కడే చచ్చాడు. పల్లె వల్లకాడుగా, ఇల్లు శవం పెట్టెగా వుంది.
రావడు పొలంలో పాక వేసుకొన్నాడు. మూడు బొంగులు, మోపుగడ్డి.
ముంతా, మూకుడు, చట్టి, పిడత, కుండ, సామాన్లు, నరాల్లో చలి, వణుకు, ఎముకల్లో నిప్పు, మంట, రావడి జబ్బులు.
కర్మసాక్షి నడినెత్తిమీద కబుర్లు చెబుతుంటే చింతయ్య వచ్చి చావు కబురు చల్లగా చెప్పాడు, "ఈ పొలం నాది"

"ఎట్టా?" అనాల్సింది రావడు, అన్లేదు.
"ఏందీ?" అంటూ చూడాల్సింది, చూళ్ళేదు.
మౌనం.
ఎప్పుడో తీసుకొన్న అప్పు వంద రూపాయలు, వేలు దాటింది. వేలు ముద్రలు దాటింది. కోర్టుకు పోయింది. స్టాంపుకు ప్రాణం వచ్చింది. నడిచి పొలంలోకి వచ్చింది.
నిలబళ్ళేక పోయాడు. కూలబడ్డాడు. కూర్చోలేకపోయాడు. వాలిపోయాడు. నేలను వాటేసుకున్నాడు. బిడ్డల్ని, బంధువుల్ని, తల్లిని, తండ్రిని వాటేసుకున్నట్టు పొలాన్ని కౌగిలించుకున్నాడు.

నోట్లో దుమ్ము. చింతయ్య వాణ్ణి పొలలోంచి అవతలకి ఈడ్చాడు. తన వొంట్లో వున్న నెత్తురూ చెమటా పీల్చుకొన్న పొలం కాలు కదపకుండా కూర్చుంది. కొడుకును పొట్టన పెట్టుకుని నోరెత్తకుండా వుంది. కర్మసాక్షి మాత్రం వీపు చరుస్తున్నాడు.
రావడు పుట్టడమే తలక్రిందులుగా పుట్టాడు. పెరగడం తలవంచుకుని పెరిగాడు, వయస్సు పైబడ్డ కొద్దీ తల నేలకు దగ్గరయింది. ఇప్పుడు నేల పాలయింది.
నమ్ముకొన్నందుకు వళ్ళంతా నోరంతా బురద రాసి నేల కనికరించింది.
మెల్లగా కూర్చుని, మోకాళ్ళమీద చేతులు పెట్టుకుని, నడుం పట్టుకొని, వెన్నెముక రాసుకుని రావడు నిలబడ్డాడు.
వంగి చేసే పని లేక రావడు, నిలబడ్డాడు.
నిలబడుతుంటే వెన్నెముక కరకరలాడింది. పెటపెటలాడింది, మూలిగింది, అరిసింది.

వంగిపోయిన తల లేవటానికి మొండికేసింది. బిగిసింది, పట్టింది, మెల్లగా సడలింది, తిరిగింది, తలను నిలబడనిచ్చింది.
కళ్ళు పూర్తిగా విప్పాడు, ఎదురుగా చూశాడు. కళ్ళు బైర్లు కమ్మాయి, చొట్టూ చూశాడు. గబగబా చూశాడు అన్ని దిక్కులు చూశాడు.
ఎంత సంతోషం. నేల, నింగి, దిగంతాలు భూమి ఎంత అందమయిందీ, ఎంత విశాలమయిందీ. ఈ భూమ్మీద తాను పుట్టాడు, పెరిగాడు, ఎంత అదృష్టం.

పిల్చిన గాలి - గుండె బంధువు - ఎంత హాయిగా వుంది!
నడిచాడు. అడుగు వేస్తే కాలికెంత బలం ఎంత ఆనందం ఇంతకాలం తాను కోల్పోయిందేమిటో రావడికి తెలియడం మొదలయింది.
తన పొలం వైపు చూశాడు వళ్ళు స్వాధీనం తప్పతూ వుంది. పల్లెలో పేరుకు ఇల్లుంది.
వారం పాటు సూర్యుడు రాత్రి, పగలూ ఆ యిల్లు వదల్లేదు. ఈ వారం రావడి కంటి మీద కునుకు లేదు.
ఆరోజు ఉదయం రావడు ఊరుచెరువు గట్టుమీద పుట్టాడు. పుట్టీ పుట్టక ముందే సూర్యుడు ఊరు చెరువులో పడి తనుకులాడుతున్నాడు. ఎవడీ సూర్యుణ్ణి కాపాడేది?
ఉదయం కాంతిలో చెరువుమీంచి రావడు ఊరంతా పరికించాడు. వింత - కొత్తగా కనిపించింది. చిత్రం - అసహ్యం పుట్టింది. విచిత్రం - కసి
చీకటి పడింది. జేబులో అగ్గిపెట్టె చేతికి తగిలింది. గలగల లాడింది. తీసి గీశాడు. ఆ వెలుతురులో రావడి ముఖం కనబడింది. ఇది మునుపటిది కాదు.
కుంకిన సూర్యుడు రావడి ముఖంలో అర్ధరాత్రి పుట్టాడు. ఎర్రగా మంటగా జ్వాలగా ముఖం. సూర్యుడు మండిపోతున్నాడు.
అగ్గిపెట్టెగట్టిగా పట్టుకొని రావడు గావుకేకపెట్టాడు. చెరువు ప్రతిధ్వనించింది. మాట్ వినబళ్ళేదు. చిత్రం. రావడు మాట్లాడుతున్నాడు.
చెరువుగట్టు దిగి ఊళ్ళోకి పోతూ అరిచాడు.
"ఈ బతుకు లిట్టా తగలబడ్డానికి ఈల్లేదు. ఈ బతుకులిట్టా తగలబడ్డానికి ఈల్లేదు. ఈ బతుకులిట్టా తగలబడ్డానికి ఈల్లేదు."

## ప్రముఖ దళిత కవి మద్దూరి నగేష్‌బాబు తో ఇంటర్వ్యూ - ఖాజా




దళిత సాహిత్య ఉద్యమానికి వెన్నుగర్ర నగేష్ బాబు. వచన కవిత్వం కేవలం కొంతమంది చదువుకున్న మేధావుల కోసమే కాదు. వాడ వాకిట్లో నిల్చున్న కోట్లమంది చదువులేని వారికి, సామాన్య జనానిక్కూడా అని చెప్పి – వాళ్ళకు అర్థమయ్యేలా, వాడ యాసనూ, భాషనూ, నుడికారాన్నీ, లాజిక్ నీ తెచ్చి కవిత్వంగా మలిచాడు నగేష్ బాబు.

నగేష్ బాబు రాయటం మొదలు పెట్టాక వచన కవిత్వం సామాన్యులు చదువుకునే లేదా ఎవరైనా చదివితే విని ఆనందించే కథా కావ్యమైంది. జనరంజకమైంది. మేలుకొలుపు గీతమైంది.

రాయడాన్ని వృత్తిగా మార్చుకున్న నాగేష్ బాబు జనవరి 10,2005 న విశ్రాంతి ప్రకటించాడు. అంబేద్కర్ తో మొదలైన దళిత ఉద్యమ రథాన్ని మరికొంత ముందుకు నడిపి బాధ్యతలను గుర్తుచేసి నిష్క్రమించాడు.

నగేష్ బాబు రాసిన వెలివాడ, రచ్చబండ, మీరేవుట్లో, లోయ, నరలోక ప్రార్థన గ్రంథాలు దళిత సాహిత్యానికీ, ఉద్యమానికీ కూడా కొత్త చూపునీ వూపునీ ఇచ్చాయి. ఒక దృష్టికోణాన్ని, సాహిత్య దృక్పథాన్నీ, తాత్వికతనూ అందించాయి.

దళిత ధిక్కార కవిత్వం – నిశాని, దళిత సహానుభూతి కవిత్వం, కాస్త సిగ్గుపడడాం, సంకర కవిత్వం – ఊరూ-వాడ, అంబేద్కరిస్టు ప్రేమకవిత్వం – విడి ఆకాశం. ఇవ్వన్నీ నగేష్ బాబు క్రియేటివ్ ఆలోచనలకు నిదర్శనాలు.

ప్రశ్న: దళిత ఉద్యమం ముక్కలైపోయిందని దళిత ఉద్యమం పసైపోయిందని చాలా మంది అంటున్నారు మీరేవంటారు?

జ: చాలా మంది అంటే ఎవరు? వివరించు.

ప్రశ్న: అగ్రకులాలవాళ్లు ముఖ్యంగా ఇంతకుముందు కవిత్వంరాసి దళిత కవిత్వం వచ్చాక ఆగిపోయినవాళ్ళు.

జ: క్లియర్‌గా చెప్పాలంటే అగ్రకులాల వాళ్లు అని బేసిగ్‌గా అగ్రకులాల వాళ్ల డ్రీమ్ అది. కానీ అది నిజం కాదు. దళిత ఉద్యమం రోజు రోజుకి బలోపేతం అవుతుంది. ఉదాహరణకి కవితాత్మకంగా చెప్పాలంటే అనేక నదులొచ్చి బంగాళాఖాతంలో కలవడం అనేది నిన్నటి నిజమైతే బంగాళాఖాతమే నదులు నదులుగా విస్తరిస్తూ పోవడం అనేది నిజం. మేమందరం కలిసున్నాం అనే నిజంకాని ఒక అవాస్తవిక భ్రమలో ఇన్నాళ్లూ చాలా ఉద్యమాలు కలిసున్నట్లు నటించాయి. దళిత ఉద్యమం తెచ్చిన గొప్ప మార్పేంటంటే పోరాడాల్సిన అంశాలు వేరుగా వుండి అనవసరంగా కలిసి ఉండి పోరాటాన్ని వాయిదా వేసుకోవటం కన్నా ఎవరి ప్రత్యేకమైన అంశం కోసం వారు విడిపోయి పోరాటం చేయటం అనేది దళిత ఉద్యమం తచ్చిన గొప్ప వాంఛనీయమైన మార్పు. అంటే 'విడిపోవట' మంటే టోటల్‌గా ఉద్యమం నించి విడిపోవటం కాదు. దళిత ఉద్యమం అనేది అనేక కులాల కలయిక కాబట్టి ప్రతీ కులానికీ తనదైన సమస్య ఉంటుంది. తనదైన సమస్యని పరిష్కరించుకోటానికి ఏ కులానికాకులం పోరాడుతుంటది. తతిమ్మా దళిత కులాలు ఆ పోరాటానికి మద్దతు తెలియజేస్తా వుంటాయి. టోటల్‌గా కుల నిర్మూలన అనే క్రమంలోనే ఇయన్నీ జరుగుతూ ఉంటాయి. ఉదా: మాదిగ హక్కుల దండోరా అలాగే తుడుందెబ్బ ఇట్ల ప్రతి కుల ఉద్యమం కూడా - టోటల్‌గా మళ్లీ అన్నిటి ధ్యేయం కుల నిర్మూలనే అంటే ఇప్పుడు దళిత ఉద్యమం అనేది అనేక రూపాల్లో విస్తరించిందని చెప్పకోవాలిగానీ దాని పనైపోయిందనుకోవడం అవివేకం అని నేననుకుంటున్నా.

ప్రశ్న: అంటే దళిత ఉద్యమం ఎప్పటికీ ఉండాలనీ మీరు అనుకుంటున్నారా? దీనికి లక్ష్యం అంటూ ఏమన్నా వుందా?

జ: ఇది పెద్ద పనికి మాలిన ప్రశ్న. దళిత ఉద్యమం ఎప్పటికీ ఉండాలని ఎవరైనా కోరుకున్నారంటే వాడు అజ్ఞానిగా నేను భావిస్తా. అవమానాన్ని అవహేళనని తట్టుకోలేక ఆక్రోశం, ఆగ్రహం బద్ధలై చిమ్మిన లావా దళిత ఉద్యమం. కులం వల్ల దళిత ఉద్యమం వచ్చింది. కులం ఎంత తొందరగా నిర్మూలించబడితే దళిత ఉద్యమం అంత తొందరగా నశించిపోద్ది. తొందరగా దళిత ఉద్యమం నశించిపోవాలని అగ్రకుల కవులకంటే నేనే ఎక్కువగా కోరుకుంటునా అంతేగానీ దళిత ఉద్యమం ఎప్పటికీ ఉండాలి, దళిత కవులుగా ఎప్పటికీ మేం జ్ఞానపీఠ్ అవార్డులు కొట్టుకోవాలని అనుకోవట్లేదు. ఉదాహరణకి ఈ దేశం బేసిగ్‌గా దళితులది. ఈ దళితుల దేశం దళితుల పరమయ్యేంత వరకూ దళిత ఉద్యమం ఉంటుంది. అంటే దళితుడు తన రాజ్యాన్ని తను ఏలుకునేవరకన్నమాట. దానికి ఇప్పడే పునాదులు ఏర్పడ్డాయ్. నాకో పెద్ద ఆశ ఉంది. నేను బతికుండాగా దళిత ఉద్యమం సఫలమైద్దని. దీనికి ప్రోలాంగ్డ్ ఉద్యమాలు చెయ్యాల్సిన పనిలేదు. అంబేడ్కర్ ఆశయాన్ని తీసుకుని ఈనాడు జరిగే ఉద్యమాలు సఫలమవుతాయని నా నమ్మకం.

ప్రశ్న: ఎస్.సి. రిజర్వేషన్ విభజన మీద మీ అభిప్రాయం ఏంటి?

జ: ముందుగా నేను మాల కులస్తుణ్ని. రిజర్వేషన్ విభజన కోరుతుంది మాదిగలు. రిజర్వేషన్ విభజన తప్పనిసరిగా జరగాలి. అయితే ఇప్పుడు జరుగుతున్న ఒక దుర్మార్గమైన పరిస్థితి ఏంటంటే ఎవరో విసిరిన ఎంగిలి రొట్టె కోసం ఈ రోజున కొట్టుకోవటం దూషించుకోవటం చివరికి మీరా సాబ్ లాంటి తమ్ముళ్లని చంపుకునే దుస్థితి ఏర్పడింది. చాలా అన్యాయం. ఇది అగ్రకులతత్త్వం తప్పితే ఇది దళితతత్వం కాదు. ఈదేశంలో ఎనభై ఐదు శాతం మంది దళిత బహుజనులున్నారు. ఈ ఎనభై ఐదు శాతం మందికి 15 శాతం మంది 50% రిజర్వేషన్ ఇచ్చి, మీరు దాంట్లో కొట్టుకోండి మిగితాది మేం ఏలుకుంటాం అని అంటం జరుగుతుంది. ఇప్పటికైనా దళితులందరు కలిసి రిజర్వేషన్ విభజన అనేది అటు నుంచి నరుక్కురావాలి. అంటే 15శాతం వున్న అగ్ర కులస్తులకు 15శాతం రిజర్వేషన్ ఇచ్చి ... 85శాతం దళితులకి బహుజనులకి మధ్య పంచాలి. అప్పడు 7శాతమే కాదు మాదిగలకి అవసరమైతే 15% ఇరవైశాతం కూడా ఇవ్వాల్సి ఉంటుంది. ఎందుకంటే విద్యకీ ఉద్యోగాలకీ బాగా వెనకబడిపోయి వున్నారు. వీళ్లని అప్‌లిఫ్ట్ చేయటానికే రిజర్వేషన్లు ఉన్నది. ఇవేం అగ్రకులస్తుల సొంత ఆస్తులు కావు. అలా అగ్రకులస్తులకే మనం రిజర్వేషన్ ఇవ్వాలి. ఎందుకంటే ఈదేశం మనది. ఎప్పుడో సింధూలోయ నాగరికత ఆర్యుల దండయాత్ర నాడు కొందరు అగ్రకులస్తులు ఈ దేశంలో ప్రవేశించారు. పాపం వాళ్లనికూడా ఈదేశంలో ఉండనిద్దాం.

ప్రశ్న: 15% ఎస్.సి. రిజర్వేషన్ జనాభా ప్రాతిపదికన విభజించాలని ప్రభుత్వం చెప్పిందికదా. అది 15%కే ఎందుకు అన్వయించాలి?
జ: అదే నేను చెప్పింది. అసలు ఓపెన్ కాంపిటీషన్ వద్దు. ఏకులానికాకులం జనాభాను లెక్కగట్టి కులానికింత శాతం చొప్పన 100% ఉద్యోగాలను విభజిస్తే కింది కులాలకి మేలు జరుగుతుంది. ఓపెన్ అనేది యూజ్‌లెస్ థింగ్.

ప్రశ్న: మరి మాదిగలతో కలిసి కాకుండా ఒక బ్రాహ్మణితో కలిసి ఊరూవాడ రాయటాన్ని దళితుల్లోనే కొందరు వ్యతిరేకిస్తున్నారు. దీనికి మీరేం సమాధానం చెప్తారు?
జ: మాదిగల్తో నేను కలిసి రాయాల్సిన అవసరం లేదు. అగ్రకులాలను కుంటున్నట్లు మాల మాదిగలేం విడిపోలేదు. అభిప్రాయ బేధాల్లోవున్నారంతే. అభిప్రాయ బేధానికి విడిపోవటానికీ చాలా తేడా ఉంది. మాల మాదిగలు ఒకే కుదుట్లోంచి పుట్టిన రెండు బెట్లలాంటి వాళ్లు. ఇద్దరూ అన్నాదమ్ముల్లాంటి వాళ్లు. విడిపోరు. ఇద్దరిదీ ధ్యేయం ఒకటే కుల నిర్మూలన. ఉదాహరణకి మాదిగ హక్కుల దండోరా రిజర్వేషన్ విభజన తన ప్రత్యేక సమస్యగా పోరాడుతూనే మళ్లీ కుల నిర్మూలన కోసం పోరాడుతుంది. అంతేగాని ఇది విడిపోవటం కాదు. కులనిర్మూలన ఉద్యమంలో భాగంగా అంబేడ్కర్ సంకర పడమన్నడు. ఊరూ వాడని సంకర కవిత అన్నాం. అంటే రక్త సమ్మిశ్రితం వల్లనే కులనిర్మూలన జరిగిద్ది. నాతోటి దళితుడితో నేను కలిసి రాస్తే తనేం

చెబుతాడు. నేను చెప్పేదే చెపుతాడు. కానీ అగ్రకుల కవేం చెపుతాడు తను రిపర్ట్ అవుతాడు. నేను వాళ్లని వాడలోకి లాగుతున్నా వాడ జీవితాన్ని వాళ్లకి చూపిస్తున్నా ఇదంతా నీవల్ల, నీ కుట్ర వల్ల జరిగిందని చెప్తున్నా అతను రిపర్ట్ అయి దళితీకరణకు సిద్ధమైతండు. అంటే అగ్రకులాల వాళ్లు దళితీకరించబడటం కోసమే ఇది రాసాం. అంతే తప్ప బ్రాహ్మలు నాకేదో జందెం వేస్తారని, నన్ను ఉద్ధరిస్తారని నేను వాళ్లతో కల్సి రాయలేదు.

ప్రశ్న: మీకు కోపం ఎక్కువని, మీరు విమర్శని తట్టుకోలేరని, మీకు విమర్శకులపట్ల సదభిప్రాయం లేదని చాలా మంది అంటున్నారు. మీ అభిప్రాయం?
జ: కోపం ఎక్కువంటే? మనిషికి ఇంత శాతం కోపం ఉండాలని ఏ సైన్స్ అయినా నిర్ణయిస్తుందా? కోపం, సంతోషం లాంటివన్నీ మానవ లక్షణాలు. అంతేగానీ ఎక్కువేంటి, ఏసమయంలో కోపం వొచ్చింది అనేది ముఖ్యంగా ప్రాథమికంగా నేను ధిక్కార కవిని. ఉన్న అన్ని విలువల్ని ధిక్కరిస్తూ వచ్చిందే దళిత కవిత్వం. ధిక్కార అనేది లేకుండా ఎవరైనా రాసారంటే అది దళిత కవిత్వం కాదు, లలిత కవిత్వం అవుద్ది. అందుకే కోపం, ధిక్కారం దళిత కవిత్వానికి ప్రాణం అని నేను అనుకుంటున్నా. ఉదా: తెరేష్‌బాబున్నాడు, తెరేష్‌బాబు కవిత్వంలో చాలా వ్యంగ్యంగా మాట్లాడ్తాడు. అది కోపం, అన్నమాట వ్యంగం కాదు. చాలా మందిని మనం వెక్కిరిస్తాం, వెక్కిరించటం కూడా కోపంలో భాగమే. దళిత కవిత్వంలో ప్రతి కవీ వ్యక్తం చేసేది కోపమే కాకపోతే వ్యక్తీకరణే రకరకాలుగా ఉంటుంది. ఇక విమర్శకులంటారా మనకి ఇప్పటి వరకూ వచ్చిన విమర్శ పట్లగానీ, విమర్శకుల పట్లగానీ నాకైతే నిజంగానే సదభిప్రాయం లేదు. వాళ్లకి కవిత్వం బొత్తిగా తెలియదు. నాకు నచ్చిన విమర్శకుడైవరానా ఉన్నరంటే అది ఒక లక్ష్మీనరసయ్యే.

ప్రశ్న: ఎందుకు మిమ్మల్ని పొగిడిండనా?
జ: లక్ష్మీనరసయ్య నన్ను పొగడటమేంది తిట్టాడుగా, వెలివాడని సమీక్షిస్తూ నామీద శివారెడ్డి ఇన్‌ఫ్లూయిన్స్ ఉందని చెప్పాడు. నిజానికది నాకు నచ్చని ఆరోపణ. అయినా విమర్శకుడిగా నాకు అతనంటే గౌరవం. అయినా నేనతన్ని పర్సనల్‌గా కలిసి అడిగా కూడా, అయితే మిగతా విమర్శకుల్ని నేను విమర్శకులని అనుకోలేను ఫెయిల్యూర్ పోయెట్స్. ఎక్సెప్ట్ లక్ష్మీనరసయ్య మన తెలుగు విమర్శకులంతా ఫెయిల్యూర్ పోయెట్స్ వాళ్లకి కవిత్వం రాయటం చేతకాక కవిత్వ విమర్శనే ఉద్యోగంలోకి దిగారు. ఉదా: ఇటీవలి సమీక్షకులు కుర్రోళ్లు, వాళ్లకి విమర్శించు నాలెడ్జి ఉండదు, చదవరు. విమర్శకుడు అనగా విమర్శించు వోడు అని మాత్రం వాళ్లకి తెలుసు అంతే, పుస్తకాల్లో వాళ్లకి ప్లస్ పాయింట్స్ కనపడవు, అన్నీ నెగెటివ్ పాయింట్సే కనపడతాయి. కవికి సామాజిక నిబద్ధత ఎంత అవసరమో విమర్శకుడికీ అంతే అవసరం. అలాగే కవి పఠనం ఎంత అవసరమో విమర్శకుడికి అంతకు రెట్టింపు పఠనం అవసరం.

ప్రశ్న: దళిత కవిత్వం భూసమస్యని పట్టించుకోలేదని...
జ: దళిత ఉద్యమమే భూమి సమస్యతో ముడిపడి ఉంది, దళితులకి భూమి అంటే కేవలం కొలతల కందే నేలమాత్రమే కాదని, భూమిలో ముడిపడివున్న అనేక కోణాల్ని కూడా దళిత కవులు ప్రధానంగా తీసుకు రాస్తున్నారు. మద్దూరు దళిత స్త్రీలు పోరాడింది భూమి కోసమే, అలాగే నేను రాసిన దేవుడిమాన్యం కవితైతే నా సహ దళిత కవులు రాసిన ఎన్నో కవితలైతేనేం... భూమికీ, ఆర్థికానికీ, కులనిర్మూలనకీ వీటన్నింటికీ అంతర్గతంగా వున్న లింక్‌ని గ్రహించి రాసిన కవితలే. సంస్కృతం మాత్రమే చదివే వేదపండితులకి దళిత కవిత్వం బోధపడటం కొంచెం కష్టం కదా!

ప్రశ్న: అంబేడ్కరిజం ఈ వ్యవస్థని మార్చేలేందంటున్నారు కదా!
జ: ఈ దేశంలో ప్రగతికిగానీ, విప్లవానికీ గానీ, అన్నింటికీ కులమే అడ్డంకి. ముందా కులాన్ని నిర్మూలిస్తే తప్ప ఇక్కడ సమానత్వం, సమసమాజం సాధ్యంకాదనే అంబేడ్కర్ ఆలోచన. ముఖ్యంగా ఇక్కడ కులనిర్మూలన జరిగితే విప్లవాన్ని వ్యాపారంగా చేసుకునే చాలామంది బజార్న పడతారు. అందుకే ఈ ప్రేలాపనలు వీళ్లకి రాజ్యం అంటే కేవలం పోలీసులే తప్ప దళితుల్ని చట్టబద్ధంగా ఉరితీసే రాజ్యం గురించి అవగాహన
లేదు. అలాగే సామ్రాజ్యవాదం అంటే అమెరికా, మల్టీఛానళ్లు, రొయ్యలు తప్ప దళిత ఉద్యమాలకు కూడా అగ్రకుల నాయకత్వం ఉండాలనే మనువాద సామ్రాజ్యవాదం గురించి తెలియదా!

ప్రశ్న: దళితవాదం విప్లవ అడ్డంకేనా?
జ: ఖచ్చితంగా అడ్డంకే! రొమేంటిగ్గా సంచులు తగిలించుకు తిరిగే వాళ్లకీ, కీర్తి పతాకాలెగరేసుకోవటానికి దొడ్డి దారిగా విప్లవాన్ని వాడుకునే వాళ్లకి, దాన్నొక నోస్టాల్జియాగా ఫీలయ్యేవాళ్లకి ఈ దళితవాదం పరమ అడ్డంకే! విప్లవాన్ని ప్రజల కోసం చేసేవాళ్లు, నిజమైన పోరాట వాదులకు మాత్రం దళిత వాదం చాలా పాజిటివ్. అసలు నాకు తెలియకడుగుతాను ఈ నిజం మాట్లాడితే ఈ దేశపు అగ్రకులాల వాళ్లకి విప్లవానికి అసలు సంబంధమే లేదు, దాన్ని చేయాల్సింది దళితులే! మా విప్లవం గురించి వీళ్లకెందుకండీ... ప్రగతివాదులుగా వున్నవాళ్లు ప్రతిభవాదులై పోకూడదు కదా! మా ఉద్యమాలు ఎలా చేసుకుంటామో! ఎలా విజయవంతం అవుతాయో మాకు బాగా తెలుసు.

కొన్నాళ్ళకు గొట్టం కోటయ్య మరణించాడు. కోటయ్య జీవించి ఉన్నప్పుడే కొమరయ్యకు పెండ్లి చేశాడు. తల్లి అన్నమ్మ అనుభవాన్ని ఊతగా తీసుకొని కొమరయ్య వ్యవసాయం పొదుపుగా సాగిస్తున్నాడు. కొమరయ్యకు ఒక కొడుకుకూడా పుట్టాడు. తండ్రి పేరే పెట్టుకున్నాడు కొడుకుకు. ఒకసారి కంఠీరవం కోటయ్యను యెత్తుకొని ముద్దులాడ్తు. "కొమరయ్యా! కోటయ్య పేరేమీ బాగులేదు. 'ముద్దులకోట' అని పెట్టు" అన్నాడు. అన్నమ్మ సంతోషంతో ఉప్పొంగిపోయింది. కోడలు కనకమ్మ క్షణంపాటు కొడుకును చూచి, ఒక చిరునవ్వు విసిరింది.

కొమరయ్య కొడుకును చిటికెలతో పిలిచి "టర్" అన్నాడు. కోటయ్య బోసినోరును విప్పి కండ్లన్ని మూతలు పడంగ కడుపునిండా నవ్వాడు. ఎత్తుకొమ్మన్నట్లు తండ్రివైపు చేతులు చాపాడు. కొమరయ్య కొడుకును కంఠీరవం నుండి తీసికొని తనివితీరా ముద్దులు కురిపించి "నాకోట, నా బంగారుకోట, పెట్టనికోట, ముద్దుల కోట." అంటూ రెండు చేతులతో పైకి ఎత్తి "టర్" అన్నాడు. ఇంతలో సేతుసింధీవచ్చి "దొర రమ్మంటున్నాడు" అని కొమరయ్యతో అన్నాడు. " ఆ కండ్లు, ముక్కు, అంతా కోటయ్యే!" ఆ ఇంట్లో వారంతా అనుభవిస్తున్న ఆనందంతో తానుకూడా పాల్గొన్నాడు సేతుసిందీ.

"ఎందుకు? ఏం పనంటావు?" అని కొమరయ్య కొడుకును తల్లికి అందించి బయలుదేరి సేతుసింధీతో వెళ్ళాడు.

రామభూపాల్‌రావు పడకకుర్చీలో కూర్చొని పొగచుట్టను పొతం చేసుకుంటున్నాడు. కొమరయ్య వెళ్ళగానే "తోటబావి భూమి నేను ఇంకోండ్లకు కౌలుకు ఇవ్వాలనుకుంటున్నాను. రబ్బీపైర్లు అయిపోయిన తర్వాత నువ్వు పునాసకోసం భూమి పొతం చేయవద్దు" అన్నాడు.

"కౌలుకిస్తారా? ఎవరికండీ? అసలు కౌలు కివ్వడమంటే నాకేం తోచటంలేదు" దిగులుగా అన్నాడు కొమరయ్య.

"అవును! కౌలుకిస్తాను. ఎప్పటికి నీవే శాశ్వతమా? నీ సొంత భూమి కాదుగా! ఎప్పటికి నీవే ఉండటానికి?"

"ఏందో! అంత గందరగోళంగా మాట్లాడుతున్నరు."

"గందరగోళమేం లేదు. అసలా భూమి మీది కాదు. మీ అయ్య కౌలుకు తీసుకున్నాడు. అదన్నా తెలుసుగద?"

“ఆ మాత్రం తెలుసులే. కాని ఆ భూమి ఎవరో బామ్మనోళ్ళ దట గదుండీ?''

“మరి నేనన్న దేంటి? అందుకే ఆ భూమి మీది కాదంటున్నాను.''

“మరి ఆ బామ్మనాయనతోటే మేము మాట్లాడుకుంటాం.''

“ఆ బ్రాహ్మడికి కౌలు కట్టినవా ఎప్పుడైనా?''

'' ఆరి జాడ జవాబే లేకపాయె. ఎవరికి కట్టు?''

'' ఉ! కౌలు తీసికొనేవాడు లేడుకాబట్టి భూమి నీదంటావు? అంతేనా? సరేపో. తర్వాత మాట్లాడుకుందాం'' రామభూపాల్‌రావు తీవ్రంగా ఆలోచిస్తూ కుర్చీలోంచి లేచి ఇంట్లోకి వెళ్ళాడు. కొమరయ్య అయోమయ స్థితిలో అక్కడి నుండి బయలుదేరి కంఠీరవం ఇంటిదోవ బట్టాడు.

కంఠీరవం తండ్రి కూడా మరణించి చాలాకాలమైంది. మరణదశ రోజుల్లో పెద్దకొడుకు వెంకటాచారి ఇంట్లో లేడు. రఘునాథాచార్యులు భార్య ఆండాళమ్మను, కంఠీరవాన్ని పిలుచుకొని కన్నీరు తీశాడు. దీనంగా భార్యవైపు చూచాడు. ఆండాళమ్మ లోలోన కుమిలిపోతున్నది. రఘునాథాచార్యులు కంఠీరవం చేతిని గట్టిగా పట్టుకున్నాడు. దు:ఖాన్ని దిగమింగుతూ గద్గదస్వరంతో మనోబాధను వెళ్ళకక్కాడు. “నాయనా! మన కుటుంబ స్థాయికి, నీ ఆలోచనలకు పొంతనలేదు. ఏమవుతావో కొడుక; నా గౌరవం కాపాడుతావుకదు కొడుక? అన్నయ్యకు నీకు దేంట్లోను పడిరాదు. నేనా! ఎట్లా పుట్టానో అట్లాగే పోతున్నాను. నావి ఎప్పుడూ వట్టిచేతులే. కాని ఒకమాట కొడుక! నేలవిడిచి సాముచేయకు! ఆవేదనను మాత్రం చంపుకోకు. ఈమాటలే నీకు నేనిచ్చే ఆస్తి'' అని పలికిన మాటలు కంఠీరవాన్ని ఎల్లప్పుడూ కలిచివేస్తుంటాయి. ఆ మాటలు జ్ఞాపకమురాగానే దిగ్భ్రాంతుడై దిక్కులు పరికించిచూస్తాడు. ఎవరో పిలుస్తున్నట్లు నలువైపుల చూస్తాడు.

కొమరయ్య రామభూపాల్‌రావు ఇంటికి వెళ్ళగానే కంఠీరవం కొమరయ్య ఇంటి నుండి బయలుదేరి తన ఇంటికి వెళ్ళాడు. కొమరయ్య ఇంటి వాతావరణం, వాండ్ల కుటుంబం, వ్యవసాయం, కొడుకుతో ఆటలు, వాండ్లు పొందుతున్న ఆనందాన్ని తలుచుకుంటూ ఇల్లు చేరుకున్నాడు. ఇంటికి వచ్చేవరకు తల్లి ఏడుస్తూ ఓ మూలకు కూర్చొని వుంది. అన్న వెంకటాచార్యులు తల్లిని దుర్భాషలాడు తున్నాడు. ఆండాళమ్మ నెత్తి ముడి ఊడి, వెండ్రుకలు చెల్లాచెదురై ఉన్నవి. ఆండాళమ్మను కొట్టడం తిట్టడం వెంకటాచారికి మామూలై పోయింది. ఆరోజున తిరిగి జరిగిందని కంఠీరవం గ్రహించాడు.

కంఠీరవం తన ఇంట్లో ఆ దృశ్యాన్ని చూడలేకపోయాడు. “దేన్ని చూచుకొని ఈ

మాత్సర్యం?'' వెంకటాచార్యులపై కండ్ల నురిమించి అన్నాడు.

‘‘పెద్దవాడు, అన్నయ్యను అట్లా అనగూడదు నాయనా!'' ఆండాళమ్మ బలవంతంగా దు:ఖాన్ని చంపుకొని అన్నది.

‘‘పెత్తనము ఇట్లా ఉంటుందా? పెత్తనము రక్షించుకునేవాడే పెద్దవాడనిపించుకుంటాడు. సాగిందల్లా పెత్తనమనిపించుకోదు.'' కంఠీరవం గొంతు చించుకొని అన్నాడు.

ఆండాళమ్మ అక్కడినుండి లేచి వంటింట్లోకి వెళ్ళింది.

‘‘నా పెత్తనానికి అర్థాలుతీసే ధైర్యంకూడా కలిగింది నీకు. నోరెత్తావంటే చీల్చేస్తా'' వెంకటాచారి ఉగ్రుడై అన్నాడు.

‘‘అది, అసలు నీ పెత్తనం తల్లిపై చేయిచేసుకునే నీవు, తమ్ముడిని చీల్చేస్తే ఆశ్చర్యం ఏం లేదు''

‘‘మాట మాటకి అమ్మని వెనకేసుకొని వస్తావు! ఏమిటి నీ ప్రయోజకత్వం? పెట్టి సాధ్తున్నావా? కష్టపడి సంపాదిస్తున్నావా? రండగా బ్రతుకుతున్న నీకే అంత నీల్గుడుంటే నేను నీకు భయపడ్తాననుకున్నావా? ఈ ఇంటికి నేను పెద్దను. మంచికి, చెడ్డకు నేను బా«ధ్యుణ్ణి. నాకెవరు అడ్డం వచ్చినా నే నూరుకోను. ఇంకా నోరెత్తావంటే వీపు పగులుతుంది. ఏమనుకొంటున్నావో'' వెంకటాచారి కొట్టేంత కోపంతో అన్నాడు.

‘‘వీపు పగులగొట్టి? ఆ తర్వాత? ఇంకేం చేస్తావు? వెళ్ళగొట్టవు?''

‘‘సిగ్గు, లజ్జ అనేవి ఉంటే ఇంకా అనాల్నా?''

కంఠీరవం గిరుక్కున ఇల్లు వదిలి బయటపడ్డాడు.

‘‘పో! ఎక్కడికి పోతావో, పో! ఈ బెదరింపులు నా దగ్గరనా? ఒక్క గవ్వ ఆదలేకున్నా సెత్తిన కూర్చునేవారే. అప్రయోజకపు ముండాకొడుక, మళ్ళా ఇంట్లో కాలుపెట్టావంటే చూడు'' అని వెంకటాచారి మంచం దబాలున వేసుకొని, తత్తరపడ్తు కూర్చున్నాడు.

ఆండాళమ్మ ఆవేదనతో '' ఎటుపాయె? ఎక్కడికి పోతడు?'' అంటూ ఇంటి బయటికివెళ్ళి నాలుగు వైపుల సందులు పరికించింది. కంఠీరవం కనబడలేదు. '' ఎంత మొండిపుట్టుక నాది, ఇవ్వన్ని చూడటానికే ఆ పరమాత్ముడు నన్ను బ్రతికిస్తున్నాడు. పోయినవాండ్లే మహారాజులు'' అనుకుంటూ, వెంకటాచారిని భయంతో చూస్తూ తిరిగి వంటింట్లోకి వెళ్లింది.

వెంకటాచారి తానొక ఘనకార్యం చేసినంత సంతృప్తితో, తమ్మునిపై వచ్చిన కోపాన్ని చల్లార్చుకుంటున్నాడు.

“దొర మిమ్ముల రమ్మంటున్నాడు.'' అని ఆడబాప రంగడు నిలుచున్నాడు.

'' ఎవరు నాయనా! ఎందుకు?'' అండాలమ్మ వడిగా వంటింట్లోంచి బయటికి వచ్చి అడిగింది.

వెంకటాచారి ఇల్లు వదిలి వచ్చిన వానితో వెళ్ళిపోయాడు.

ఆండాళమ్మ పసిపిల్లవలె కుమిలి కుమిలి ఏడ్వసాగింది.

5

కంఠీరవం పట్టలేని, భరింపరాని అవమానముతో చెరువు కట్టమీద నుండి పోతున్నాడు. ఎక్కడికి పోతున్నాడో, ఎవరి దగ్గరికి పోతున్నాడో, ఏమి చేయనున్నాడో, అతనికే తెలియదు. సుమారు ఒకటిన్నర మైలు పోయినాక ఒక చేనులో దోవ పక్కనే ఉన్న పాత గుడిలో ప్రవేశించాడు. కాళ్ళు బారవేశాడు. ముఖంనిండా పైపంచె కప్పుకున్నాడు. ఆలోచనలో లీనమయ్యాడు. సరిగా రెండు జాములవేళ. ఆకలితో కడుపు దహించుక పోతున్నది. ఆవేదనతో హృదయం తల్లడిల్లుతున్నది. అతనికి, అన్నకు జరిగిన వాదన మెదడులో మారు మోగుతున్నది. తల్లిని అన్న కొట్టే దృశ్యాలు జ్ఞాపకం రాసాగాయి. “అమ్మా'' అని బావురుమంటూ ఏడ్చాడు.

మంచె కింద నీడన అన్నంతింటున్న చేను కాపరులు ఆ ఏడ్పువిని ఆశ్చర్యపడి, మెల్లగా వెతుక్కుంటూ, ఆ గుడి ముందరికి వచ్చి చకితులై చూశారు. వాండ్లకు ఎటూతోచలేదు. వాండ్లలో వాండ్లు ఏవో గొణుగ మొదలు పెట్టారు. కంఠీరవం ఏడుస్తూనే ఆ అలికిడిని కనిపెట్టి, ముఖం మీద బట్టతీసాడు. ఎదురుగా నిలుచున్న పిల్లలను చూచాడు. తిరిగి ఇంకా బావురమని ఏడ్చాడు.

ఆ పిల్లల్లో ఒకడు. “అయ్యగారి తమ్ముడురా!'' అన్నాడు.

'' ఇక్కడెందు కేడుస్తున్నడో?'' ఇంకొక డన్నాడు.

“కడుపు నొప్పి లేస్తున్నదేమో.'' మరొక డన్నాడు.

'' ఏడ్వవద్దని చెప్పరాదురా?'' ఒకడు ఇంకొడికి సలహా చెప్పాడు.

'' ఆకలి అవుతుండొచ్చు, నెత్తిమీదికి పొద్దొచ్చింది. మొఖాన బొట్టులేదు.''

‘నేనుపోయి ఇన్ని దోసకాయలు, పెసరకాయ కంకులుతెస్తా. దారా పోదాం'' అని ఒకడు ఇద్దరిని వెంటబెట్టుకొని వెళ్ళాడు.

కంఠీరవం వాండ్ల మాటలను, వాండ్ల అమాయకపు చూపులను శ్రద్ధగా గమనిస్తూ దు:ఖాన్ని అదుపులోకి తెచ్చుకున్నాడు. ఆ పిల్లలకు అడ్డంగా అప్పుడప్పుడు సజ్జకర్రలు ఊగుతుంటే, వాటికున్న కంకులు తమ ఆహారంగా అర్పిస్తున్నట్టనిపించింది. ఆ కర్రల

మమతను కంఠీరవం ఆనందంతో అనుభవించాడు.

" ఈ చేను మీదేనా?" బొంగురుపోయిన గొంతుతో కంఠీరవం ఆ పిల్లలను ప్రశ్నించాడు.

" అవును మాదే. ఎందుకు? కంకులు కావాలా" పట్టరాని ఆనందంతో అని ఒక పిల్లవాడు ఇతర పిల్లవాండ్లను వికసించిన ముఖంతో చూచాడు.

"మనోళ్ళు ఎప్పుడొస్తారో? మనం తెంపుదాం" అని ఇద్దరు పిల్లలు కంకులు తెంపసాగారు.

" ఇట్టి అమృత హృదయాలుగల పిల్లలు పుట్టిన ఈ గ్రామంలో నా అన్నవంటి వాండ్లెట్లాపుట్టారో!" కంఠీరవం హృదయం కొట్టుకున్నది.

మొదట కంకులకై వెళ్ళిన పిల్లలు వచ్చారు. వెంట కట్టెపుల్లలు తెచ్చారు. వాండ్లలో అందరికంటె పెద్దవాడైన కనకయ్య తన నడుముకు చుట్టి ఉన్న జకముకి సంచి తీసి నిప్పుకొట్టి ఆ పుల్లలకు అంటించి మంటపెట్టాడు. కొందరు కంకులు కాలుస్తున్నారు. కొందరు దోస పిందెలచెక్కు తీస్తున్నారు. కొందరు పెసరకాయలు ఒలుస్తున్నారు.

కంఠీరవం పిచ్చివానివలె ఆ పిల్లల ఆరాటానికి, ఆప్యాయతకు ముగ్ధుడై ఆలోచిస్తున్నాడు. వీరెవరు? నే నెవరు? వీరికి నాకు ఏమిటి సంబంధం? నా ఆకలికి వీరి మనసు లెందుకు చలించాయి? నా ఏడుపు వీరి నెందుకింత కలవర పరచింది? అడుగనిదే ఏమిటి వీరి పరిచర్య, స్నేహభావము, ప్రేమ, మన్నన? ఎవరు నేర్పారు వీరి కివన్నీ? మంచి నేర్చుకోనవసరం లేదోమో! నేర్చుకోవలసినవి చెడ్డ విషయాలే కాబోలు! కంఠీరవం హృదయంలో తుఫాను రేగింది.

ఒక పిల్లవాడు దోసకాయలను ఎనిమిది భాగాలుగా కోసీ కంఠీరవం ముందర పెట్టాడు.

కంఠీరవానికి తల్లి జ్ఞాపకం వచ్చింది. ఏ విధంగాను సంబంధంలేని ఆ పిల్లలు ఆ విధంగా ఆత్మీయులై ఆదుకొని తహతహలాడ్తున్నారు. ఇక కన్నతల్లి తనకై ఎంత కుమిలిపోతున్నదో అని ఖేదపడ్డాడు. అతనికై విలపిస్తున్న తల్లిని అన్న ఎన్ని దుర్భాషలాడుతున్నాడో, ఇంటిలో ఎంత గంద్రగోళం జరుగుతున్నదో అని ఆలోచనలో పడ్డాడు.

రెండు దోసపిందెలు తిని చాలు నన్నాడు కంఠీరవం. కాల్చిన సజ్జలను పిల్లలు అందించారు. "మన మంతా కలసి తిందాం" అంటూ కంఠీరవం అందరి మధ్యలో కూర్చున్నాడు.

" ఇక ఏడ్వవు కద?" ఒక పిల్లవాడు అమాయకంగా అడిగాడు.

" ఏడ్వను" అని ఆ పిల్లవాని వీపు నిమిరాడు కంఠీరవం.

“నాకింకో సహాయం చేయాలె మీరు'' అని కంఠీరవం ఇంకా ఏదో చెప్పబోతుండగనే “ఓ'' అని పిల్లలంతా అన్నారు.

“మీలో ఎవరైనా పెళ్ళి గొట్టం కొమరయ్యను యిక్కడికి తీస్కరావాలె. నేనిక్కడే ఉన్న సంగతి మావాండ్లకు, మీవాండ్లకు ఎవరికి తెలియవద్దు'' కంఠీరవం దీనంగా అన్నాడు.

“నేను పెళ్తా, నేను పెళ్తా'' అని ఒకరికొకరు పోటీ పడ్డారు. కనకయ్య ముగ్గురు పిల్లలను పంపాడు.

'' ఒరే! నీ గురిగి కడిగి అయ్యగారికి మంచినీళ్ళు తేనా?'' ఒక పిల్లవాడు అన్నాడు.

“మనం తెస్తే అయ్యగారు తాగుతాడురా!'' కనకయ్య వెంటనే అందుకొని, కంఠీరవాన్ని చూశాడు.

'' అరె! ఎందుకు తాగను?'' కంఠీరవం పరధ్యానంలో అన్నాడు.

“నిజంగా తాగుతవా?'' ఒక పిల్లవాడు గట్టిగా అడిగాడు.

కంఠీరవానికి ఆ పిల్లవాడు అంటున్నది అప్పుడు తెలిసింది. వాండ్లు తెస్తే త్రాగడానికి అతనికి మనస్కరించక పోయినా, ఆ విషయం వాండ్లతో చెప్పడం బాగుండ దనుకున్నాడు.

“మీరు తేవడ మెందుకు? మనమే పోదాం. దగ్గరేనా కాలువ?'' అంటూ కంఠీరవం లేచాడు. పిల్లలుకూడా లేచారు.

“మరి నేను ఒలిచిన పెసరగింజలు మరి?'' ఒక పిల్లవాడు ముఖం మాడ్చుకొని అడిగాడు.

“మంచినీళ్ళు తాగి మంచెమీద కూచొని తిందాం'' కంఠీరవం సమాధానం చెప్పాడు.

అంతా మంచినీళ్ళు తాగి మంచె మీదికి చేరుకున్నారు.

కంఠీరవం దిగాలుపడి తనగ్రామం వైపు చూస్తూ మంచె పై నిలుచున్నాడు.

“పుట్టి పెరిగిన గ్రామాన్ని విడిచి, నేను ఎల్లప్పటికి దూరం కావల్సిందే? నాకు, అన్నయ్యకు మధ్య ఏర్పడిన అగాధ మిట్లనే ఉంటుందా! మాకోసం మా అమ్మ యీ విధంగా ఎన్నాళ్ళు కృశించుతుండాలె? నాకు ఆదుకొనే దిక్కేలేదా? ఈ అన్యాయాలను అన్యాయాలుగా అనేవాడు, అడ్డుకొనేవాడే లేడా? అయితే ఈ విధంగా చూస్తూ ఊరుకోవడమేనా?'' కంఠీరవం హృదయం కొట్టుకొన్నది.

పక్కన నిలుచున్న కనకయ్య నాలుగు వైపుల చూసి, '' ఎవరోయ్'' అని కేకపేశాడు.

కంఠీరవం తడబడుతు లేచి నిలుచున్నాడు. నాలుగు వైపుల చూచి '' ఎవరు? ఎక్కడ? ఏరి?

ఎవరూలేరే? కొమరయ్య వస్తున్నాడేమో'' అన్నాడు.

కనకయ్య ఒకవైపు చూపుతూ '' అగో! అటు చూడు. తెలతెల్లగా కనపడుతున్నరు. వీండ్లకోసమే మేము చేలలో కావలుండేది. వీండ్లతో ఏగలేం, కంకుల కాల మొచ్చిందంటే'' అన్నాడు.

'' ఎవరు వాండ్లు?'' కంఠీరవం అడిగాడు.

'' ఎవరో దిక్కులేని వాండ్లు, వాండ్లకిదేపని. సమయం కనిపెట్టి ఎవరి చేలనో జొరబడి అయినన్ని కంకులో, కాయలో తెంపుతరు. వాటితో ఆ రోజు గడిచిపోతది. పుట్టగతిలేనోండ్లు. ఇట్లా పదిమంది చేలోపడితే ఏచేనూ ఆగదు. మిగిలేది చొప్ప'' అంటూ కనకయ్య మంచె దిగబోయి, తిరిగి ఒక కేక వేశాడు. పరీక్షగా చేనువైపు చూచాడు.

చేనులోనుండి యిద్దరు వ్యక్తులు బాటకు చేరి చేతులు పైకి లేపి ఏమి తెంపలేదన్నట్లు చేతులు తిప్పారు. ముందుకు నడిచి పోయారు.

''దొంగ ముండా కొడుకులు. చూచి కేక పెట్టకపోతే యాభై కంకుల కట్టయిన కట్టుకపోదురు. కనిపెట్టి కేకపెడ్తే, కంకులు తెంపలేదని బుద్ధిమంతులోలె వెళ్ళిపోతున్నారు'' అన్నాడు కనకయ్య.

అతిశ్రద్ధగా కనకయ్య మాటలు వింటున్న కంఠీరవం ''అయితే నాకు పెట్టిన కంకులు, దోసకాయలు, పెసరకాయవల్ల మీకు నష్టమే నంటావా?'' అన్నాడు.

''అట్లనుకుంటే ఎట్ల? మేం మాత్రం అప్పుడప్పుడు కంకులు అవో ఇవో తింటూనే ఉంటం. కష్టాల్లో ఉన్న నీకు పెడ్తే మంచిదేగా, పైగా మీరు పెద్దలు. మీ కెంత పెడ్తే మా కంత పుణ్యముంటది. పని పాటలేక, జీతం నాతం లేక బతికే యీ అలగాజనంతోటి వస్తుంది కష్టం. అసలు పని లేకుండా ఎట్లా బతుకుతరో, నాకేం తోచదు. ఎండకాలంలో మాకు చేను పనులు లేకుండోర్కె మాకెక్కడ తోచదు. ఏదన్న పని మొదలు పెట్టుకుంటం'' ఈ విధంగా కనకయ్య చెప్తున్న విషయాలు కంఠీరవం హృదయంలో నాటుకపోతున్నాయి. ఎవరో ఉపదేశం చేస్తున్నట్టనిపించింది. కనకయ్య మాటలకు వ్యాఖ్యానంగాని, అర్థం కాని చెప్పనవసరం లేకుండాసే మానవ ప్రవృత్తిని, సహజ భావాలను ప్రతిబింబింప చేస్తున్నాయని కంఠీరవం భావించాడు. కాని తన కులంవాండ్లను కనకయ్యే అన్న మాటల్లో సోమరులుగా తలవక పోవడం కనకయ్య ఆలోచనా లోపమని కంఠీరవం అనుకున్నాడు.

''అయితే మేము పనిచేయక బ్రతికినా ఫర్వాలేదంటావా?''

''మీ కెట్లైనా రోజులు గడుస్తయి.''

"బిచ్చ మెత్తుకొని వెళ్ళ తీసినను మంచిదంటావా?"

"అది బిచ్చ మెందుకైతది?"

"అది నేను బిచ్చమంటా. గౌరవ మర్యాద లేని బ్రతుకంటా. నోమరితనమంటా."

"మీరనేది నిజమైతే అది తప్పే" అంటూ కనకయ్య లేచి నిల్చొన్నాడు. ఒళ్ళు విరుచుకొని, చేను నాలుగు దిక్కులు చూచాడు. అరచేయి కండ్లకు కప్పగా చేసికొని ఒకవైపు శ్రద్ధగా చూచి, "కొమరయ్య వస్తున్నట్టుంది" అన్నాడు.

కంఠీరవం ఆతురతతో లేచి నిలుచున్నాడు. " ఏడి? నిజంగానా? ఎక్కడినుండి వస్తున్నాడని" కనకయ్య పక్కకు నిలుచుండి కనకయ్య చూస్తున్న వైపు చూచాడు.

కంఠీరవం కొమరయ్యను రాసైతే రమ్మనాడు కాని ఎందుకు పిలిపించింది, ఏమి అడగాల్సింది ఆలోచించనేలేదు.

కొమరయ్య దగ్గరికి వస్తున్న కొద్దీ కంఠీరవం దు:ఖం ఉబికి రాసాగింది. తన హృదయావేదనను విని అతని దు:ఖంలో, ఆవేదనలో, అభిప్రాయాల్లో భాగస్వామియై మానసిక భారాన్ని కొమరయ్య తీర్చగలడని అప్పుడు కంఠీరవానికి ఆశ కలిగింది.

కొమరయ్య, అతనికై వెళ్ళిన పిల్లలతో సహా సమీపానికి రాగానే కంఠీరవం వడిగా మంచెదిగాడు. తల్లి లేనప్పుడు పరాయిపిల్లలతో దెబ్బలు తిన్న చిన్న పిల్లవాడు కన్నతల్లి రాగానే పైనబడి ఏడ్చినట్టు, కంఠీరవం కొమరయ్యను అమాంతంగా కౌగిలించుకొని ఏడ్చాడు. కొమరయ్యకు ఏమీ అర్థం కాలేదు. అంతగా కుమిలిపోవడానికి కారణం కూడా తెలియదు. పిల్లలు పిలువగానే చేనునుండి నేరుగా అక్కడికి వచ్చాడు.

"మగవాడివి ఆ విధంగా ఏడుస్తావా? ఏమీ చెప్పకుండా అట్లా ఏడిస్తే ఎట్లా తెలుస్తుంది? రా! అటుపోయి కూర్చుందాం" అన్నాడు కొమరయ్య.

"పాపం! ప్రొద్దటినించి అన్నం తినలేదు. ఇన్ని సజ్జలు, దోసపిందెలే తిన్నడు" కనకయ్య దీనంగా అన్నాడు.

కొమరయ్య ఆశ్చర్యంగా కనకయ్యను చూచాడు. " ఏంది కనకయ్య! నువ్వు ఈ చేనుకాడ ఉన్నవు?" అన్నాడు.

"కోమటి శంభయ్యది ఈ చేను. నేను జీతానికున్న"

"మీ చేనేమైంది?"

"మా చేను అమ్మినంగదన్న? ఏయేటికి ఆయేడు శిస్తు యెళ్ళటమే కష్టమైంది. మాఅయ్య

చచ్చేముందే అమ్మేసి కోమటి శంభయ్యకు బాకీ కట్టినం. శంభయ్యే పాపమని జీతాని కుండమన్నడు'' అంటూ కండ్లకు నీళ్ళు తీసుకొన్నాడు కనకయ్య. "సరే! నా దేందిగాని, అయ్యగారి సంగతేందో కనుక్కో ముంజాత'' అన్నాడు కనకయ్య.

కంఠీరవం కనకయ్య మాటలు శ్రద్ధగావింటూ తన దు:ఖాన్ని ఆపుకున్నాడు.

'' ఊళ్ళోకి పోదాం పద, ఏమొచ్చింది అడవిలో పడి ఉంటానికి'' కొమరయ్య కంఠీరవాన్నుద్దేశించి అన్నాడు.

కంఠీరవం దిగులుగా దిక్కులు పరికించాడు. "మనసు పట్టలేక నిన్ను పిలిపించిన, నీ పనులేమీ చెడిపోవుకద! నాకు నీవుతప్ప ఎవరు లేరని అనిపించింది.'' ఒక్కొక్కటి తూచినట్టన్నాడు.

"మళ్ళా మీ అన్నకు నీకు నడిచిందన్నమాట. నేను ముందరే దొర పిలిస్తే పోతిగద! ఆడ్నించి మీ ఇంటికే వచ్చిన. మీ ఇంట్లో ఎవరూ లేరు. మీ అన్న నాకు దోవలో కనపడ్డడు. దొరోరింటికి పోతుండె. సరే, అదంత పోనీయిగాని, ఊళ్ళోకి పొదాంపద! మా యింటకిరా! నీకేం భయంలేదు. లే పోదాం'' కొమరయ్య బలవంతం చేశాడు.

"కొద్దిగా చీకటి పడని. లేకుంటే మావాండ్లకు తెలుస్తుంది. మా అమ్మవచ్చి ఆరాటం చేస్తుంది. అప్పుడు ఇంటికిపోక తప్పదు. మాఅన్నయ్యను కలిసికోక తప్పదు. అతను ఏదో అంటాడు. నేను ఊరుకోను. పైగా మా అన్నయ్య నన్ను ఇంట్లోంచి పెళ్ళి పొమ్మన్నాడు కూడా'' కంఠీరవం అన్నాడు.

"మీ అన్నయ్య అనగానే అయింది? పెద్దమనిషి మీ అమ్మ లేదు? ఊళ్ళో పెద్దమనుషులు లేరు? మంచీ, చెడ్డా ఏమీలేకుండా ఇట్లా జరుగుతుంటే ఎవరు ఊరుకుంటారు?'' కొమరయ్య ధైర్యంగా మాట్లాడాడు.

'' ఏందో పాడు ఊరు. అన్నిటికీ దొరేనాయె. ఏం నాయం పాడైతది'' తిరిగి కొమరయ్య నిరుత్సాహపడ్డాడు. "సరే నీ యిష్టం, చీకటి పడ్డాకనే పోదాం'' అని ఇద్దరూ ప్రత్యేకంగా ఒకచోట కూర్చున్నారు. అన్నకు తనకు జరిగిన పంచాయితీ వివరాలు కంఠీరవం చెప్పాడు. ముసి ముసి చీకటి పడగానే ఊరివైపు బయలుదేరారు. చేనుకాపరి పిల్లలు దీనంగా కంఠీరవాన్ని చూచారు. ఒక పిల్లవాడు "మళ్ళా రేపు వస్తే చాలా కంకులు తెంపిపెడ్తం'' అన్నాడు.

"దండం అయ్యగారు'' కనకయ్య అన్నాడు. వెంటనే పిల్లలంతా "దండం అయ్యగారు'' అని వికసించిన ముఖాలతో ఒకరినొకరు చూచుకున్నారు

(మిగతా వచ్చే సంచికలో) ------ ------ ముగింపు ----------------